జాతీయకవి పద్మశ్రీ

# జ్ఞానానందకవి

## జీవితం - సాహిత్య ప్రస్థానం

ఆచార్య ఎస్. శరత్‌జ్యోత్స్నా రాణి

నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతికశాఖ, సాంస్కృతిక మండలి

తెలుగు అకాడమి, హైదరాబాదు

Blank Page

తెలుగు అకాడమి ప్రచురణ

లఘు గ్రంథం (మోనోగ్రాఫ్)

# జాతీయకవి పద్మశ్రీ జ్ఞానానందకవి
## జీవితం - సాహిత్య ప్రస్థానం

రచయిత

**ఆచార్య ఎస్. శరత్‌జ్యోత్స్నారాణి**

ప్రొఫెసర్

హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం

హైదరాబాదు

**4వ ప్రపంచ తెలుగు మహాసభలు**

**27,28,29 డిశంబరు, 2012**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

తెలుగు అకాడమి, హైదరాబాదు

*jaatiiyakavi padmasree gnaanaanandakavi jiivitam saahitya prasthaanam*

*a monograph published on the occasion of 4th World Telugu Conference*

*Author*

Prof. S. Saratjyothsna Rani

First Edition : 2012

Pages : Pp. xvi + 88 + iv

©
Telugu Akademi, Hyderabad

Copies : 5000

Price : Rs. 25/-

Published by TELUGU AKADEMI, Hyderabad- 500 029 (Andhra Pradesh) under the Centrally Sponsored Scheme of Production of Books and Literature in Regional Languages at the University level of the Goverment of India in the Ministry of Human Resource Development, New Delhi.

*All rights whatsoever in this book are strictly reserved and no portion of it may be reproduced by any process for any purpose without the written permission of the copyright owners.*

***Published, Printed & Distributed by***

**Telugu Akademi**
**Hyderabad**

***Laser Typeset at***

Telugu Akademi, Hyderabad

***Printed in India***

Printed at M/s. Anu Printers, Hyderabad

యన్. కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాదు

# ముఖ్యమంత్రి
## ఆంధ్రప్రదేశ్

---

## సందేశం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒక్క వేదికపైకి తీసుకువచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డిశంబరు 27 నుంచి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్యక్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగువారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకొంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికీ ఈ మహాసభలు ఎంతోగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వమూ ప్రపంచ సభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాల్ని ఎలా మెరుగుపరచాలీ తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలి అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవవైవిధ్యసదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారతదేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన

విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని పలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశవిదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్జ్వలమైన సభల నిర్వహణకు సమాయత్తమైంది. ఈ సభలలో సదస్సులు, తెలుగువారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితకళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు మొదలైన ఎన్నో అంశాలతో పాటు, పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతున్నది.

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సమావేశాల సందర్భంగా ప్రచురించే లఘుగ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాము.

కిరణ్ రెడ్డి

(యన్. కిరణ్ కుమార్ రెడ్డి)

సి. దామోదర రాజనరసింహ

# ఉపముఖ్యమంత్రి
## ఆంధ్రప్రదేశ్

---

## అభినందన

**ఏ దేశమేగినా, ఎందుకాలిడినా**

**పొగడరా నీతల్లి భూమి భారతిని**

**నిలపరా నీజాతి నిండు గౌరవము**

అన్న మహాకవి రాయప్రోలు వాక్కులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు నిత్యం స్మరించుకోతగినవి. దేశంలోని అన్ని రాష్ట్రాలలోనూ, ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ తెలుగు ప్రజలు తమ ప్రతిభా పాటవాలను నిరూపించుకుంటూ ప్రశంసలు పొందుతున్న ఈ సమయంలో నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో మన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నది. ఇది తెలుగు భాషాభిమానులకూ, కళా సాంస్కృతిక రంగాలలో కృషి చేస్తున్నవారికీ ఒక పండగ.

ప్రపంచీకరణ నేపథ్యంలో మాతృభాషలను, మాతృసంస్కృతిని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత. ఈ సందర్భంలో తెలుగు భాష, జాతి వికాసం కోసం నిరంతరంగా కృషిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు భాషా సంస్థ అయిన తెలుగు అకాడమికి 150 లఘుగ్రంథాలను(మోనోగ్రాఫ్‌లను) రాయించి పుస్తకాలుగా తెచ్చే అవకాశం కల్పించాం. తెలుగు భాష, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, తెలుగుభాషోద్యమాలు, సాహిత్యకారులు, సంఘసంస్కర్తలు, కథ, నవల, వ్యాసం, కవిత్వం లాంటి వివిధ సాహిత్య ప్రక్రియలు, ఛందస్సు, ప్రకృతివైద్యం, ప్రాచీన ఆధునిక సాహిత్య సాంస్కృతిక విషయా లన్నింటిపై, సాహిత్యచరిత్రలపై పుస్తకాలు రాయించి ముద్రిస్తున్న తెలుగు అకాడమిని అభినందిస్తున్నాను. కొద్ది సమయంలో పుస్తకాలు రాయించి ముద్రించడం అనేది ఓయజ్ఞంగా భావించి చేస్తేనే తప్ప ఈ పని పూర్తి కాదు, ఆ పనిని తెలుగు అకాడమి విజయవంతంగా నిర్వహిస్తున్నది.

ఇప్పుడు నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభలు, ఈ సందర్భంగా ప్రచురిస్తున్న పుస్తకాలు మన భాషను, జాతిని, సంస్కృతిని, చరిత్రను సమున్నతంగా నిలబెట్టే యజ్ఞంలో, తెలుగు భాషా పరిరక్షణలో ఎంతో ఉపయోగపడతాయని ఆశిస్తున్నాను. తెలుగు భాష పరిరక్షణకోసం, ఔన్నత్యం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జరుగుతున్న ఈ ప్రపంచ తెలుగు మహాసభలను ఆహ్వానిస్తూ, ఇన్ని పుస్తకాలు ముద్రిస్తున్న తెలుగు అకాడమి సంచాలకులకు, రచయితలకు మరియు అకాడమి సిబ్బందికి అభినందనలు తెలుపుతూ ప్రపంచంలో ఉన్న 18 కోట్ల మంది తెలుగు ప్రజల అభ్యున్నతి కోరుతూ.. మరోసారి అందరికీ నాహృదయ పూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

"తల్లి నుడికంటె పరమామృతంబుకలదె"

(సి. దామోదర రాజనరసింహ)

**V. VASANT KUMAR,** B.Sc.(Ag.); M.B.A
Minister for Tourism & Culture,
Archgology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat
Hyderabad - 500 022
Phone : 040-23454168,
23450541
Fax :040-23450899

# ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తరవాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు, మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింపజేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచుకునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు, తెలుగు వారి సంస్కృతి బహుముఖీయమైంది. అందులో భాష, సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకొని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే 'ప్రపంచ తెలుగు మహాసభల' నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల పునశ్చరణ, వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి, అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటికప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే" ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమి, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వసిస్తున్నాను.

వ. వసంతకుమార్

**వట్టి వసంతకుమార్**

# భూమిక

1968లో ప్రభుత్వం అప్పటి విద్యాశాఖమంత్రి మాన్యశ్రీ పి.వి. నరసింహారావు గారు తొలి అధ్యక్షులుగా స్థాపించిన తెలుగు అకాడమి తెలుగు భాషా వికాసం కోసం చేస్తున్న కృషి అపరిమితం. పాఠ్యపుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలు, మోనోగ్రాఫ్‌లు, నిఘంటువులు, మాండలిక పదకోశాలతో పాటు భాష, సాహిత్యం, సంస్కృతికి సంబంధించిన అనేక పుస్తకాలు ప్రచురిస్తూ తెలుగుభాషకోసం అకాడమి చేస్తున్న సేవలు అద్వితీయం. తెలుగు భాష, జాతి, సంస్కృతి ప్రేమికుడయిన మాన్యశ్రీ సి. దామోదర రాజనరసింహ గారు అధ్యక్షులుగా తెలుగు అకాడమి తన పరిధిని మరింత విస్తరించుకొని తెలుగు భాషలో శాశ్వతంగా మిగిలిపోగల అనేక పుస్తకాలను తీసుకువస్తున్నది. మహాకవి గుర్రం జాషువా పరిశోధన కేంద్రం నెలకొల్పి తద్వారా ప్రతి ఏటా సాహిత్యరంగంలో విశిష్టసేవ చేసిన ముగ్గురిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున నగదు పురస్కారాలు ఇవ్వడం సాహిత్యవేత్తలకు, తెలుగు భాషకు చేస్తున్న సేవకు నిదర్శనం. తెలుగు వారి చరిత్రలోనే ఇది ప్రథమం. అకాడమి ప్రచురించే పుస్తకాలతో పాటు ఇటీవలి కాలంలో గురజాడ సాహిత్యసర్వస్వం, జాషువా పరిశోధన కేంద్రం తరపున పుస్తకాలు ప్రచురించింది. తన 45 సంవత్సరాల చరిత్రలో దాదాపు 3500 శీర్షికలతో వివిధ గ్రంథాలను ప్రచురించి భారతదేశంలోని అకాడమిలన్నింటిలో తెలుగు అకాడమి అగ్రస్థానంలో నిలబడటం తెలుగు వారి కృషికి గర్వకారణం. రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు, సభలు, చర్చాగోష్ఠులు నిర్వహించడంతో పాటు ఇటీవల జాషువా జయంతి సందర్భంగా "శతకవితావసంతం" నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా కవితాచైతన్యానికి, కవులకు ప్రోత్సాహాన్నిచ్చింది తెలుగు అకాడమి.

2012 డిశంబర్ 27,28,29 తేదీల్లో తిరుపతిలో జరగనున్న నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రభుత్వం అకాడమి పై ఉన్న నమ్మకంతో 150లఘు గ్రంథాలను (మోనోగ్రాఫ్‌లను)రాయించి ప్రచురించే బాధ్యతను అప్పగించింది. తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సామాజిక శాస్త్రాలు, విజ్ఞాన శాస్త్రాలు, జాతి, సంస్కృతి ఒకటేమిటి తెలుగుకు సంబంధించిన వివిధ అంశాలను తీసుకొని పుస్తకాలు రాయించడం జరిగింది. తెలుగు భాషా, సాహిత్యాలలో లబ్ధ ప్రతిష్ఠులైనవారితో పాటు ఆయారంగాల్లో నిపుణులైన వాళ్ళతో పుస్తకాలు తయారు

చేయించి ప్రచురిస్తున్నాం. తెలుగు భాషను, సాహిత్య సంస్కృతులను, సమస్త విషయాలను సమున్నతంగా నిలబెట్టగలమన్న నమ్మకంతోనే ఈ కృషి చేస్తున్నాం. తెలుగు సాహిత్యంలో అనర్ఘరత్నాలనదగిన, జాతి సంపదనదగిన పుస్తకాలను ప్రచురించే ఈ సువర్ణ అవకాశం మాకు కల్పించడమేగాక ఆర్థిక వనరులను అందించి ప్రోత్సహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారికి, సాంస్కృతిక శాఖ, సాంస్కృతికమండలివారికి కృతజ్ఞతలు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాన్యశ్రీ యన్. కిరణ్ కుమార్ రెడ్డి గారికి, ఉపముఖ్యమంత్రి, ఉన్నత విద్యాశాఖా మంత్రి తెలుగు అకాడమి అధ్యక్షులు మాన్యశ్రీ దామోదర రాజనరసింహ గారికి; సాంస్కృతిక శాఖామాత్యులు మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి కృతజ్ఞతాభివందనాలు.

4వ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణకుగాను ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి సంఘం సభ్యులు :

**శ్రీ ఆర్. వి. రమణమూర్తి,** అధ్యక్షులు, సాంస్కృతిక మండలి

**శ్రీ మండలి బుద్ధప్రసాద్,** రాష్ట్ర అధికారభాషా సంఘం అధ్యక్షులు

**డా. జె. బాపురెడ్డి,** ఐ.ఎ.ఎస్.,(రి)

**శ్రీ కె.వి. రమణాచారి,** ఐ.ఎ.ఎస్.,(రి) సాంస్కృతిక శాఖ, సలహాదారులు

**శ్రీ పి. భాస్కర్,** ఐ.ఎ.ఎస్. ముఖ్య కార్యదర్శి, ఆర్థిక శాఖ, ఆం.ప్ర.

**శ్రీ ఎల్. వి. సుబ్రహ్మణ్యం,** ఐ.ఎ.ఎస్. కార్యనిర్వహణాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానం

**శ్రీమతి చిత్రా రామచంద్రన్,** ఐ.ఎ.ఎస్., ముఖ్య కార్యదర్శి, రెవెన్యూ శాఖ (దేవదాయ)

**ఆచార్య ఎల్లూరి శివారెడ్డి,** ఉపాధ్యక్షులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

**శ్రీ జి. బలరామయ్య,** ఐ.ఎ.ఎస్., ప్రభుత్వ కార్యదర్శి, సాంస్కృతిక శాఖ

**శ్రీ జి. ఎన్. రావు,** ఐ.ఎ.ఎస్.(రి) ప్రత్యేకాధికారి, శిల్పారామం

**ఆచార్య కె. యాదగిరి,** సంచాలకులు, తెలుగు అకాడమి

**డా. రాళ్లబండి కవితా ప్రసాద్,** సంచాలకులు, సాంస్కృతిక శాఖ

ప్రపంచ తెలుగు మహాసభల రూపకల్పనతో పాటు లఘుగ్రంథాల తయారీలో తమ సహాయ సహకారాలు అందించినందుకు ఈ కమిటీ వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాం.

4వ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురిస్తున్న మోనోగ్రాఫ్‌లను అత్యంత స్వల్ప వ్యవధిలో తయారుచేయించడం జరిగింది. ఈ గ్రంథాల్లో ఏవైనా దోషాలు, పొరపాట్లు దొర్లినట్లు పాఠకులు గమని సహృదయంతో వాటిని మా దృష్టికి తీసుకొని వస్తే మలి ముద్రణల సవరించగలమని తెలియజేస్తున్నాం.

**ధర్మమనుడు, తత్త్వమనుడు, యోగమనుడు**
**ప్రాణిసాధింపగల సకలపరమార్థములకు**
**తల్లిభాషప్రధాన సూత్రంబయగుట**
**భాషకంటె నవ్యులకు తపస్సులేదు**

**ఆచార్య కె. యాదగిరి**
**సంచాలకులు**

Blank Page

# తెలుగు అకాడమి సమన్వయ సంఘం


ఆచార్య కె. యాదగిరి

సంచాలకులు

డా॥ ఎం. మాణిక్యలక్ష్మి

ఉపసంచాలకులు

డా॥ ఎన్. యోగిబాబు

డా॥ టి. అరవింద

శ్రీ టి. రాజేందర్ కుమార్

శ్రీ ఎం. వెంకటేశం

శ్రీమతి సి. శ్రీవిద్య

శ్రీ ఎస్. భూపాల్‌రెడ్డి

శ్రీమతి కె. గీతాంజలి

డా॥ ఎం. శైలజ

డా॥ ఎస్.ఎ.టి. రాజ్యలక్ష్మి

శ్రీమతి వి. అరుంధతి

శ్రీ ఎస్. వేదవ్యాస్


---

* *ఈ గ్రంథంలో ప్రచురితమైన విషయాలకు, వివరాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలు/రచయిత్రులే బాధ్యులు.*

# ప్రవేశిక

ఆధునిక పద్య కవుల్లో పద్యానికి జీవంపోస్తూ పద్యాన్ని సామాజిక అభ్యుదయానికి వాహికగా చేసుకొని తన జీవితాంతం పద్యాన్నే ప్రేమిస్తూ సాహిత్య లోకానికి హృద్యమైన నలభై పద్య కావ్యాలను అందించిన సహజ కవి, కళాప్రపూర్ణ, పద్మశ్రీ జ్ఞానానందకవి. ఆమ్రపాలి, గోల్కొండ పాంచజన్యం వివేకానాద గానం, వంశధార, రాజధాని, గాంధి మొదలైన కావ్యాల ద్వారా పద్య విద్యా ప్రభువుగా, విద్వత్‌కవి చూడమణిగా మానవతావాదిగా, గుర్తింపుపొంది ప్రశంసలను అందుకున్నారు. జ్ఞానానందకవి గారు విశ్వనాధ శిష్యులు. సరళంగా పద్యరచన చేస్తూ రసరమ్యకావ్యాలను అందించిన పద్మశ్రీ జ్ఞానానందకవి గారి కావ్యాలను అనుశీలించి, మోనోగ్రాఫీను రాసాను. ఇందులో నాల్గు అధ్యాయాలున్నాయి. మొదటి అధ్యాయంలో జ్ఞానానందకవి జీవిత రేఖలను వివరించాను. రెండవ అధ్యాయం (విభాగం)లో జ్ఞానానంద కవి కధా కావ్యాలు వస్తు వివేచన చేసాను. మూడవ అధ్యాయంలో జ్ఞానానందకవి

ఖండకావ్యాలు-సామాజిక వివేచన చేసాను. నాల్గవ అధ్యాయంలో సాహితీ రంగంలో జ్ఞానానంద కవిగారి ప్రస్థానాన్ని వివరించి రాసాను.

కవిత పూర్వజన్మ గంధర్మ వల్లనే కలుగునన్నట్లు ఆశుకవిగా తొమ్మిదవ ఏటనుంచే సరళమైన పద్యాలను రాస్తూ తెలుగు తల్లిని పద్య కావ్యాలతో అలరించిన జ్ఞానానందగారిపై ప్రపచ తెలుగు మహాసభల సందర్భంగా తెలుగు అకాడమి, అధ్యక్షులు ఆచార్య యాదగిరి గారు మోనోగ్రాఫ్ రాయించినందుకు అభినందనలను అందిస్తున్నాను.

విద్యానగర్. — ఆచార్య ఎస్. శరత్జ్యోత్స్నారాణి

హైదరాబాద్ - 44.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ప్రవేశిక | | i |
| I. | జ్ఞానానందకవి జీవిత విశేషాలు | 1 |
| II. | జ్ఞానానందకవి కథా కావ్యాలు - వస్తు వివేచన | 26 |
| III. | జ్ఞానానందకవి ఖండ కావ్యాలు - సామాజిక వివేచన | 61 |
| IV. | ఆధునిక సాహిత్య రంగంలో జ్ఞానానందకవి ప్రస్థానం | 79 |

# 1

# జ్ఞానానందకవి జీవిత విశేషాలు

జాతీయకవి పద్మశ్రీ జ్ఞానానందకవి జీవితాన్ని, రచనలను తెలుసుకొనే ముందు ఆ మహాకవి మనస్సులో తారాడుతున్న భావ వీచికలను మనం గమనిస్తే ఆ కవి హృదయం ఎప్పుడు సమ సమాజ చైతన్యానికే అంకితమవుతుందని అర్థమవుతుంది. ఇంతకి ఆ కవి హృదయంలోని మాటలను నా జీవిత గాథ కావ్యంలోనివి.

"నిసర్గో జ్జ్వల భాసమాన హృదయులైన
సాహిత్య సుగంధులకు"

సాహిత్యం సత్యసౌందర్యాల ప్రగాఢ సమాశ్లేషం. సాహిత్యం హిత సంయుతం, లోకహితం సంతత గాఢనిద్రా దరిద్రాణమైన లోకాన్ని మేలుకొలుపు, చైతన్య భేరి భారికృతం. జాతి జనుల గుండెల్లో మరింతగా, సోదరులంతా పంచుకొనే వెలుగు రవ్వల జడిగా, హృద్యంగా, నైవేద్యంగా, సామాజిక స్పృహ కలిగించే విధంగా సాహిత్య సృష్టి నిర్మించబడాలి. సాహిత్యం నేలవిడచిన సాముకాదు. అంధకారంలోంచి ప్రకాశంలోకి, మృత్యువు నుంచి అమృతత్వంలోకి, అసత్యం నుంచి సత్యంలోకి, శోకం నుంచి ఆనందంలోకి నడిపించేదిగా సాహిత్య దీపం వెలగాలి. శతాబ్దాల గారడి కాదు, పరమ పద సోపానం, తేనెసోన. శాంతా హృదయాలకు, అశాంత చిత్తాలకు విశ్రాంతి ప్రసాదం. సంసార విషవృక్షానికి అమృత ఫల ప్రదానం. నేలకు నీలాకాశానికి

నడుమ రంగుల ధనుస్సు సాహిత్యం. సాహిత్యం గురించి ఎంతైనా చర్చ చేయవచ్చు. ఎంతోమంది సాహితీ పరులు, విమర్శకులు సాహిత్య చర్చ చేయుచున్నారు. వారి చర్చల ఆలోచనలు దేశ సంస్కృతికి దారి తీసేవిగా ఉండాలి. ఆవిషమ సంస్కృతి నుండి సమ సంస్కృతికి అడుగులు వేయగలగాలి. సంస్కృతి లేనిదే దేశానికి లేదు నిష్కృతి. నీతి నిజాయితీలే రచయితలకు, కవులకు మూల ద్రవ్యం. అట్టి వారు వాల్టేరు, రూసో, మాజిని తమ రచనల ద్వారా సమాజాన్ని మేల్కొలిపినట్లే మేల్కొలుపుదురు. ఏ కళ అయినా సరే ఈ భూతల సంబంధం కలిగినప్పుడే అది ఉజ్జీవమవుతుంది. ఈ భూతలాన్ని వదిలి విస్మరించిన కళ గడ్డి పరకలా బలహీనమవుతుంది. భావావేశంలో ఉన్న కవి స్వర్గం నుండి భూమిని, భువి నుండి స్వర్గాన్ని వీక్షిస్తాడు. అతని ఉహా శక్తి ఆగోచరమైన విషయాలకు రూపం కల్పిస్తుంది. అతని కలం అప్రధాన్యంగా ఉన్న వాటికి ఒక గుర్తింపు నిచ్చి ఆకారాన్ని కల్గిస్తుంది. నా జీవన కవితా యాత్రా పథంలో ఉత్సాహాన్ని అందించిన భాషా బందువులనేకులున్నారు అని అంటారు. జ్ఞానానందకవి పదహారణాల తెలుగు బిడ్డ. కవి కట్టు లోను, బొట్టు లోను, జీవిత లక్ష్యం లోను, రచనా విధానం లోను భారతీయ సంస్కృతి కనిపిస్తుంది. నేడు తలెత్తి తిరుగుతున్న వాదాలు, వర్గాలు, వర్ణాలు, మతాలే మార్గంలో పయనిస్తున్నాయో ప్రతి భారతీయుడికి తెలుసు. నేనిందులో దేనికి అయిన వాడనుకాను. మానవతా వాదానికే కట్టుబడిన వాడనంటారు.

ఆహ్వాన కావ్యంలో కవి ఇలా

**"నాది భారతమ్ము మీదట నాంధ్రమ్ము**
**లేదు మతము గితము లేదు నాకు**
**సత్య పథమే నాకు స్వర్గ ధామము నాకు**
**అంతరంగ శుద్ధి యాత్మబలము"...!**

ఈ మాటలు కవి మత విద్వేషంతో చెప్పినవి కావు. మతం పేరుతో కొందరు దుష్టులు చేసే అన్యాయాన్ని సూచించడమే కవి ఉద్దేశం.

ఏడు పదుల జ్ఞానానందకవి సాహిత్య ప్రస్థానాన్ని గురించి చెప్పాలంటే మూడు బాటలు, పది మలుపులు అని ప్రముఖ విమర్శకులు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు అంటారు ఒకచోట. జ్ఞానానందకవి గారు విశ్వనాథ శిష్యులు, వారు ఎన్నుకున్న వస్తువు కంటే, చెప్పే భావం కంటే అభివ్యక్తీకరిస్తున్న రచనా శిల్పానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుండేవారని, పద్య రచనా శిల్పంలో శబ్దార్థ మాధుర్య సుగుణాలను పలురకాలుగా ప్రదర్శించగలిగే ప్రజ్ఞను సాధించారని, ఆంధ్ర విశ్వకళా పరిషత్తు వారిని కళా ప్రపూర్ణ బిరుదుతో సత్కరించిందని, బహుశ ఆయన పద్య శిల్పానికే ఇచ్చారని ఆంధ్రులంతా భావిస్తారని పేర్కొన్నారు.

ఒక మర్రి చెట్టు నీడలోంచి, ఒక మామిడి చెట్టు నీడలోంచి బయటకు వచ్చి ఒక మందారపు చెట్టులాగా పద్యాల పుల శాలువ కప్పుకొనినించున్న కవితా మూర్తి, కళాప్రపూర్ణ సురగాలి తిమోతి జ్ఞానానందకవి. కాకినాడలో ఆ కవితా మూర్తి తిరుగుతుంటే చూచిన గుబ్బల మాధవమూర్తి గారు అక్షరాల ఫోటో తీసి శార్దూల వృత్తం ప్రేమతో బిగించి దేశానికిచ్చారు.

**"రిక్షాపై కవిరాజు శుభ్రతర కీర్తిప్రోల్ల సద్దేహుడై**
**దీక్షా దక్షత కాకినాడ పుర వీధీ రమ్య తేజస్వి యై**
**సాక్షాత్ శ్రీ కవి సార్వభౌముడనగా సంచారముంజేసెడిన్**
**అక్షీణాంధ్ర కవిత్వ దుర్వహుడు జ్ఞానానందుడు ఉత్సాహియై"**

(- జ్ఞానానంద కవి జీవితం వాఙ్మయ సూచి) (పేజి, 25)

తెలుగునాట ఆధునిక యుగం ప్రారంభమై ఆధునిక జీవితం ఆధునిక తాత్త్విక చింతన ఆధునిక సాహిత్యం విస్తరిస్తున్న దశలో జ్ఞానానంద కవి జీవించారు. కాని భాషలోను-సాహిత్యం లోను కవిగారు నవ్య సాంప్రదాయ మార్గంలో నడిచారు. జ్ఞానానంద కవిగారు సామాజికంగా, ఆర్థికంగా ఒక సాధారణ స్థితి నుంచి ఎదిగి సాహిత్యలోకంలో సాంస్కృతిక ప్రపంచంలో గుర్తింపు పొందే స్థాయికి చేరుకోవడం మన సమాజంలో ఒక అసాధారణ విషయం

అంతరువులే ముఖ్య సిద్ధాంతమైన హిందూ సమాజంలో తనదైన ప్రత్యేక ముద్రతో, అపారమైన వస్తు వైవిధ్యంతో రచనా వైశిష్ట్యం వారి ఖండకావ్యాలకు సహజాలంకారాలని సాహిత్య చారిత్రక విమర్శకులు ఆచార్య కె.కె.రంగ నాథాచార్యులు పేర్కొన్నారు.

పద్మశ్రీ జ్ఞానానందకవి గారు బొబ్బిలి తాలూకా పెదపెంకి గ్రామంలో 1922 వ సంవత్సరంలో జూలై 16వ తేదీన జన్మించారు. జ్ఞానానందకవి గారి తల్లిదండ్రులు సురగాలి పాపమ్మ, ఎల్లయ్య. తాత రామయ్య, నాయనమ్మ లక్ష్మమ్మ గార్లు. జ్ఞానానందకవి గారు తన జన్మ స్థలమైన పెదపెంకిని గురించి – "ప్రభంజనం" అనే కావ్యంలో వర్ణించారు.

**"పలికించె నెట చాటపర్తి లచ్చనరాజు**
**వాణిచే సాహితీ వీణ మీటి**
**విరచించె సోమసుందర కవి యెచ్చోట**
**సమదర్శి మానవ జన్మ రచన**
**పఱపించె నెట గుళ్ళపల్లి యప్పలస్వామి**
**దానమ్ముకు నేల నాణెములను**
**వెఱపించె నెటగుంట వెంకయ్య వస్తాదు**
**దయ్యాల తోపులో దయ్యములను"**
**"నల్ల వంశమునకు నగయైన సిగయైన**
**వాని చదువులమ్మ వలచెనెచట**
**అచట బుట్టినాడ నది జన్మ భూమియౌ**
**విద్దియలకు టెంకి పెద్దపెంకి"**

ఎల్లయ్యగారు రైతు కూలిగా పనిచేస్తూ తమకున్న కొద్దిపాటి పొలాన్ని సేద్యం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవారు. జ్ఞానానందకవి రెండేళ్ళ వయస్సులో తల్లి పాపమ్మ గారు పరమపదించారు. తన కన్నా ముందు పుట్టిన తన అక్క కాపురానికి వెళ్ళకముందే మరణించింది. అటువంటి దైన్య పరస్థితిలో

ఎల్లయ్య గారు పసికందు బాధ్యతలను తన తల్లియైన లక్ష్మమ్మ గారికి అప్పగించారు. కొన్నాళ్ళకు ఎల్లయ్య గారు తన గ్రామంలోనే పెంకి వంశానికి చెందిన పోలమ్మను వివాహం చేసుకున్నారు. అందువల్ల పాపమ్మ సోదరుడు గుంట యోహానుగారు బాలుడైన జ్ఞానానంద కవిని తనతో పాటు తన గ్రామానికి తీసుకొని వెళ్ళారు.

జ్ఞానానంద కవి గారికి ఐదేండ్ల ప్రాయంలోనే మేనమామ అక్షరాభ్యాసం చేయించారు. ఐదేండ్ల ప్రాయం కలిగి ఉన్న జ్ఞానానంద కవి తన మేనమామ పలకమీద రాసిన అక్షరాలన్నింటిని చెరిపేసి చిటికెలో మరలరాసి తన మేన మామకు చూపించేవారు. తన మేనమామ తీరిక సమయంలో భాగవతం, రామాయణాల్లోని పద్యాలను చదివి వినిపించేవారు. వారు చదివి చెప్పినప్పుడు విన్న పద్యాలను జ్ఞానానందకవి తిరిగి వారికి అప్పజెప్పేవారు. మేనమామ జ్ఞానానందకవిలో ఉన్న విద్యాసక్తిని కనిపెట్టి ప్రోత్సహించారు. భవిషత్తులో తన కవితా సాధనాశక్తికి ఈ ధారణాపటిమ తోడ్పడిందని కవిగారు అన్నారు. ఈ విధంగా తన జీవితానికి ఒక మహా విలక్షన మైనమార్గాన్ని నిర్దేశించి తన సాహిత్యకళకు ప్రోత్సాహాన్ని, ప్రోద్బలాన్ని తన మేనమామ ఇచ్చినందుకు కృతజ్ఞతలను తెలుపుతూ మేనమామ మీద కలిగిన భక్తి భావంతో ఈ కవి.

**"నన్ను ప్రేమ గాంచి యన్నంబు పెట్టించు**
**వీర కథలు చెప్పి విద్య మప్పి**
**నాపురోభివృద్ధి నయమార గాంక్షించి**
**సుమతి బ్రదుకు తెరువు సూపినావు**
**గురువుగారి మేనల్లుడు చెఱువునీట**
**మునిగి నీరు త్రాగెనను వార్త విననతోనే**
**గుండె బాదు కొనుచు నేడ్చుకొనుచువచ్చి**
**నన్ను ముద్దాడుటలు గుర్తులున్న వకట"**

మేనమామ వద్ద ఉన్నప్పుడు ఆ ఊరి చెరువుకు కొందరు స్నేహితులతో జ్ఞానానంద కవి వెళ్ళారు. చెరువు మధ్యలో స్తంభ ముంది. మిగిలిన స్నేహితులకు ఈత వచ్చు. ఈతరాని జ్ఞానానంద కవి చెరువు మధ్యలో నున్న స్తంభాన్ని ముట్టుకోవాలని శ్రమించి వెళ్లారు. స్తంభం దగ్గరకు చేరకుండానే నీటిలో మునిగిపోతున్న జ్ఞానానంద కవిని మిత్రులు ఒడ్డుకుతెచ్చి ఇంటికి చేర్చారు. ఈ సంఘటన మిత్రుల ద్వారా విన్న మేనమామ పరుగు పరుగున ఇంటికి వచ్చి జ్ఞానానందకవికి ఉపచర్యలు చేసారు. పెద్ద గండం గడిచిందని మేనమామ హృదయానికి హత్తుకున్నాడు. జ్ఞానానంద కవి మనస్సు మేనమామపై భక్తితో ప్రణమిల్లింది. తన భవిష్యత్తుకు సాహిత్య మార్గానికి సమధిక సాను రాగసంభరిత హృదయుడైన మేనమామ యోహాను గురించి ఈ కవి కీర్తిస్తూ బాల్య గురువు తన మేనమామ అని అతని క్రమశిక్షణలో మెలిగిన వాడని చెప్తూ....

**"నా మేనల్లుని సాహితి గరిమనాంధ్ర క్షోణిలో గల్గ వి**
**ద్యామాన్యాద్యులు మెచ్చు కోగలుగుచో నానందముంబొందెదం**
**చా మూర్తమ్మున పల్కు నీయమృత వాక్యాలిప్పు డేలున్ గుణ**
**స్వామీ గుంట కులాబ్ది చంద్రమ నమస్కారమ్ము నీ ప్రేమకున్"**

చదువులేని తన తండ్రి చిన్నప్పుడు నేర్పించిన భక్తి రస మ[illegible]న్ని, దయా స్వభావాన్ని జ్ఞానానంద కవి స్మరిస్తూనే ఉన్నారు. తన తల్లి [illegible] కవళికలు ఎట్టివో తెలియకున్నా ఆ తల్లి మీద మమకారంతో ఆమె క[illegible]తో పుట్టినందుకు జన్మ చరితార్థ మని జ్ఞానానంద కవి భావిస్తారు. వారి [illegible]ల ప్రేమతో ఈ కవి రాసిన పద్యాలను తన కావ్యాల్లో పేర్కొన్నారు.

**"స్మరియింతున్ వినయమ్ముతో మనసులో సన్మార్గ మందేనిరం**
**తరమున్ యానము చేసి దైవమును శుద్ధంబైన స్వాంతాన సం**
**బరమే పారగ గొల్చు తండ్రిని దయామాధుర్య భావోన్నతున్**
**సురగాల్లెల్ల య నామధేయుని విశిష్టున్ సత్య వాక్శీలునిన్"**

**"ననుగని రెండవ యేటనే**
**తన తనువును వీడి స్వర్గ ధామము జేరెన్**

జనిన పవిత్ర హృదయ నా
జననిని "పాపమ్మ" దలతు జన్మ తరింపక
చుట్టములకు వీడు సొబగైన వాడేన
టంచు పలుకు తల్లి కంజలింతు
అమ్మ లేని నన్ను నాదరమ్మున బెంచి
మంచి మార్గ మందు మసలజేసి
ఓమి నట్టి ఘన పితామహి లక్ష్మాంబ
సంచరించునాదు స్వాంతమందు"

పెదపెంకిలో ఆది ఆంధ్రులకు ప్రత్యేకంగా ఎలిమెంటరీ పాఠశాల ఉంది. అది జిల్లా బోర్డు ఆధీనంలో ఉండేది. ఆ పాఠశాలలో అలజంగి ఎల్లయ్య గారనే ఉపాధ్యాయుడు ఉండేవారు. విద్యార్థులందరినీ తన పిల్లలవలె అభిమానంతో ఆదరించేవారు. ఆయన ఒకరోజు పాఠం చెబితే ఆ పాఠం నెలరోజులకు సరిపోయేదట. అంటే వీరు అంత చక్కగా విద్యార్థులకు పాఠాన్ని బోధించేవారు.

ఆ రోజుల్లో అక్షరాలు నేర్చుకోవాలంటే ఎక్కువగా ఇసుకమీదే రాసి నేర్పించేవారు. కొందరు పలక మీద దిద్దేవారు అక్షరాలు చూపని వారికి కోదండం వేయించేవారు. గోడకుర్చీ వేయించేవారు. కింద ముళ్ళకంప పెట్టి, దూలాన్ని పట్టుకొని వ్రేలాడమని చెప్పి విద్యార్థులను కర్రతో కాని, వేప బెత్తాలతో కాని కొట్టేవారు. శిక్ష ఎంత కఠినంగా ఉన్నా చదువు అంత చక్కగా చెప్పే వారని కవిగారు తన బాల్యాన్ని గుర్తుచేసుకుంటూ అన్న మాటలివి.

## విద్యాభ్యాసం - ఉద్యోగ నిర్వహణ

భీముని పట్నంలో ఉన్న హయ్యర్ ఎలిమెంటరి పాఠశాలలో మేనమామ గారు చేర్పించారు. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కానూరు సమాయాలుగారు వీరు పెట్టిన ప్రవేశ పరీక్షలో జ్ఞానానందకవి ఉత్తీర్ణులయ్యారు. అందువల్ల ప్రధానోపాధ్యాయులు ఇతని తెలివికి ఆనందపడి నేరుగా రెండో

తరగతి ప్రవేశార్హతను కల్పించారు. లెక్కల్లో మాత్రం జ్ఞానానందకవి వెనుకపడినప్పటికీ మిగిలిన సబ్జెక్టుల్లో అందరికన్నా మిన్నగా ఉండేవారు. తరగతిలోని విద్యార్థులు ఇతని స్నేహాన్ని అభిలషించేవారు.

పేదరికం వల్ల బోర్డింగ్లో ఫీజు కట్టడమే కష్టంగా ఉన్న తండ్రి, ఎల్లయ్యగారు ఇతని భవిష్యత్తు రాణించాలని పుస్తకాలు కొనడానికి కూలి చేసి చిల్లర డబ్బులు ఇచ్చేవారు. సెలవుల్లో ఇంటి దగ్గర జ్ఞానానందకవి కూలిపని చేసి ఆ వచ్చిన డబ్బుల్లో కొంత మిగిల్చి ఫీజులు కట్టేవారు. పుస్తకాలు కొనేవారు.

జ్ఞానానందకవి ఆటపాటల్లో చురుకుగా పాల్గొనేవారు. పరుగు పందాల్లో అతన్ని మించిన వారు లేరనిపించుకునేవారు. చెడుగుడు, గోలికాయల వంటి ఆటల్లో చాలా బహుమతులు గెల్చుకున్నారు. బోర్డింగులో చదివే నీరుపేదలు చాలా కష్టాలు పడేవారు. అవి చెప్పడానికి అలవి కానివి. పాఠశాలను రోజు తుడవాలి, నీరుతోడాలి, కలుపు మొక్కలు ఏరాలి. ఇవి చేయకపోతే పేము బెత్తంతో గాని, బెల్టుతోగాని కొట్టేవారు. ఈ పనులకు చిన్నా పెద్ద తారతమ్యం లేదు. ఒకనాడు చిన్న వాడైన జ్ఞానానందకవి నీళ్ళు తోడడానికి వెళ్లి గిలకను పట్టుకోలేక కాలుజారి పడ్డారు బావికి ఇరుపక్కల పెద్దరాళ్ళు మెట్లు ఉన్నాయి. జ్ఞానానందకవి గట్టిగా తాడును పట్టుకున్నారు. ఇంతలో అటుగా వచ్చిన విద్యార్థులు ఆ తాడును గట్టిగా పట్టుకోవడం వల్ల బ్రతికి బయట పడ్డానని "నా జీవిత గాథ"లో కవిగారు వ్యక్తీకరించారు.

ఆనాటి బోర్డింగులో పెట్టే ఆహారాన్ని గురించి చెబితే ఆశ్చర్యంగాను ఆసక్తిగాను ఉంటుంది. మిషనరీల పాదాలుపట్టుకొని భక్తులుగా నటిస్తూ క్రైస్తవ (పెద్దలు) అధికారులు పిల్లలకు అన్నానికి బదులు అంబలి పోసేవారు. క్రైస్తవ అధికారులు మిషనరీలను తప్పు త్రోవ పట్టించేవారు. బోర్డింగులో ఉదయం పూట గంజి అన్నంతో పాటు రెండు తెలగ పిండి వడియాలు అదీకాకపోతే నంచుకోవడానికి చిన్న బెల్లపు ముక్క పెట్టే వారు. ప్రతి గురువారం మధ్యాహ్నం ఒక అరసోలేడు బియ్యపు అన్నం పెట్టేవారు. ఒకసారి విశ్వబ్రాహ్మణ విద్యార్థి బోర్డింగులతో ఆహారవిషయమై ఎదురు తిరగ్గా అతన్ని పాఠశాల నుంచి

బహిష్కరించారు. తిండి తిన్నా తినక పోయినా ఆయనపై సరస్వతి దేవి కటాక్ష్యం మెండుగానే ఉందని అంటారు. జ్ఞానానందకవిగారు ఆరోతరగతి చదివేటప్పటి మాట ఇది. అప్పయ్య శాస్త్రి అనే తెలుగు పండితుడు విద్యార్థులందరినీ సమతాను రాగంతో చూసేవారు. విద్యార్థులందరు ప్రధానోపాధ్యాయునికంటే వీరిపట్లనే భక్తి భావాన్ని కనపరచేవారు. వీరు వ్యాకరణ శాస్త్రంలో ఉద్దండులు. వీరి బోధనా మహాత్మ్యం తనను మేల్కొలిపిందని తెలుపుతూ ఈ కింది పద్యాన్ని రాసారు.

**"అప్పయ్య శాస్త్రి పేరుగలయట్టి యొకానొక పండితుడు మా**
**కెప్పుడు తెల్గు టీచరయి వ్యాకరణమ్మును భారతమ్ములో**
**నప్పటి పాఠముల్ హృదయ మందున నాటగా బోధసేసెనా**
**కప్పుడు నాటి బోధ స్మృతి యందు రగుల్కొని మేలు కొల్పెడిన్"**

ఏడవ తరగతిలో ఆదినారాయణ శాస్త్రి గారు కవిగారికి తెలుగు బోధించిన పండితులు. ఆయనవద్ద 'మధురైక సుశబ్దములన్ గణించితిన్' అని ఆ ఏడవ తరగతి లోనే తన కవిత్వానికి నాంది జరిగిందని పేర్కొన్నారు.

ఒకనాడు ఏడవతరగతిలో జరిగిన సంఘటన. తెలుగు పండితుడు ఉకార సంధి గురించి వివరిస్తుండగా సందేహం కలిగి మిక్కిలి తెగువతో జ్ఞానానందకవి ప్రశ్న వేసారట. ప్రారంభంలో అచ్చులను ఎందుకు వాడాలి హల్లులు ఎందుకు వాడకూడదు. అని అడగగా తెలుగు పండితుడైనా ఆదినారాయణ శాస్త్రి గారు వ్యాకరణాన్ని, దాని నియమాలను, తెలుగు భాషా సౌందర్యాన్ని గూర్చి వివరించారు. ఆయన హిత బోధవల్ల లక్షణ గ్రంథాలను చదవాలనే ఆసక్తి తనలో అధికమైందని కవిగారు...

**"అపుడు క్లాసులోన ఆదినారాయణ**
**శాస్త్రి వరుడు హితము సల్పి నట్టి**
**బోధ నా మనస్సు మోదింప లక్షణ**
**గ్రంథములను జదువగా దలచితి**

ఆంధ్ర కల్ప తరుపున కేడి ఛందశ్శాస్త్ర
మనెడి గ్రంథ రాజమును బజారు
నందు కొంటి చేతి యందు దమ్మిడిలేని
దెట్లు పొసగె గొనుట కిది లిఖింతు.

భోజనమ్ము కొఱకు రోజు నిచ్చెడు పప్పు
దప్పలంపు కూర తప్పకుండ
కొన్ని నాళ్ళు నమ్ము కొన్నాడ కలవారి
కుర్ర వాంఢ్ర కపుడు కొంత ముట్ట"

"అ డబ్బులతో కొంటిని
వేడుక్క మీరంగ కవన విద్యకు తగునా
రూఢంబగు పొత్తమ్ముల
నాడు మదిని సంతసము ఘనంబయిపోవన్"

పై పద్యాలను పరిశీలిస్తే ఈ కవి తన చేతిలో డబ్బులు లేకపోవడం వల్ల విద్యార్థులకు పెట్టే వడియాల పప్పును కలిగిన విద్యార్థులకు అమ్ముకొని ఆ డబ్బులతో ఆంధ్రకల్ప తరువు వంటి ఛందశ్శాస్త్ర గ్రంథాల్ని బజారులో కొని చదువుకున్నారని తెలుస్తుంది. దీనిని బట్టి చూస్తే కవి గారికి చదువుపై గల ఆసక్తి వెల్లడి అవుతుంది. జీవితంలో ఎనిమిదవ తరగతిలో జరిగిన సంఘటన మరువలేనంటారు. ఒకరోజు తెలుగు పండితున్ని తికమక పడేటట్లు జ్ఞానానందకవి ఒక ప్రశ్న వేశారట ఆ ప్రశ్నకి క్లాసులో ని విద్యార్థులు గోల చేయగా క్రమశిక్షణ కు మారు పేరయిన కానూరి సమాయేల్ గోల విని రాగా ఆ తెలుగు పండితుడు మన కవిగారి పేరు చెప్పారట. క్రోధాగ్ని రేఖామతి అయిన ప్రధానోపాధ్యాయుడు అతన్ని శిక్షించమని శాస్త్రి గారిని ఆదేశించగానే శాస్త్రి గారు – "నీ రోగంబు నణంచెదన్ తెలుగు పాండిత్యమ్ము జూపింతువా? అని బెత్తంతో ఇరవై ఏడు దెబ్బలు కొట్టారు. ఆ పండితుడు జయము గొన్నట్టి

విజయశాలివలె సంతసించెనట అని ఈ కవి పేర్కొన్నారు. క్లాసులోని విద్యార్థులందరూ కంటతడి పెట్టి శాస్త్రి గారిని నిలదీయడంతో శాస్త్రిగారు సమాధానం చెప్పకుండా తరగతి నుండి వెళ్ళిపోయారు. అది గుణపాఠంగా కవి తలచి నాటి నుంచి శ్రమించి ఉద్దీపించిన ఉత్సాహంతో ధాటిగా సహాధ్యాయులు ప్రశంసించేటట్టు తేటగీతులు, సీస పద్యాలు రాయడం ప్రారంభించారు. మన సమాజంలో విద్యార్థులు ప్రశ్నలు అడిగితే అది తప్పుగానే భావించే ఉపాధ్యాయులు ఆనాడు ఉన్నారు, ఈనాడు కూడా ఉన్నారు అని ఆయన ఉపాధ్యాయుడిగా నేను విద్యార్థులు కోసం ఎంతో కృషి చేసానని జ్ఞానానంద కవి తన "జీవితగాథ"లో పేర్కొన్నారు.

ఎనిమిదో తరగతి పాసై ఉపాధ్యాయ వృత్తికి అర్హులయ్యారు జ్ఞానానంద కవి. ఆ రోజుల్లో ఎనిమిదో తరగతి చదివితే గొప్ప. సాధారణంగా ఎనిమిదో తరగతి చదివిన విద్యార్థులను ఆ మిషనరీ (దొర) కాకినాడలోని మెక్లారిన్ హైస్కూల్‌కు లేదా కాకినాడలో రక్షణోదయ ట్రైనింగ్ పాఠశాలకు లేదా అక్కడే ఉన్న జీవామృత పాఠశాల (క్రైస్తవ మత విషయ పాఠశాల) కు పంపేవారు. జ్ఞానానందకవి[illegible]ర పిలిచి జీవామృత పాఠశాలకు వెళ్ళి బైబిల్ నేర్చుకొ[illegible]ని కాకినాడ పంప[illegible] ఆరోజుల్లో క్రైస్తవ మత ప్రచారం బాగా ఉండేది. అం[illegible]ల్లి తప్పని [illegible] దొర చెప్పినట్లుగానే జీవామృత పాఠశాలలో [illegible]క్ నేర్చుకోవ[illegible] కాకినాడ బయలుదేరారు. తండ్రి ఎల్లయ్య[illegible]రు జ్ఞానానంద[illegible]వు చాలాదూరం వెళ్ళి చదువుకోవాలి. తల్లి లేనివా[illegible]డు, నాకు చదువు లేదు. నీవైనా బాగా చదువుకోవాలి అని ఈ వేల మా[illegible]మ్మ ఉంటే ఎంత పొం[illegible]గిపోయేదో !... అబద్ధం ఆడవద్దు, నీతిగా బ్రతకమని [illegible]ంచి పంపారు. ఈ విధంగా ఏడాది గడచింది. టి.టి.సి చదివిన విద్యార్థులు మెక్లారిన్ హైస్కూల్ లోని తొమ్మిదో ఫారంగాని, రక్షణోదయ ట్రైనింగ్ పాఠశాలకు గాని పంపేవారు. జ్ఞానానందకవి చదువుకోవాలని ఉందని, చదివించండని అని తన మనసులోని మాట ఎ.డి. మాత్సన్ దొరని అడుగగా ఆయన తిరస్కరించి, ఉపాధ్యాయ ట్రైనింగ్ పాఠశాలకు పంపిస్తానని చెప్పి ఉత్తీర్ణ పరీక్షలు పెట్టగా

ఆ పరీక్షల్లో జ్ఞానానందకవి గారికి మంచి మార్కులు వచ్చాయి. మాత్సన్ దొర ట్రైనింగ్ పాఠశాలలో చేరడానికి పద్దెనిమిది రూపాయలు కట్టమని కబురు చేసారు. చేతిలో డబ్బు లేని కారణంగా ఎల్లయ్యగారు తనకున్న మెట్ట భూమిని అమ్మ జూపగా దాన్ని వెంటనే కొని డబ్బు ఇచ్చేవారు, లేకపోవడంతో ఎల్లయ్య దుఖించారు. ఈ విషయం విన్న ఒక బంధువు వాత్సల్యంతో ఆ డబ్బును కడతానని చెప్పగా తన పిన తల్లి ఈ ట్రైనింగ్ చదవటానికి ఒప్పుకోలేదు. తన తల్లిదండ్రులకు కలిగిన సంఘర్షణలో రెండు రోజులు గడచిపోయాయి. మిషనరీలా మాట దాటకూడదని తండ్రి ఎల్లయ్యగారు తన తల్లిని మందలించి డబ్బు ఇచ్చి ట్రైనింగ్‌కి పంపారట. ఈ విషయాన్ని గూర్చి "నాజీవిత గాథ"లో వివరించారు.

జ్ఞానానందకవి గారు కాకినాడలోని ట్రైనింగ్ పాఠశాలలో చేరారు. మెక్లారిన్ స్కూల్‌లోని విద్యార్థులకు, రక్షణోదయ ట్రైనింగ్ పాఠశాలలోని విద్యార్థులకు కలిపి ఒకే హాస్టల్ ఉండేది. ఆ హాస్టల్‌కు ట్రైనింగ్ చదివే విద్యార్థులనే హాస్టల్ ప్రెసిడెంట్ చేయడం ఒక ఆచారం. దానితో మన కవిగారు ఆ హాస్టల్‌కి ప్రెసిడెంట్ అయ్యారు. కవి గారికి ప్రతీ విషయం తెలుసుకోవాలనే ఆసక్తి మెండుగా ఉండేది. అందువల్ల ఎక్కువైన తన సందేహాలను ప్రశ్నల రూపంలో వేయడం వల్ల గురువుల కోపానికి గురయ్యేవారు. అందువల్ల ఏదో ఒక శిక్ష అనుభవించడం, కవిగారికి తప్పేది కాదు. అందువల్ల జ్ఞానానందకవి చీదరించుకొనే ఒజ్జలంటే కంటగింపు అని ఒక పద్యంలో రాసుకున్నారు.

**"తెలిసి కొందమనేడు తలపున నానాడు**
**ప్రశ్న ములనువేయి వలసివచ్చె**
**చీదరించు కొనుచు చెప్పెడి యొజ్జల**
**కొంటి గుండి యిలకు కంట గింపు"**

ప్రశ్నలు వేయడం వల్ల కవిగారికి ప్రధానోపాధ్యాయుడైన జోనాడాబు గారు జరిమానా వేసేవారు. బోర్డింగులో మొత్తం మీద ఎనిమిది సంవత్సరాలు ఉన్నారు, ఈ ఎనిమిదేండ్లలోను తన గ్రామమైన పెదపెంకి నుండి భీముని

పట్నం రావడానికి ఎన్నో ఇబ్బందులకు గురై క్రిస్మస్, వేసవి సెలవుల్లో మాత్రమే తన గ్రామానికి వెళ్ళే వారు. చార్జీలు లేక నిరుపేద విద్యార్థులు నడచి వెళ్లేవారు. తనకున్న చెక్కపెట్టెను బస్సులో ప్రయాణం చేస్తున్న విద్యార్థులకు ఇచ్చి తాను కాలినడకన ఇతర విద్యార్థులతో కలిసి పెదపెంకి వస్తూ తన విద్యార్థి దశలోనే తన విద్యాభ్యాసాన్ని విజయవంతంగా ముగించారు.

## ఉద్యోగ నిర్వహణ - కవితా పరిశ్రమ

జ్ఞానానందకవి ట్రైనింగ్ పాసయ్యారు. పాసైన కొన్ని నెలలకు మిషనరీ అలజంగి ఊరులో ఉన్న సి.బి.యమ్. పాఠశాలకు జ్ఞానానందకవిని సహాయ ఉపాధ్యాయునిగా నియమించారు. సరియైన ఆహారం తీసుకోకపోవడం వల్ల అలజంగిలో ఉద్యోగం చేస్తున్న జ్ఞానానంధకవి గారు అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మిషినరీ జ్ఞానానందకవిని మేడపల్లి గ్రామానికి పంపారు. అదే తన సాహిత్య జీవితానికి నాంది పలికిన గ్రామమని కవిగారు పేర్కొన్నారు. ఎనిమిదవ ఏటనే ఆరోజుల్లోనే సీస పద్యాలతో కూడిన శతకం రాసారు. దాని పేరు "దీనబంధు". తాను రాసిన శతకంలోని కొన్ని పద్యాలను తన తండ్రిగారికి వినిపించగా, తండ్రి ఎల్లయ్యగారు సంతోషించక, నీకీ కవిత్వంతో పనిలేదు, ఉద్యోగం బాగా చేసుకొమ్మని, నిరాశ పరిచారని, తన కవిత్వాన్ని చూసి ఆరోజుల్లో ఎగతాళి చేసినవారు తన ఊర్లో చాలామంది ఉన్నారని, ఎంతమంది ఎగతాలి చేసినా పట్టు వీడలేదని, వ్యధ పడ్డానని, ఈ వ్యధ కథా పర్యవసానమే సంస్కృత కళాశాలలో చదవడానికి దారి తీసిన పరిస్థితులని ఆయన పేర్కొన్నారు. కొన్ని నెలలు మేడపల్లిలో పనిచేసారు, తర్వాత విజయనరగం ఎలిమెంటరీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. అప్పట్లో తన జీతం తిండికే సరిపోలేదని బాధపడ్డారు. పూర్వం ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారి జీతం చాలా తక్కువ అందువల్ల తనకు వచ్చే జీతంతో తన కడుపు నిండ లేదని బాధపడుతూ...

**"అద్దెకియ్యలేక ముద్దకియ్యగలేక**
**చాకి కియలేక చాలా సార్లు**

**తిట్లు వారి చేత తిన్నా డ నరునకు**
**బ్రతుకు సూపనట్టి వసుధ నాది"**

అని జీవిత గాథలో రాసుకున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తాను ఒకకవిగా గుర్తింపు పొందాలనే ఆరాటంతో చావు ఎదురైనా సరే కవితా కృషి చేయాలని తపన పడ్డారు. ఒకవైపు ఉపాధ్యాయ వృత్తి చేస్తూ తాను రాసిన కవిత్వాన్ని పంతుల్ల లక్ష్మీనారాయణ శాస్త్రిగారికి చూపించేవారు. శాస్త్రి గారు విని తగు సలహాలు ఇచ్చేవారు. ఆకాలంలోనే విజయనగరం లోని కొంతమంది సాహిత్యాభిమానులను జ్ఞానానందకవిగారు కలుసుకున్నారు. తనకు సహాయం చేసిన వారిలో సైలాడ పైడితల్లి నాయుడు గారు ప్రథములని చెప్తూ నాయుడు గారిని స్మరిస్తూ రాసిన "వసత గానం" లోని పద్యాన్ని చూద్దాం...

**"మునుసైలాడ కులుండు పైడికవి సంపూర్ణాభిమానంబుతో**
**దను నాకైతను మెచ్చి నన్ను తన గాఢంబైన రాగానజూ**
**చిన నామానస వీధి పొంగి కనితల్ జేయంగనే మేమొవ్రా**
**సిన  పద్యాలు రసజ్ఞలోకమున వాసింగాంచ నుప్పొంగెదన్"**

("వసంతగానం")

అక్కడే కొత్తపల్లి పున్నయ్య గారితో గల స్నేహాన్ని గుర్తు చేసుకుంటూ తన కవిత్వాన్ని విని ఆనందించి మెచ్చుకొనే వారని అంటారు. ఆనాటి పున్నయ్య గారితో గల స్నేహం ఈనాటి వరకు కొనసాగుతూనే ఉంది అన్నారు. విజయనగరంలోనే దొడ్డమ్మ భాగవతార్ స్నేహం ఏర్పడింది. కవిగారు రాసిన పద్యాలను దొడ్డమ్మ భాగవతార్ గారు కొన్ని సభల్లో చదివి ప్రేక్షకులకు వినిపించేవారు. ఒకవైపు తన కవిత్వాన్ని మెచ్చుకొని ఆదరిస్తున్న వారు ఉన్నప్పటికీ తల్లిదండ్రులు, బంధువులు ఈయన్ని నిరుత్సాహ పరచడం వల్ల విసిగి సాహిత్యానికి స్వస్తి చెప్పాలంటే జీవితానికి భరత వాక్యం పాడాలని తలచి, ఒకనాటి సాయంకాలం విజయనగరం నుండి బొబ్బిలికి వెళ్ళే రైలు మార్గం దగ్గర ఉన్న పూలబావి గట్టుపై కూర్చొని చివరి సారిగా భగవంతుణ్ణి ధ్యానించారు. రైలు కిందపడి చావాలనే స్థిరమైన నిర్ణయానికి వచ్చారు. రైలు

రావడానికి కొంత వ్యవధి ఉంది. మరల మరోసారి భగవంతున్ని ప్రార్థన చేసుకొని తలఎత్తి చూశారు. కళ్ళ ముందు ఒక ముసలమ్మ కనిపించింది. చేతిలో తట్ట ఉంది. బడుగు ముసలిది. ఇతన్ని చూసి ఎందుకు నీవు ఈ సమయంలో ఇక్కడ ఉన్నావని ప్రశ్నించిందంట. అందుకు కవి గారు తన ఆవేదనను ముసలికి చెప్పగా నీ ఆలోచన మంచిది కాదు, జీవితంలో ఎన్ని బాధలు వచ్చినా తట్టుకుంటూ ధైర్యంగా అడుగులు వెయ్యాలి గాని, ఆత్మ హత్య చేసుకోవాలని అనుకోవడం చదువుకున్న నీకు తగదని బుద్ధి చెప్పి వెళ్లిపోయింది. అమ్మ ప్రేమకు దూరంగా జీవితాన్ని గడిపిన జ్ఞానానందకవి ముదుసలి కరుణగల మకరంద వాక్యాలను విని తేలికైన హృదయంతో ఊరికి బయలు దేరారు. అనుకున్న కార్యం ముసలమ్మ హితోపదేశంతో ఆగిపోయిందని కవి తాను అనుకుంటున్న కవితా పరిశ్రమను తిరిగి ప్రారంభించారు.

1947 వ సంవత్సరం ఆగస్ట్ 15వ తేది ఆంగ్లేయుల దాస్య శృంఖలాల నుంచి భారతదేశం స్వాతంత్ర్యం పొందిన రోజు. విజయనగర కళాశాలలో స్వాతంత్ర్య జెండా అర్థరాత్రి 12 గంటలకు గగన వీధిలో ఎగుర వేసిన గడియలవి. కవుల గుండెల్లో పొంగిన ఆనందం వారి రచనల్లో జాలు వారింది. ఆ రోజు జరిగిన కవి సమ్మేళనంలో జ్ఞానానందకవిగారు స్వాతంత్ర్య సందేశంపై కొన్ని పద్యాలు రాసినవి వినిపించారు. ఆసభకు ఆచార్య కొత్తపల్లి వీరభద్ర రావుగారు అధ్యక్షత వహించారు. ఆ కవి సమ్మేళనంలో కవిగారిని ఎంతోమంది సాహితీ ప్రియులు అభినందించి ఆశీస్సులు అందించారు. ఆ సందర్భంలోనే జ్ఞానానందకవికి సన్మానం చేసి 'కవి' అనే బిరుదాన్ని ప్రదానం చేసారు. ఆనాటి సభావిశేషాలను ఈ కవి ....

"అప్పుడు విజయనగర మందు స్వాతంత్ర్యది
నోత్సవమ్ము జరిగె నుజ్జ్వల ముగ
ధీరకవుల కందు వీరభద్ర స్వామి
జరిపె గౌరవమ్ము సముచితముగ"

"విద్యావేత్తలు న్యాయవాదులు కళా విభ్రాజితుల్ పండితుల్

**విద్యోతించిన యా సభాంతరములో పేరేమి లేనట్టి నా**
**పద్యమ్ముల్ విని భుసురుండొకడునన్ బ్రశ్నించి మీ పద్యముల్**
**హృద్యంబున్ బొనరించె మాకు నిట మీకెంతో శుభం బయ్యెడిన్"**

అని ప్రశంసించారు..

## కుటుంబం

మేడపల్లి నుంచి జ్ఞానానందకవిగారు తెలుగు పండితులుగా 1954వ సంవత్సరంలో ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించారు. జ్ఞానానందకవి 1955 మే18వ తేదీన పద్మశాలి కులానికి చెందిన ఎం. సుగుణమణిని వివాహం చేసుకున్నారు. కులాలపట్టింపులు ఆ రోజుల్లో లేవు. ముఖ్యంగా కవిగారి కవిత్వానికి ఇష్టపడి సుగుణమణి తల్లి గారు జ్ఞానానందకవితో కుమార్తెకు వివాహం చేయడం విశేషమైన అంశంగా చెప్పవచ్చు. తన విద్యాభ్యాసం అంతా మిషనరీల పాఠశాలల్లో జరగడం వల్ల క్రీస్తు పట్ల ఆకర్షితులై క్రీస్తు జీవితానికి సంబంధించిన కావ్యాలను రాసారు. జ్ఞానానందకవికి దైవభక్తి అధికం. తాను ఇంతటి వానిగా, కళాప్రపూర్ణునిగా చేసింది. తన కవితా శక్తికి ప్రాణం పోసిందీ భగవంతుడేనని ఎల్లప్పుడు తాను నమ్ముకున్న దేవుణ్ణి స్మరిస్తారు. బిడ్డలు దేవుడిచ్చిన బహుమానం అని అనుకుంటే పరమేశ్వరుని అనుగ్రహం వల్ల ఈ కవికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరి సతీమణి సుగుణమణి గారు కూడా ఉపాధ్యాయ వృత్తినే ఎన్నుకున్నారు. ఆమె 1991 మే నెల 5వ తేదీన పరమపదించారు. ఆమె ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు ఆనాటి ముఖ్యమంత్రి డా. ఎన్టీ రామారావు చేతులమీదుగా అందుకున్న విదుషీమణి. కళలపట్ల, పేదప్రజలపట్ల, ఆమెకు విపరీతమైన ప్రేమ. అటు పాఠశాలలో పాఠాలు చెపుతు ఇటు తీరిక సమయంలో సామాజిక సేవ చేసేవారు. ఆమె పరమపదించిన కొన్ని సంత్సరాలకే జ్ఞానానందకవి గారి రెండవ కుమారుడు శరన్మధు మరణించడం జ్ఞానానందకవి గార్ని ఆవేదనకు గురిచేసింది. ఆయన పెద్ద కుమార్తె ప్రముఖ కవయిత్రిగా గుర్తింపు పొందిన విదుషీమణి, ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు బాగా చదువుకొని అమెరికాలో

స్థిరపడ్డారు. ఆమె భర్త వి.వి.రమణ గారు. జ్ఞానానందకవి గారు ఏమనుకున్నారో ఆయన కోరిక తీరిందని ఈనాడు చెప్పవచ్చు. ఆయన సతీమణి సహాయ సంపత్తులే నేటి మన కవి ప్రగతికి, పిల్లల ఉన్నత స్థితికి మూల స్తంభమని అంటారు జ్ఞానానందకవి..

జ్ఞానానందకవి గారు ఎనిమిదవ ఏటన ప్రారంభించిన సాహిత్య ప్రస్థానం, ఆయన ఎనబై తొమ్మిదవ ఏట వరకు కొనసాగింది. ఆయన 6-01-2011లో పరమ పరమపదించారు..

జ్ఞానానందకవి రచనలు

| కావ్యాలు | రచనాకాలం | కృతిపతులు |
|---|---|---|
| తరంగమాల | 1944 | ................ |
| వసంతగానం | 1947 | ఉదయగిరి సీతారామస్వామి |
| గాంధీ (అమరగీత) | 1950 | అయ్యదేవర కాళేశ్వరరావు |
| దేశబంధు అయ్యదేవర కాళేశ్వరరావు | 1956 | .......... |
| పాంచజన్యం | 1956 | దామోదరం సంజీవయ్య |
| ప్రభంజనం | 1959 | డా. ప్రభాకర పట్టాభి రామారావు |
| పర్జన్యం | 1959 | డా.నీలం సంజీవరెడ్డి |
| గోల్కొండ | 1963 | డా. బెజవాడ గోపాలరెడ్డి |
| క్రీస్తు శతకం | 1963 | ................. |
| క్రీస్తు చరిత్ర (వచనం) | 1963 | ............ |
| విజయాభిషేకం | 1966 | మంతెన సుబ్బరాజు |
| పర్జన్యం (మలిభాగం) | 1969 | డా. త్రిపురనేని వేంకటేశ్వరరావు |

| | | |
|---|---|---|
| అక్షరాభిషేకం | 1971 | బి. ప్రతాపరెడ్డి |
| ఆమ్రపాలి | 1972 | ఎల్. మాలకొండయ్య |
| అక్షరాక్షతలు | 1973 | కె.వి.ఆర్.చౌదరి |
| అక్షరగుచ్ఛం | 1975 | డా. దేవులపల్లి రామానుజరావు |
| వెలుగు బాట | 1976 | జలగం వెంగళరావు |
| క్రీస్తు ప్రబంధం (తొలి భాగం) | 1977 | .............. |
| నాజీవిత గాథ (తొలి భాగం) | 1977 | రెవ. డా.కె.ఆర్. డేవిడ్ |
| అక్షరపూజ | 1979 | డా. యమ్.ఆర్ అప్పారావు |
| హరిజనులు అంటరానివారా | 1980 | .................. |
| పిల్లనగ్రోవి | 1982 | కె. చంద్రయ్య ఐఎఎస్ |
| రాజధాని | 1987 | అమూల్య శ్రీ(జె. అమ్ములయ్య) |
| కూలీ నుండి కళాప్రపూర్ణ వరకు | 1988 | ................... |
| వంశధార | 1991 | జస్టిస్. కె. పున్నయ్య |
| వ్యూస్ అండ్ వర్క్స్ | 1992 | .................. |
| ఆహ్వానం | 1993 | కె. మాధవ రావు ఐఎఎస్ |
| ధర్మాగ్రహం | 1998 | సురగాలి ఎల్లయ్య, అమ్మ పాపమాంబ |
| వివేకానందగానం | 2000 | డా. సి.నారాయణరెడ్డి |

## తెలుగు వాచకాలు

6వ తరగతి తెలుగు ఉపవాచకం 1972

2వ తరగతి తెలుగు ఉపవాచకం 1979

9వ తరగతి తెలుగు వాచకం (ద్వితీయ భాష) 1983

10వ తరగతి తెలుగు ఉపవాచకం 1984

## విశ్వవిద్యాలయాలకు డిగ్రీ పాఠ్యాంశాలు

ఆమ్రపాలి............ ఆంధ్ర విశ్వ విద్యాలయం. మోడరన్ పోయిట్రీ బి.యస్సీ 1972-1974

పర్జన్యం ..............ఆంధ్ర విశ్వ విద్యాలయం, బి.యస్సీ 1985

గోల్కొండ ........... బెంగుళూరు విశ్వ విద్యాలయం. డిగ్రీ తరగతి

ఆమ్రపాలి............ ఉస్మానియా విశ్వ విద్యాలయం పిడిసి విద్యార్థులకు,
మైసూర్ విశ్వ విద్యాలయం బిఇడి విద్యార్థులకు.

గోల్కొండ ............... (అక్కన్న, మాదన్న ఖండిక) యస్.యస్.ఎల్.సి 1968

## నాటకాలు

క్రిస్మస్ .............. 1960

రోజులుమారాయి....... 1962

## పాటలు

క్రీస్తు ధ్వని ........... 1959

నా పాటలు ........... 1958

శిలువ పాటలు ......... 1958

కొత్త పాటలు .......... 1960

## భూతపుర్వ సభ్యత్వం

ఎ.పి.లైబ్రరీ యాక్టు రివ్యూ కమిటీ

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

ఆంధ్ర విశ్వ విద్యాలయ అకాడమిక్ కౌన్సిల్

ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు

(రెండుసార్లు అంటే 10 సం.లు సభ్యులుగా కొనసాగారు)

తూర్పు గోదావరి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ

తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ

తూర్పు గోదావరి జిల్లా అధికార భాషా సంఘం

## జ్ఞానానందకవి స్థాపించిన సాహితీ సంస్థలు

సాహితీ సమాఖ్య 1967

సాహిత్య కళాపీఠం 1972

జాషువా కవి సాహిత్య పీఠం 1980-2011

ఎన్నో సాహిత్య కార్యక్రమాలను నిర్వహించిన మేటి ఘనాపాటి జ్ఞానానందకవి. తెలుగు సాహిత్య జగత్తులో కవి సార్వభౌమునిగా లబ్ధ ప్రతిష్టులైన వారి నుండి జ్ఞానానందకవి అందుకొన్న బిరుదులు.

## జ్ఞానానందకవి బిరుదులు

| బిరుదులు | స్థలం | ఇచ్చిన అధ్యక్షులు - సంవత్సరం |
|---|---|---|
| కవితావిశారద | విజయనగరం | ఆచార్య కొత్తపల్లి వీరభద్ర రావు<br>7-12-1947 |
| కవికోకిల | విజయవాడ | డా. విశ్వనాథ సత్యనారాయణ<br>20-05-1950 |

| | | |
|---|---|---|
| కవిలోకవిభూషణ | కాకినాడ | డా. ఇవటూరి జోగారావు 24-04-1961 |
| విద్వత్కవిచూడామణి | కాకినాడ | అల్లంరాజు సత్యనారాయణరావు 10-11-1968 |
| సాహితివల్లభ | కాకినాడ | సలాది పార్థసారధి 15-11-1968 |
| మహాకవి | కాకినాడ | ఆచార్య తూమాటి దోణప్ప 21-07-1974 |
| అభినవ జాషువ | విజయవాడ | కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 29-09-1974 |
| సాహితీ కృషీవల | బొబ్బిలి | ఆర్.వి.జె.కె.రంగారావు 28-09-1975 |
| కవిసార్వభౌమ | కాకినాడ | 28-10-1979 |
| కవితా శ్రీనాథ | రామచంద్రాపురం | యమ్.సెబాస్టిన్ 28-09-1982 |
| పద్యవిద్యా ప్రభువు | హైదరాబాద్ | డా.సి.నారాయణరెడ్డి 30-10-1982 |
| బ్రాహ్మీవిభూషణ | కాకినాడ | 07-02-1991 |

## అవార్డులు

ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ "కళాప్రపూర్ణ" బిరుదును 1974లో ఇచ్చి గౌరవించింది.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి కవిగారి ఆమ్రపాలి కావ్యానికి 1975లో లభించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1975 సం॥లో ఉత్తమ పండితోపాధ్యాయ బహుమతిని ప్రధానం చేసింది.

తెలుగు విశ్వ విద్యాలయం సృజనాత్మక సాహిత్యానికి ఇస్తున్న బెజవాడ పట్టభిరామి రెడ్డి పురస్కారం లభించింది.

పైడి లక్ష్మయ్య అవార్డు అందుకున్నారు.

బి యన్ రెడ్డి లిటరరీ అవార్డు అందుకున్నారు.

డాక్టర్ ఆఫ్ లిటరసి (డి లిట్) పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం నుంచి హైదరాబాద్ 1996లో అందుకున్నారు.

పద్మశ్రీ అవార్డ్‌ను రాష్ట్రపతి చేతులుమీదుగా 2002లో అందుకున్నారు.

బొజ్జాధర్మరాజు ఆసభకు రాజ్యసభ సభ్యులు శ్రీ పైదవెంకట నారాయణ రావు అధ్యక్షత వహించారు.

జ్ఞానానందకవి గారికి 1982వ సంవత్సరంలో "గండ పెండేర" సన్మానం జరిగింది. ఈ సన్మానం చేసిన వారు రామదాసు మోటర్ ట్రాన్స్పోర్ట్ సంస్థ అధినేత కె.వి.ఆర్ చౌదరి. మున్సిపల్ చైర్మన్ జ్యోతుల సీతారామమూర్తిగారు జ్ఞానానంద కవికి గండపెండేరాన్ని తొడిగారు. ఈ సభకు డా. సి. నారాయణరెడ్డి గారు అధ్యక్షత వహించారు. ఆచార్య ఎస్వీ. జోగారావు. ఆచార్య కొత్తపల్లి వీరాభద్రరావు, డా. వై.వేంకటపతి రాయులు ఈ కవి కవితా ప్రస్థానాన్ని వివరించారు. తెలుగునాడులో అపురూపమైన పద్ధతిలో ఎన్నో సన్మానాలు జ్ఞానానందకవికి లభించాయి. ఈ మహా కవికి ప్రతి నెల రాష్ట్రప్రభుత్వం రూ.1000/- చొప్పున జీవిత భరణం ఇచ్చింది. జ్ఞానానందకవిగారు 1993లో జాతీయ కవిగా ఆంధ్రప్రదేశ్ తరపున డిల్లీలో జరిగిన జాతీయ కవి సమ్మేళనంలో పాల్గొన్నారు.

## సన్మానాలు సత్కారాలు

జ్ఞానానందకవి కావ్యాలను పఠించిన ఆంధ్ర లోకం ఆయనకు ఎన్నెన్నో సత్కారాలు. సన్మానాలు చేసింది.

"వసంతగానం" అనే ఖండ కృతికి 1947వ సంవత్సరం డిసెంబర్ లో విజయనగరంలో సన్మాన పురస్కారం జరిగింది. ఇది కవి గారికి జరిగిన మొట్ట మొదటి సభాసత్కారం. జ్ఞానానందకవిని సాహితి పథం వైపు నడిపించింది.

"గాంధీ అమరగీత" అంకితోత్సవం 1950వ సంవత్సరం మే నెల విజయవాడలో జరిగింది. ఆ సభలో విశ్వనాథ సత్యనారాయణ, నవయుగ కవి చక్రవర్తి గుఱ్ఱం జాషువా, సంఘ సంస్కర్త గోపరాయి రామచంద్ర రావు మొదలైనవారి సమక్షంలో ఘన సన్మానం జరిగింది.

"పర్జన్యకృతిని" 1959వ సంవత్సరంలో జ్ఞానానందకవి ఆనాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి గారికి అంకితం చేసారు. ఆ సభకు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రనాయకుడు అల్లూరి సత్యనారాయణ రాజు గారు అధ్యక్షత వహించారు.

''ప్రభంజనం'' కృతిని లోనాటి విద్యా మంత్రి అయిన పట్టాభిరామారావు గారికి 1959లో అంకితం చేసారు. ఆ సభకు డా. విశ్వనాథ సత్యనారాయణ గారు అధ్యక్షత వహించారు. కాకినాడలో 1974వ సంవత్సరంలో జ్ఞానానందకవిగారికి కనకాభిషేకం జరిగింది.

విద్యార్థిగా తరగతిలో ఉపాధ్యాయులు రాగయుక్తంగా పద్యాలను వివరించడం. గ్రామాల్లో బిక్షాటనకై వచ్చిన బుడబుక్కల వాళ్ళు, పంబల వాళ్ళు, జంగమ వాళ్ళు పాడే మధుర గీతాలు వీరిని ఆకట్టుకున్నాయి. సహజంగా ఆశుకవిగా తన ప్రతిభతో పద్య కవితల్ని చెప్పడం చిన్ననాడే అలవర్చుకున్నారు.

మేనమామ ప్రోత్సాహంతో రామాయణ మహాభారత కావ్యాల్ని చదవడం, దాశరథి శతకం, భాస్కర శతకం, శ్రీకాళ హస్తీశ్వర శతకం మొదలైన శతాకాల్లోన్ని పద్యాలను, శబ్దమంజరి, అమరం వంటి గ్రంథాలను కంఠస్థం చేయడం వల్ల వీరిలో సాహిత్యాభిలాష మరింత ఎక్కువైంది. ఒక పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా చేరిన తర్వాత సీస పద్యాలతో కూడిన "దీనబంధు" శతకాన్ని మొదటి సారిగా రాసారు.

**"నా శిష్యుండును సాధువౌ కవియు జ్ఞానానంద మీసాధువే**
**ళా శిష్టంబు నదృష్ట మందెడిని వాల్లభ్యంబు దీపింపగన్**
**ఆశీర్యోగ్యుడు యోగ్యుడన్ నవ శుభ ప్రారంభ సంపత్తికిన్**
**ఆశీస్పంతత నిత్తు నీ శుభ వివాహ స్వచ్ఛవేళన్ బడిన్"**

విశ్వనాథ జ్ఞానానందకవి పెళ్ళి సందర్భంగా రాసిన పై పద్యాన్ని గమనిస్తే ముఖ్యంగా జ్ఞానానందకవిగారు విశ్వనాథ శిష్యులుగా ప్రసిద్ధులు. వారి ఆశీస్సులతో పాటు జాషువా, దాశరథి, కాటూరి వెంకటేశ్వరరావు, దేవులపల్లి, కాళోజి మొదలైన వారితో సన్నిహిత సంబంధాలు ఉండటమే కాదు, వారితో నిత్యం సాహితీ చర్చలు జరిపేవారు. వీరికి పద్యం పట్ల ప్రత్యేక అభిమానం ఉండటం వల్ల వీరు ఆహ్వానం ముందు మాటల్లో దీన్ని వివరిస్తూ కవిమాటల్లో....

**"చాలమందిసంయమన సమన్వయ స్వభావ రహితం**
**లు పద్య చచ్చి పోయినదని యందురు అనిన వా**
**రలటు లేదురేమో కాని పద్య చావదు" భాష**
**యున్నంత వరకు పద్యం నిల్చును.**

**కవిగారు ఆరోజుల్లో అన్న మాటలివి....**

ఈ రోజు మన తెలుగును గురించి మనం ఎన్నో విధాలుగా చింతిస్తూ సభలు చేస్తున్నాం. ముఖ్యంగా - జ్ఞానానందకవిగారు అన్నట్లు తెలుగు భాష, తెలుగు తనం ఎన్నటికీ మాసిపోదు. ముఖ్యంగా జ్ఞానానందకవిగారు పద్యం కోసమే పుట్టిన మహాకవి, కవులందరూ నేటి కాల పరిస్థితులను బట్టి ఎన్నో ప్రక్రియలను చేపట్టినా జ్ఞానానందకవి గారు తాను ప్రేమించిన, తన ఊపిరిగా భావించిన పద్యాన్నే చివరి వరకు రాసారు, పద్యాన్ని హృద్యంగా తెలుగు వారికి అందించిన మహాకవి జ్ఞానానందకవి. వీరి కవిత్వంలో తెలుగు నుడికారపు సారళ్యం, శబ్ద సౌష్టవం కనిపిస్తాయి.

"కమ్మని తేట తెన్గు నుడి కారపు సొంపు రసార్ద్ర దివ్యా భా
వమ్ము లిఖింప నేర్పు ప్రతిభా యుతుడైన కవీంద్రు దొడ్డ గం
టమ్ము ననుండు గానికవనమ్ము రచింప నేరుంగా లేనిద
ద్దమ్మ కలానికీ విషయ మందునె తన్నుక చచ్చె నేనియున్"

అని స్పష్టీకరించారు.

# 2

# జ్ఞానానందకవి కథా కావ్యాలు

## వస్తు వివేచన

1944వ సంవత్సరములో రాసిన కావ్యాంతరగమాల నుండి సుమారు 40 కావ్యాలు రాసిన జ్ఞానానందకవి కావ్యాలలోను జీవితంలోను వారి కవితా దృక్పథం ప్రదర్శితమవుతుంది. ఏ కవియైన సమాజం ప్రభావం నుంచి తప్పించుకోలేనట్టే జ్ఞానానందకవి కావ్యాల్లోను సమకాలీన సమాజం దర్శనమవుతుంది. ఆయన కవిత్వంలో కొన్ని ముఖ్య లక్షణాలున్నాయి. అవి సర్వమత సమదృష్టి, భారతీయ సంస్కృతిపై అభిమానం, మానవతాదృష్టి, భాషాభిమానం, సహృదయత, సమదృష్టి, నవ్య సంప్రదాయ కవిత్వంపై గాఢాభిమానం, అనర్థదాయికాలైన విదేశీ ఆచార వ్యవహారాలపై విముఖత మొదలైనవి. వారి కావ్యాలను అనుశీలిద్దాం.

### 1. 'ఆమ్రపాలి'

జ్ఞానానందకవి రాసిన కావ్యాల్లో ఆమ్రపాలి విశిష్టమైంది. జాతక కథల్లోని కథలను తీసుకొని ఎంతోమంది బౌద్ధమత వస్తువుగా ఎన్నో కావ్యాలను, నవలలను, నాటకాలను రాశారు. తిరుపతి వేంకటకవుల బుద్ధ చరిత్రం, పింగళి కాటూరి కవుల సౌందరనందము, కరుటూరి సత్యనారాయణ 'తిష్యరక్షతి' ఆమ్రపాలి, శారదగారి ఆమ్రపాలి, జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి 'కరుణశ్రీ', బోడేపూడి వెకటరావుగారి కళాక్షేత్రం, సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారి

జాతక కథాగుచ్ఛం, బ్రహ్మాజీరావు నవధర్మము, ముదివర్తి కొండవాచార్యుల వారి ధర్మదీక్ష, విల్లాదేవిగారి ఆమ్రపాలి మొదలైనవి.

ఆమ్రపాలి కథకు స్వాతంత్ర కల్పనలు చేసి రమణీయమైన కావ్యాన్ని సాహిత్యలోకానికి జ్ఞానానందకవిగారు అందించారు. మూలకథను ఏదో ఒక కావ్యాం నుండి తీసుకోలేదని, మిత్రులు చెప్పిన కథను అనుసరించి కావ్యాన్ని రాశానని చెప్పుకున్నారు. ఈ కావ్యాన్ని 48 గంటల్లో రాసారు. ఈ కావ్యంలో 319 పద్యాలున్నాయి. మొత్తం 8 ఆశ్వాసాలున్న కావ్యం. ఒక్కొక్క ఆశ్వాసానికి జ్ఞానానందకవిగారు చక్కని శీర్షికను పెట్టారు. మొదటి ఆశ్వాసం అవతరణం - ఇందులో 35 పద్యాలున్నాయి. రెండవ ఆశ్వాసం స్వయంవరంలో 51 పద్యాలున్నాయి. మూడవ ఆశ్వాసం చింతనంలో 40 పద్యాలున్నాయి. ఐదవ ఆశ్వాసం ఆహ్వానంలో 52 పద్యాలు. ఆరవ ఆశ్వాసం ఆగమనంలో 58 పద్యాలు, ఏడవ ఆశ్వాసం సందర్శనంలో 35 పద్యాలున్నాయి. ఎనిమిదవ ఆశ్వాసం స్వీకరణంలో 16 పద్యాలున్నాయి. ఆమ్రపాలి కావ్యానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఆకాడమి బహుమతిని 1975వ సంవత్సరములో జ్ఞానానందకవిగారు అందుకున్నారు.

అమ్రపాలి ఆమ్రవనంలో అనాథగా దొరకటం, ఆమ్రపాలి బుద్ధున్ని తొలిసారిగా ఆ ప్రదేశంలోనే దర్శించుకోవడం, ఆమ్రవనంలోనే బౌద్ధభిక్షును స్వీకరించడం వలన ఆమ్రవనానికి చాలా ప్రాముఖ్యత కలిగింది. ఆమ్రపాలి అందమైన అమ్మాయి. గణతంత్ర రాజ్యాల్లో అందమైన అమ్మాయి ఉంటే ఆమెను గణభోగ్యగా మార్చేసే ఆచారం ఉండడం వల్ల ఆమ్రపాలి ఒక గణభోగ్యగా మారింది. గణభోగ్య అంటే ఆ యువతి ఇష్టాయిష్టాలతో పనిలేకుండా ఆ గణంలోని ప్రముఖులు అంతా ఆమెను అనుభవించేందుకు వీలుగా మార్చబడిన స్త్రీ అని చెప్పవచ్చు. ఇది ఆ గణతంత్ర రాజ్యంలోని చక్రవర్తి చేసిన శాసనం. గణభోగ్యగా మారిన ఆమ్రపాలి అప్పుడప్పుడు తాను ఎక్కడైతే దొరికిందో ఆ ప్రాంతానికి వెళ్ళి విశ్రాంతి తీసుకొనేది. అందువల్ల ఆమ్రపాలి పేరు సార్థకమైంది.

మూలంలోంచి వస్తువును స్వీకరించలేదని జ్ఞానానందకవిగారు పేర్కొన్న ఆధార గ్రంథాలు మనకు కన్పిస్తున్నాయి. బుద్ధుని జీవిత కథలపై సంస్కృతంలో క్షేమేంద్రుడు 'బౌద్ధవదాన కల్పలత' పేరుతో రచించారు. తిరుమల రామచంద్ర సంస్కృతం నుండి తెలుగులోకి క్షేమేంద్రుని గ్రంథాన్ని 'బోధిసత్త్వవధాన కల్పలత' పేరుతో అనువదించారు. దీనికి, జ్ఞానానందకవిగారి ఆమ్రపాలి కావ్యానికి కొన్ని పోలికలు కన్పిస్తున్నాయి. అవధాన కల్పలతలో ఆమ్రపాలి అరటి బోదెనుంచి పుట్టి మహామునికి దొరుకుతుంది. (మూలగ్రంథం - పుట : 174). ఆమెను ప్రేమతో పెంచి పెళ్ళి చేయాలనుకుంటాడు. కానీ గణరాజ్యంలో పుట్టేకన్య గణరాజ్యానికే చెందాలనే నియమానికి పెళ్ళిచేయడం అసాధ్యం కావడం వల్ల అతని ప్రయత్నాన్ని గణం సహించలేదు. అటువంటి ఆచారం ఉంటే ఆమ్రపాలి గణభోగిగా ఉంటానని ఒకరు తనవద్ద ఉండగా మరొకరు రాకూడదని, నా ఇంట్లో ఉండడానికి పణంగా దినానికి 500 కార్షపణాలు చెల్లించాలని, అలా వచ్చినవాడు ఏడు రోజులు మాత్రమే ఉండడానికి కుదురుతుందని షరుతులు విధిస్తుంది. ఆ షరతులను ఉల్లంఘించినవారు శిక్షింపబడతారని వివరిస్తుంది. దానికి ఆ గణంలోని వారందరూ అంగీకరిస్తారు. ఆమెకు ఒక ప్రత్యేక భవనం ఏర్పరిచారు. ఆమె ఆ ప్రత్యేక భవనంలో ఉండేది. ఆమెను పొందాలనుకునేవాళ్ళు డబ్బు చెల్లించినా శక్తిహీనులయ్యేవారు. ఆమెకోసం నానాదేశాల నుండి వచ్చిన నానా దేశరాజులు చిత్రాలను చిత్రింపజేసేది. అలా చిత్రించిన ఒక చిత్రం ఆమెను బాగా ఆకర్షించింది. చిత్రకారుని పిలిపించి ఆ చిత్రం వివరాలను తెలుసుకొని, ఆ చిత్రంలోని బింబిసారునిపై ప్రేమను పెంచుకొంటుంది ఆమ్రపాలి.

## చారిత్రక నేపథ్యం :

ఆమ్రపాలి కావ్యం చారిత్రక నేపథ్యం కలిగి ఉందని ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పేర్కొన్నారు. "ఒక పురుషార్థాన్నిగాని, ఒక ప్రయోజనాన్ని కానీ సాధించటానికి ఆరంభమైన ఒక కార్యం, విస్తరిల్లి ఫలవంతమయ్యేంత వరకు స్వయం సమగ్రంగా చిత్రింపబడే వస్తుజీవిత కావ్యం. ఇందులోని వస్తువు

చారిత్రకమైతే అది చారిత్రక కావ్యం అవుతుంది." అని పేర్కొన్నారు. క్రీ.పూ. 6వ శతాబ్ది మధ్యకాలంలో మగధను బింబిసారుడూ, వైశాలిని లిచ్ఛవులూ పరిపాలించారు. మగధ రాజ్యం మిగిలిన రాజ్యాలకంటే బలమైంది కావటంచేత మగధరాజుకి మిగిలిన రాజ్యాలు భయపడేవి. ఈ రాజ్యాలు నిరంతరం కలహించుకోవడం వల్ల శత్రురాజ్యాలుగా పిలువబడ్డాయి. ఇక్కడ ఆర్థిక లావాదేవీలు ముఖ్యంగా కార్షపణ నాణేల ద్వారా జరిగింది. చరిత్రలో పేర్కొన్న అనేక అంశాలను కవిగారు తన కావ్యంలో పాత్రలపరంగా, సన్నివేశపరంగా, సందర్భానుసారంగా వర్ణించారు. దేశాన్ని, కాలాన్ని, వస్తువుని జాగ్రత్తగా తీర్చిదిద్ది ఔచిత్యాన్ని పాటించారు. బుద్ధుడు ఒకవైపు బౌద్ధమత ధర్మాన్ని వ్యాప్తి చేస్తుంటే, బింబిసారుడు మగధ రాజ్య విస్తరణకు కృషి చేశాడు. బింబిసారునిలోని బుద్ధిబలం, భుజబలం మొదలైన లక్షణాలు ఆమ్రపాలి కావ్యంలో గొప్పగా చెప్పబడ్డాయి. గౌతమబుద్ధుడు అష్టాంగ మార్గాన్ని బోధించటం, సర్వజీవుల పట్ల కరుణను ప్రదర్శించటం మొదలైనవి కూడా కావ్యంలో వర్ణించబడ్డాయి. ఈ విధంగా చారిత్రకాంశాలను తీసుకొన్నంత మాత్రాన ఈ కావ్యం వీరరస ప్రధానమైంది కాదు. ఇందులో శాంతరసం ప్రధానంగా పోషింపబడింది.

## మూలంలో లేని కవి కల్పనలు :

1. మామిడితోటల మధ్య ఉండే అరటిబోదె నుంచి ఆమ్రపాలి పుట్టినట్లు మూల కథలో చెప్పారు. కానీ కవిగారు ఆమ్రపాలి ఆమ్రవనంలో శాక్యధనికునికి దొరికినట్లు వర్ణించారు.

2. గణరాజ్యంలో పుట్టిన కన్య గణ రాజ్యానికే చెందాలనే ఆచారం ఉన్నట్లు, మూలకథలో ఉంది. కవిగారు ఆమ్రపాలి కావ్యంలో అటువంటి ఆచారాలు ఉన్నట్లు ఎక్కడా చెప్పలేదు.

3. ఆమ్రపాలికి పెళ్ళి చేయాలనుకోవటం రెండింటిలోను ఉంది. గణభోగ్యగా ఆమ్రపాలిని మార్చుకోవాలనే రాజుల కాంక్ష రెండింటిలోను చెప్పబడింది.

4. మూలకథలో నియమాలను తండ్రికే చెప్పి పంపుతుంది. కవిగారు దాన్ని మార్పులు చేసి స్వయంవరం సభా సనివేశాన్ని సృష్టించి, ఆ సభలో ఆమె లిచ్ఛవులతో ప్రత్యక్షంగా మాట్లాడినట్లు చిత్రించారు. ఈ మార్పుతో తండ్రి ఔన్నత్యాన్ని కావ్యంలో కాపాడినట్లు అయింది.

5. బింబిసారుని వివరాలను చిత్రకారున్ని ఆమ్రపాలి అడిగి తెలుసుకొన్నట్లు, మూలంలో ఉంది. కానీ కావ్యంలో తనకు ఇష్టమైన చెలికత్తెను అడిగి తెలుసుకొన్నట్లు చెప్పారు.

6. మారువేషంలో బింబిసారుడు తన మిత్రుడైన గోపుడిని వెంటబెట్టుకొని వైశాలీ నగరంలోని ఆమ్రపాలి భవనానికి వెళ్ళటమనేది మూలంలోను, కవిగారి కావ్యంలోను ఉంది.

**"క్ష్మాపతి మార్చినాఁడు తన సజ్జను లిచ్ఛపభూమిభాగవున్**
**దావులలోన, గోపుదును దాలిచె వేఱొక వేసమున్ యథే**
**చ్ఛాపరిసర్యకాంక్షులయి చారుఁలకన్నుల కంటకుండగన్**
**భూపు ఁడు గోపుఁడున్ బురము పూర్తిగఁజూచిరి సంభ్రమాత్ములై."**

- ఆమ్రపాలి 183 పద్యం

మగధ రాజ్యంలో బింబిసారుఁడు కూడా అందరికీ గణభోగి అయిన ఆమ్రపాలిని పొందాలనుకొని మిత్రునితో చర్చించి మారువేషంలో వైశాలి చేరుకుంటాడు. ఏడు రాత్రులు ఆమెతో భవనంలో గడుపుతాడు. ఆమె గర్భం ధరిస్తుంది. ఆ విషయాన్ని అతనికి తెలుపుతుంది. భావిపుత్రుని ఆనవాలు తెలుసుకోవడానికి ఉంగరం ఆమెకిచ్చి వెళ్ళిపోతాడు (పుట : 177). ఆమ్రపాలి కొన్నాళ్ళకు బిడ్డను కంటుంది. ఆ బిడ్డలో బింబిసారుని పోలికలున్నాయని గ్రహించి తన కుమారునికి చదవదగిన వయసు వచ్చిందని ఉంగరాన్నిచ్చి మగధ రాజ్యానికి పంపుతుంది. తనలాగే ఉన్న కొడుకుని చూసి సంతోషంతో స్వీకరిస్తాడు బింబిసారుడు.

మూలకథలో, ఆమ్రపాలి జన్మవృత్తాంతాన్ని బుద్ధుడే వివరించినట్లు ఉంది. మాలతి అనే ఉద్యానవన పాలిక రాజుకి అయోనిజ అయిన భార్యగా జన్మించాలనే వరానికి అనుగుణంగా ఆమ్రపాలి జన్మను వివరించారు. కాని జ్ఞానానదకవిగారు ఆమ్రపాలిలో పూర్వజన్మ వృత్తాంతాన్ని చెప్తూ, ఇంద్రుని శాపం వల్ల కలిగిందని చెప్పడం వల్ల ఆమ్రపాలి పట్ల సానుభూతిని కలిగేలా తీర్చిదిద్దారు. మానవుల కర్మఫలితంగానే జన్మ సిద్ధిస్తుందని వివరిస్తూ, పునర్జన్మ సిద్ధాంతం కర్మ సిద్ధాంతాన్ని బలపరుస్తుందని గత జన్మలోని కర్మ ఫలాలకు ప్రస్తుత జన్మలోని మంచిచెడులకు ఆధారమని అంటారు. జ్ఞానానందకవిగారు పై విధంగా తనదైన ప్రత్యేకరీతిలో మూలంలో లేని కొత్తమార్పులతో కావ్యాన్ని రచించారు.

ఆమ్రపాలి సమస్త కళలను నేర్చుకుంటుంది. పిల్లలు లేని శాక్యధనికునికి దొరికిన ఆ శిశువు పట్ల నున్న ప్రేమతో ఆమ్రపాలిగా పిలుస్తూ సమస్త కళలను నేర్పించాడు. ఆ రోజుల్లో స్త్రీలకు సంఘంలో గౌరవమున్న కొన్ని కళలను నేర్చుకోవడానికి అవకాశాలు లేవు. దేవుడిచ్చిన బిడ్డగా ఆమ్రపాలిని శాక్యధనికుడు భావించాడు. తల్లిగంద్రులు బంధువులు మెచ్చుకొనేటట్లుగా మసలు కొనేది. తంద్రితోపాటు, సుభాకార్యక్రమాల్లోనూ, పూజాపునస్కారాల్లోనూ పాల్గొనేది. దేవాలయాల్లో చేసే నాట్యాల్లో పాలుపంచుకొనేది. ఇలా ఆమె పాత్రను తీర్చిదిద్దడం వల్ల జ్ఞానానందకవిగారు రాబోయే కథాసన్నివేశానికి, ముందుగానే ఒక రూపాన్ని అందించినట్లుగా అర్థమవుతుంది. ఆమ్రపాలి 13వ పద్యంలో

భరతమౌనియశస్సు పదికాలముల ఁజాటు
నాట్యశాస్త్రములోని నాణ్యమెటి ఁగి
సురలోకవాసుల సొత్తైన కమనీయ
గాంధర్వ విద్యలో గణన కెక్కి
నలువ చెలువ కృపాకలన వేయివిధాల
సాహిత్యజగతిలో సంచరించి

**ఘనత cగాంచిన తపోధనుల ప్రోక్తములైన**
**తతమహావిజ్ఞానగతు నేర్చి**
**నాటి సంఘమందు మేటి గౌరవమున్న**
**స్త్రీల కర్హమైన తీరులందు**
**చదువుసాములందు క్షాత్రవిద్యలయందు**
**తనరె నేర్పు శాక్యధనితనూజ**

ఆమ్రపాలి సౌందర్యానికి రంభ, ఊర్వశి, మేనకలే తలదించుకున్నారనేది విదితమే. ఆమ్రపాలి సౌందర్యరాశి అని చెప్పడానికి కవి ఆ విషయాన్ని అతిశయోక్తి అలంకార దృశ్యంగా వర్ణించారు.

ఆయుగమ్ములోన నామ్రపాలిని మించు
అందగత్తె మంచుకైన లేదు
ఆమెయందమునకు నాముగ్గురమ్మలు
క్రించులైరి తలలు వంచుకొనిరి

ఆమ్రపాలి. పుట - 64

అతిలోక సుందరి అయిన ఆమ్రపాలికి తండ్రి, స్వయంవర "సభను ఏర్పాటు చేసి, ఆమ్రపాలిని గురించి ఇలా

**అస్మన్నందన విశ్వభూవలయ మోహప్రక్రియాస్ఫూర్తి, ది**
**వ్యస్మేరానన, రమ్య నాటకకళా ప్రావీణ్య రాకాసుధా**
**రశ్మి శ్రీనిభృత స్వరూప, గుణ భారస్ఫారవి క్రాంతి, సా**
**రస్మేరాశుగ మామ్రపాలి, కిటc గళ్యాణమ్ముc గావింపగcన్**

ఆమ్రపాలి. పద్యము - 36

అని ప్రకటిస్తాడు. లిచ్ఛవుల ఎదుట ఆమ్రపాలి సౌందర్యాన్ని కవి, మెరుపు తీగలా, శశిరేఖలా ఉందని వర్ణిస్తారు. అంతేకాదు. శాక్యధనుడు స్వయంవరణంలో మరొక పద్యంలో

**"పద్మము నాకూఁతురు గుణ**
**పద్మము నాచిట్టితలి సౌందర్యకళా**
**ఛద్మ మదీయతనయ యు**
**ద్మద్మతి కళ్యాణనిర్వహణ మొనరింపన్.**

ఆమ్రపాలి. పద్యము - 40

కథా కావ్య రచనలో కూడ గడుసు పోకడలను జ్ఞానానంద కవి గారు ప్రదర్శించారు.

ఈ కావ్యంలో ప్రధానవస్తువు జీవన సంగ్రామంలో సంక్షోభం పొంది చైతన్యం అల్లకల్లోలమై చివరకు బుద్ధ భగవానుని బోధవల్ల మనశ్శాంతిని పొందిన ఆమ్రపాలి అనే నాయిక మానసిక పరిణామం. దీనిని మనకు మొట్టమొదటి పద్యంలో 'సూర్యాస్తమయాన్ని వర్ణిస్తూ ఈ కవి.

**"అలమున వైరిసేన జెండాడిరక్త**
**సిక్త దేహుడై శాంతి వాంఛించి నట్టి**
**రౌద్ర యోధుని భంగి నస్తాద్రిశిఖరి**
**పైన కానిపించెను లోక బాంధవుండు**

ఆమ్రపాలి. పుట - 61

ఆమ్రపాలిలో చివర బుద్ధుని అష్టాంగ మార్గాన్ని ప్రభోదాత్మకంగా చెప్పేటప్పుడు ఈ విధమైన శైలిలో మలుస్తారు.

**హానిఁదలఁపఁగూడ దంతరగమ్మున**
**నెట్టిజీవికైన నెన్నఁడైన**
**అవసరమ్ము కల్గునట్టివేళకు మేలు**
**సేయ జీవితమున సిద్ధపడుము.**

ఆమ్రపాలి. పుట - 80

ఆమ్రపాలి 'స్వీకరణము' అనే అధ్యాసంలో కవి మానవతావాదాన్ని ప్రభోదిస్తున్నారు.

నిష్కళంకమైన నీతిదాయకమైన
మాననీయ మైన మానవతకు
ప్రణతు లందజేసి పట్టమ్ము గట్టగా
వలయు సంతతము కువలయమందు

ఆమ్రపాలి. పుట - 81

ఈ కావ్యంలో సందర్శనం అనే ఆశ్వాసంలో జ్ఞానానందకవిగారు రెండు ఆర్య సత్యాలను సమాజానికి అందించారు.

**"పుట్టినజీవి గిట్టునిది మూల జీవన శాస్త్ర విద్యకున్**
**ఎట్టిదు వానికైన నిలమృత్యువు దూరము గాదు జీవము**
**న్నట్టిది నాశమైచమనటన్నది సత్యముగాన ధర్మపున్**
**ఘట్టము లీ ప్రపంచమున ఁగన్పడగల్గినచో ముదంబుగున్**

ఆమ్రపాలి. పుట - 29

**నాశముతప్ప దీబ్రతుకునన్ భువిలోన సహస్రవర్షముల్**
**క్లేశ మొకింత లేక బ్రతుకీడ్చినవానికినైన దీవ్యదా**
**వేశము గల్గినట్టిఋషివీరునికైనను గాని యెందుకో**
**ఆశలు పెంచుకొందు రసహాయత మానవులెల్ల రమ్మరో!**

ఆమ్రపాలి. పుట - 29

ఆమ్రపాలి కావ్యంలో శాంతరసం అంగిరసముగా కనిపిస్తుంది. కావ్యారంభం, వస్తునిర్వహణ, కావ్య ముగింపు మొదలైన అంశాలలో శాంతరసం తొంగి చూస్తుంది. గణభోగ్యగా మారిన ఆమ్రపాలి మానసికంగా కృంగిపోయి అమ్రవనంలోకి వెళ్ళి కొంత ఉపశమనం పొందుతుంది.

బుద్ధుని దర్శనం వల్ల ప్రశాంతచిత్తయై జీవితసత్యాన్ని గ్రహించి, వైరాగ్యానికి గురైంది. బింబిసారుణ్ణి ప్రేమించి బిడ్డను కని ఆ బిడ్డను బిబిసారునికే అంకితం చేస్తుంది. చివరకు బుద్ధుని బోధనలను స్వీకరించి మోక్షమార్గం వైపు పయనిస్తుంది. చివరకు [illegible] కూడ బుద్ధుని మార్గాన్నే అనుసరిస్తూ

"ఉదిత మహోన్నతాశయములుర్వరనిల్వగనిష్కళంకపున్
హృదిని ప్రచారమున్‌సలిపి యీ పతితుల్ బడుగుల్ సుఖాల్గకై
పదవిని వీడి ధర్మముల బాటను చన్న ప్రసన్న రూపమీ
పదములె దిక్కు నాకిల నపార కృపార సభావ బంధురా"

## 2. 'దేశబంధు' అయ్యదేవర కాళేశ్వరరావు

ఆంధ్రదేశం భారతావనిలో ధైర్య, శౌర్య, స్థైర్యాలకు పేరుగాంచి విజ్ఞాన కళలకు నిలయమై అన్ని దిక్కులలో కెల్ల, తన ప్రత్యేకతను చాటి భారతదేశానికి ఒక ముత్తైదువులా ఉంది. అటువంటి ఆంధ్రదేశమున సర్వసుఖాలకు, సంపదకు, రాజకీయ నాయకులకు పేరుపొందిన ప్రదేశము కృష్ణానదీ పరివాహ ప్రాంత ప్రదేశము. ఈ కృష్ణానదీ ప్రాంతమున 'నందిగామ' గ్రామం విద్యావేత్తలకు, త్యాగధనులకు నివాసం. ఆ నందిగామ గ్రామంలో అయ్యదేవర కులము పండితులను, నాయకులను కన్నది.... మహనీయ మధుర మూర్తి. ప్రఖ్యాతి చెందిన బ్రాహ్మణుడు. సత్య, శాంతి, దయా గుణాలకు పేరు పెట్టిన ఘనుడు. జపతపోధ్యాన నిష్ఠాగరిష్టుడు అయ్యదేవర లక్ష్మారావు ఒకరు. ఇతను దివాను. ఇతని భార్య వర్ధలక్ష్మి. ఈ దంపతులిరువురికి పుట్టినవాడు. భారతదేశానికి వేగుచుక్క అయినవాడు అయ్యదేవర కాళేశ్వరరావు.

"నా మహాస్వర్ణ చరిత విన్యాసగతుల
కమల హేతుభూతం బయినట్టివాడు
దేశబంధు! కాళేశుని దివ్యజన్మ
విపుల భారతమ్మునకొక్క వేగుజుక్క

అయ్యదేవర కాళేశ్వరరావు బాల్యం అంతా సుఖంగా తల్లిదండ్రుల ఒడిలోనే గడిసిపోయింది. అప్పటికే ఆంగ్లేయులు గాంధీగారి రాకతో కంగారుపడుతున్న రోజులు అవి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కవులు పుట్టిన, రాజకీయ రంగంలో చతురత కలిగిన నాయకులు వెలసిన, సకల శాస్త్రములకు, లలితకళలకు నిలయమైన ఎలిమెంటరీ పాఠశాలలో విద్యాభ్యాసం

ప్రారంభించారు. ఎలిమెంటరీ విద్యను చదివిన తరువాత 'నోబెల్' కళాశాలలో ఉన్నత చదువులు చదివారు. ఈ కళాశాలలో తరగతిలో ప్రథముడిగా ఎన్నో బహుమతులను పొంది తల్లిదండ్రులకు ఆనందాన్ని కలిగించేవాడు. కళాశాలలోని అధ్యాపకులతో వినయంగాను, తోటి స్నేహితులతో ప్రేమానురాగాలతోను ఉంటూ గురువుల ద్వారా సమస్త శాస్త్రాల జ్ఞానాన్ని సంపాదించారు. ఆ కళాశాలలోనే విద్యానిపుణులకు, రాజకీయ చరిత్రకు సంబంధించిన వ్యాసాలను చదివేవారు. దానితో అప్పటి స్వాతంత్ర్య నినాదములు చెవిని పడటంతో "ఇది నాదేశము నన్నుగన్నయది నాయిష్టంబు ...." అంటూ నాదేశంలో స్వేచ్ఛకోసం నా తనువునే అర్పిస్తానని ప్రమాణం చేసాడు.

**"ఎదిరివచ్చిన శత్రు మదగజమ్మునవైన**
**నిలువరించి యెదిర్చి గెలుచుదాక**
**లాతిరాజుల శృంఖలాబద్ధయగుమాత**
**పరితాపమునువీడి బ్రతుకుదాక**
**సమదగ్రమైన స్వేచ్ఛాకాంక్షవాయువుల్**
**భరతవీథులదాకి పరచుదాక**
**శాంత్యహింసల కత్తిసాధనాయోగమ్ము**
**ననుగుతమ్ములు నేర్చుకొనినదాక**
**నరనరానంబొంగునారక్తబిందువుల్**
**వ్యయమొనర్తు బ్రతుకు వ్యర్థమైన**
**గాని దేశమునకు కాళేశరాయుండు**
**కట్టికొనియె వీరకంకణమ్ము"**

ప్రాచీన భారతదేశ సంపదను తెల్పిన రమేష్ చంద్ర గుప్తుని గురించి, దేశ దారిద్ర్య స్థితికి కారణం ఆంగ్లేయులే అని చెప్పిన దాదాబాయ్ నౌరోజి గురించి, ప్రపంచ దేశాలకు ప్రేమను నేర్పిన క్రీస్తు గురించి, దక్షిణాఫ్రికాలో ప్రజల స్వాతంత్ర్యానికి ఉద్యమం చేసి సాధించిన గాంధీ గురించి, ఇంకా ఆయా ఖండాల చరిత్రల గురించి చదువుకొని తనలో జీర్ణించుకొన్నాడు. అలాగే

రాజారామ్మోహన్‌రాయ్ వ్యాసాల సారాన్ని, వివేకానందుని చిత్తశుద్ధిని, బుద్ధిని, వీరేశలింగం సంఘ సంస్కరణను, రఘుపతి వెంకటరత్నంగారి నడవడికను, కొమ్మర్రాజు లక్ష్మణరావు ఘనతను, ఉదాత్త ప్రేమ కల్గిన ముట్నూరి కృష్ణారావు గురించి తెలుసుకొని అశేషమైన జ్ఞానాన్ని సంపాదించారు. కాళేశ్వరరావు గారు రూసో, వాల్టరు ఫ్రెంచి విప్లవము ద్వారా స్వాతంత్ర్యం సాధించిన తీరును, మాజిని, గారి బాల్డు ఇటలీ దేశానికి చేసిన కృషిని, జార్జి వాషింగ్టన్ అమెరికాలో స్వేచ్ఛకోసం పడ్డ శ్రమను, భారతదేశంలో స్వేచ్ఛ, సమానత్వానికై ఆంగ్లేయులకు రొమ్ముచూపి ఎదిరించిన లాలాలజపతిరాయ్ మొదలైన దేశనాయకుల చరిత్రలను చదివి, కొన్నింటిని విని తన మనస్సులో నింపుకొని భారతదేశ స్వేచ్ఛకై పరితపించాడు. వీరి గురించే కాకుండా ఆర్థిక శాస్త్రము, రాజకీయ శాస్త్రము మొదలైన శాస్త్రాలను కూడా చదివి శాస్త్రజ్ఞానాన్ని కూడా సంపాదించారు. ఈ విధంగా కాళేశ్వరరావు గారు నోబెల్ కళాశాలలో 8 సం॥లు ఆదర్శ విద్యార్థిగా, వివేకవంతునిగా, గుణవంతునిగా విద్యాబుద్ధులతో కీర్తి పొంది పట్ట భద్రుడయ్యారు.

కాళేశ్వరరావు గారి తెలివితేటలకు నోబెల్ కళాశాల వారు అదే కళాశాలలో అధ్యాపకుని ఉద్యోగం ఇస్తూ సన్మానించారు. అధ్యాపకుడిగా ఆ కళాశాలలో తను పని చేసిన రెండేళ్ళలో విద్యార్ధులను ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్ది మంచి గురువుగా, విద్యార్థులచే కీర్తిని, మన్ననలను పొందారు. ఈ రెండేళ్ళలో ఇతను విద్యార్థులకు గణితము, చరిత్రను బోధించడంలో తన ప్రజ్ఞను చూపించారు.

"క్రూరసనాతనాచార సాంఘికభయం
కరపుశార్దూల దంష్ట్రలను జీల్చి
అంటరానితనంపు టడుసులో మున్గిన
పంచమజాతిని పైకితీసి
ఖలులైన యాంగిలేయుల రాజ్యపాలనా
భ్రష్టతగూర్చి యుపన్యసించి

సమభావ మీ దేశ జాతికేలేనిచో
ముక్తిలేదని గొప్ప బోధసల్పి
పగలురాత్రి తీరుబడిలేక సంతత
దేశభావిభాగ్య దీప్తికొఱకు
నడుముగట్టినాడు నవ్యసోత్సాహుడై
దేశబంధుడయ్య దేవరయ్య"

అంటరానితనం ముసుగులో ఉన్న పంచములను బయటకు తీసి, దుర్మార్గులైన బ్రిటీషు వారి పాలన గురించి ప్రజలకు చెప్పి, సమానత్వ భావం మనకు లేనిచో మన దేశానికి విముక్తి కలుగదని చెప్పి పగలు, రాత్రి అనే తేడా లేక దేశభాగ్యం కొరకు కాళేశ్వరరావు గారు నడుము కట్టారు.

తరువాత ఇంకా ఉన్నత చదువు కొరకు న్యాయవాది విద్యకై మద్రాసుకు వెళ్ళారు. అక్కడకు వెళ్ళేముందు కాళేశ్వరరావుగారి తల్లి వరలక్ష్మమ్మ కొడుకుని కౌగిలించుకొని నువ్వు నీ తండ్రి వలె పేరు ప్రఖ్యాతులు తెచ్చుకో, ఎవరికీ అపకారం తలపెట్టకు, చెడ్డ పేరు తెచ్చుకోకు, అందరిచే మెప్పు పొంది, ఆంధ్రజాతిలో మంచి పేరు సంపాదించి. తల్లిదండ్రుల పేరు నిలబెట్టు అని దీవించి పంపించారు. కాళేశ్వరరావు గారు న్యాయవాది విద్యను మద్రాసులో రెండు సంవత్సరాలు చదివారు. ఆ కాలంలో వీరికి వీరేశలింగం గారితో పరిచయం ఏర్పడింది. అప్పట్లో గల బాల్యవివాహాలు, వితంతువులకు మరలా పెళ్ళి చేయకపోవడం మొదలైనవి సమాజంలో ఉన్నాయి. వీటిని సంస్కరించడానికి వీరేశలింగం గారితో కలిసి పోరాడుతూ చదువు సాగించారు. బి.ఏ.బి.ఎల్ పాసై లాయరుగా పనిచేయడానికి ప్రాక్టీసుకై మద్రాసు నుండి గుంటూరు వచ్చారు. గుంటూరులో ఉంటుండగా యువ విద్యార్థి సంఘానికి నాయకత్వం వహించి వందేమాతర గీతం పాడుతూ, తిలక్ అడుగుజాడలలో నడుస్తూ, బ్రహ్మసమాజ సభ్యత్వం తీసుకొని అక్కడ ఉన్న అంటరానితనాన్ని, మతకలహాలను రూపుమాపడానికి ప్రయత్నించారు. హిందువులు అన్న భావనను విడిచిపెట్టి అంటరాని వారిని స్నేహితులుగా చేసుకొని వారితో ఉండడం వలన

కాళేశ్వరరావుని అతని బంధువులు వెలివేయడం జరుగుతుంది. "హరిజనులన్న ప్రేమ, సమాదరణ, గౌరవాభిమానం కలగడం వల్ల అనేక సభలను నిర్వహించి ప్రజలందరిలోను సమత్వాభావాన్ని తీసుకురావటానికి కృషి చేసాడు. భర్త చనిపోయిన ఒక వితంతువుకి పెళ్ళి చేసి మహిళలకు ప్రీతిపాత్రుడయ్యాడు.

"పతిబాసిన వనితాళికి
వితంతు పరిణయమొనర్చి విశ్రుతమహిళా
వితతి నమస్కృతులకు దా
నతి పాత్రుండయ్యె కాళికాహ్వాయుడంతన్"

గుంటూరులో లాయర్లందరిలో అగ్రగణ్యుడు, విజ్ఞానవంతుడు, దేశభక్త కొండా వెంకటప్పయ్యగారి దగ్గర ప్రాక్టీసుకై వెళ్ళెను. వెంకటప్పయ్యగారి దగ్గర గడిపిన 90 రోజులలోనే న్యాయశాస్త్రంలో విశేషమైన జ్ఞానాన్ని సంపాదించారు. ప్రాక్టీసు తర్వాత పసిడిపంటలు పండిన కృష్ణానదీ తీరము, అర్జునుడు పాశు పతాస్త్రము గెల్చుకున్న చోటు, కనకదుర్గాదేవి వెలసిన ప్రదేశము అయిన విజయవాడకు న్యాయవాది వృత్తికి వచ్చాడు. అప్పుడు ఆంగ్లేయులు అతనికి 'జిల్లామున్సబు' పదవిని ఇవ్వగా దానిని తిరస్కరించాడు. గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, కొమరాజు లక్ష్మణరావుల స్నేహముతో దేశమున సంఘసంస్కరణకు, సమానత్వంతకు కృషిచేయుటకు పనిచేసెను. కాంగ్రెస్ సభ్యత వహించి "విజ్ఞాన చంద్రికా మండలి" ని స్థాపించుటలో కూడా తనవంతు కృషి చేసెను. సాహిత్య విజ్ఞాన చంద్రికా మండలిలో సెక్రటరీ పదవిని చేపట్టి రచయితలను ప్రోత్సహించి, పేద విద్యార్థులకు చదువుకొనుటకు ఆర్థిక సహాయమందించెను. కవులను, గాయకులను పిలిచి వారికి గౌరవ సత్కారాలు చేసారు.

అయ్యదేవర కాళేశ్వరరావుగారు 18 వ యేట పింగళి వీరభద్రయ్య, పేరమాంబలకు జన్మించిన దుర్గమాంబను పెళ్ళిచేసుకున్నారు. ఈమె కాళేశ్వరరావు గారికి ప్రీతి పాత్రురాలై, అతనికి అడ్డుచెప్పక సన్మార్గంలో నడుచుకుంటుండేది.

**"తానాడిన ప్రతివాక్కున**
**కేనాడెదిరీయనట్టి యీసాధ్వి దు**
**ర్గామల గణ్యచరిత్రవ**
**బీమహిళల కొక్కనీతినే, నేర్పించున్."**

వీరికి ఒక కుమారుడు. అతని పేరు వెంకటకృష్ణ రామ్మోహన్‌రావు వీరి కోడలు మాలతి. రామ్మోహన్‌రావు అమెరికాలో వ్యవసాయ శాస్త్ర విద్యను అభ్యసించెను.

కాళేశ్వరరావు గారు లాయరు వృత్తిని చేపట్టి ధనం, లాభం ఆశింపక న్యాయమైన దారిలో నడచుకొని పేదవారికి, అట్టడుగు జాతివారికి న్యాయం అందేలా చేసాడు. తనక్కు వచ్చిన నెలజీతము మొత్తం 3000 రూపాయలను ధర్మకార్యాలకే వెచ్చించేవాడు. గాంధీ అంతటి మహానుభావుడు ఆంధ్రదేశాన్ని పర్యటించేటప్పుడు కాళేశ్వరరావు గారి ఇంట్లో విశ్రాంతి తీసుకొన్నారంటే కాళేశ్వరరావు గారు ఎంత పేరు మోసిన దేశవాదో మనం తెలుసుకోవచ్చు.

ఆ సమయంలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్ మరణించారని తెలిసి ఎంతో బాధపడతారు. తిలక్ భావాలు ఇంకా పూయకముందే మరణించారని గాంధీగారు సైతం కన్నీరు పెట్టుకున్నారు.

**"తిలకుపుణ్యతముడు దేవలోకము కేగ**
**దేశభక్తకోటి దేబెరించె**
**కరముచందుగాంధి కన్నులనీరమ్ము**
**సిమ్మినాడుగుండె చెమ్మరింప"**

అప్పుడు బాపట్లలోను, విజయవాడలోను కాంగ్రెస్ సభలు జరిగాయి. ఆ సభలలో ఎందరో నాయకులు ఉపన్యసించారు. వాటిని విని కాళేశ్వరరావు గారు బానిస బతుకు బతుకుతున్న భారత ప్రజల బాధను చూసి స్వాతంత్ర్య దీక్షకై పూనుకొన్నాడు.

"బానిసపు జీవితమ్మున బ్రతుకుచున్న
భరతజనయిత్రి కన్నీటి వరదలోన
తడిసి స్వాతంత్ర్యదీక్షమై నడుముగట్టె
అయ్యదేవర కాళేశు దట్టివేళ"

కలకత్తా కాంగ్రెస్ సభలో నాయకుడు ఎవరు అనే అంశంపై గాంధీజీకి, లాలాలజపతిరాయ్‌కు మధ్య పోటీ వచ్చింది. అప్పుడు అక్కడున్న వారందరూ గాంధీ వైపే మొగ్గు చూపడంతో గాంధీ ఆ సభకు నాయకుడిగా ఎన్నికయ్యారు. ఈ విజయాన్ని కాళేశ్వరరావు గారు మోతీలాల్ నెహ్రూ, బాబూ రాజేంద్రప్రసాద్, మహమ్మదాలీ, వల్లబాయి పటేల్ మొదలైన వారితో కలిసి ఆస్వాదించారు. గాంధీజి తన జీవితం మొత్తాన్ని దేశసేవకే అంకితం చేసి, తన ధనాన్ని కూడా దేశానికై వెచ్చించిన గొప్ప త్యాగమూర్తి. అందుకే అతనికి విజయం వరించింది. కాళేశ్వరరావు కూడా గాంధీమార్గమున నడిచి దేశ స్వేచ్ఛకై పాటుపడ్డారు. ఇతను ఆంధ్రదేశమున విజయవాడలో ఉంటూ రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శిగా, మున్సిపాలిటీ సంఘ ఛైర్మన్‌గా 5 సం॥లు నిర్విరామంగా కృషి చేసి విజయవాడలో పెద్దమనిషిగా పేరు సంపాదించారు. ఈ 5 సం॥లలో మురుగు కాల్వలు కట్టించడం, విద్యుత్తు తీసుకురావడం, గాంధీ పార్కును స్థాపించడం, తియ్యని కృష్ణాజలాలను తాగునీరుకై తెప్పించడం మొదలైనవి చేసెను. దీనికి విజయవాడలోని ప్రజావాహిని అంతా కాళేశ్వరరావుని వేనోళ్ళ కొనియాడారు.

ఈ ముర్గుకాల్వల నెవరుకట్టించిరి
అయ్యదేవరపు వంశాబ్ధిరాజు
ఈమహావిద్యుత్తు నెవరు తెప్పించిరి
కాళేశరాయండు క్రమయశుడు
ఈగాంధిమునిపార్కు నెవరు స్థాపించిరి
దేశబాంధవుడు కాళేశుబాబు
ఈతియ్యనిజలానికే తండ్రికారకుం
డాతండ్రి కాళేశ్వరాహ్వాయుండు

గాంధీ బాటలో నడుస్తూ సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నందుకు ఒక సం॥, ఉప్పు సత్యాగ్రహ ఉద్యమ చేసినందుకు రెండవ సారి రాయవెల్లూరి జైలులో ఉన్నారు. జైలులో గడిపిన సమయంలో తర్కుల సామ్రాజ్య చరిత్రను రాసారు. మొత్తం ఆరుసార్లు జైలు జీవితం గడిపి పస్తులు ఉండి దేశంలో స్వాతంత్ర్య (జైలులో గడిపిన కాలంలోనే ఫ్రెంచి విప్లవ చరిత్ర, అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర, చైనా జాతీయోద్యమ చరిత్ర, ఈజిప్టు చరిత్ర మొదలైన గ్రంథాలను రాసాడు.) బీజాలు నాటాడు. బొంబాయి ఆగష్టు విప్లవములో పాల్గొన్నప్పుడు బ్రిటీష్‌వారు ఇతనిని అరెస్టు చేసి రాయవెల్లూరి జైలుకి తీసుకుపోగా ఆ సమయంలో కాళేశ్వరరావుకి న్యూమోనియా వ్యాధి వచ్చెను. జనరల్ ఆసుపత్రిలో చనిపోయే స్థితిలో ఉండగా లక్ష్మీపతి అనే వైద్యుడు వైద్యం చేసి బతికించెను. ఈ విధంగా మొత్తం 3 సం॥లు ఆరోగ్యముతో పోరాడి గెలిచాడు. గాంధీగారికి అత్యంత సన్నిహితుడిగా మెలుగుతూ దేశమున సమున్మేషము సాధించుటకుపోరాడారు. ఇతని త్యాగ సంపదకు గుర్తుగా ఊరి మధ్యలో ఇతని పేరుతో ఒక మార్కెట్టు నిర్మించారు.

**"ఘనుడౌనీతని త్యాగసంపదకు తార్కాణమ్ము నూరిమ**
**ధ్యనునిర్మించిరి పత్తనప్రజలు దివ్యంబైన మార్కెట్టు శో**
**భనమై నేటికిదావెలుంగునది సర్వస్వమ్ము దేశానికిన్**
**తృణమౌ ఖ్యాతినొస గుత్యాగికిక దా ధీప్రోన్నతాసన్నుతుల్**

12సం॥లు సెనేట్ సభ్యుడిగాను, 6 సం॥లు సిండికేట్ సభ్యునిగాను పనిచేసారు. పంచములను ఆదరించి వారిలో ఒకరికి ప్రసిద్ధ పదవి దక్కేటట్లు చేసారు.

"పంచముల నాదరించు, ద
యాంచిత భాసురుడు కాళికాహ్వాయుడన బో
షించి తయారొనరించియుఁ
బంచము నొకనినిఁబ్రసిద్ధపదవికి దెచ్చె"

తండ్రి సంపాదించిన ఆస్తిలో కొడుకులకు మాత్రమే హక్కు కాదు కూతుళ్ళకు (స్త్రీలకు) కూడా హక్కు కలదని, చదువుకోవడం పురుషులకు మాత్రమే కాదు స్త్రీలకు కూడా అవసరమని, సాంఘిక, ఆర్థిక సంప్రదాయాలలో పురుషులతో పాటు స్త్రీలకు కూడా సమాన హోదా ఉందని, స్త్రీకి స్వేచ్ఛ ఉండాలని, భార్య బతికి ఉండగా ఇంకో పెళ్ళి చేసుకోవడం (తప్పు) నేరం అని హెచ్చరించి, గద్దించి చెప్పి వీటిలో విజయం సాధించారు.

**"కొడుకులే యనుభవించెడు తండ్రిహక్కులో**
**కూతుళ్ళకును హక్కుగూడ గలదు**
**పురుషజాతికి విద్య గఱపినచందాన**
**అలరుబోడికి విద్దె యవసరమ్ము**
**సాంఘికార్థిక ఘన సంప్రదాయాలలో**
**పురుషులతో స్త్రీకిఁబొత్తుగలదు**
**స్త్రీయన్న వట్టి బచ్చెనబొమ్మగాదు స్వే**
**చ్ఛావిహారము లభించగలవలయును**

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో ప్రజలందరూ స్వేచ్ఛాగీతాలు పాడుకొన్నారు. దేశ నాయకులు సైతం ఆనంద భాష్పాలు విడిచారు. గాంధీకూడా హర్షనాదాలు చేసారు.

**"గణగణలాడె గంటలు, దిగంతము లెల్లనుమారుమ్రోగె స్వే**
**చ్ఛననుభవించుహక్కు తెలిజాతి యొసంగ నిరంతరవ్యథా**
**బ్ధిని జితియించు భారతికి, వేడుకనందిన భారతాంబయు**
**గొనకొని చేసికొన్నయది, గొప్పగు సంబరమాదినమ్మున"**

హైదరాబాదు, మైసూరు మొదలైన భారత సంస్థానాల స్వేచ్ఛకోసం దేశనాయకులతో పాటు కాళేశ్వరరావు గారు పాటుపడ్డారు. ఆ సమయంలో నిజాం ప్రభువు మతం పేరుతో చిచ్చుపెట్టి కనిపించిన హిందువునెల్ల క్రూరంగా చంపారు. దానితో తెలంగాణా ప్రజలు భయపడి భారత రక్షక భటుల సాయంతో స్వేచ్ఛను సంపాదించుకొన్నారు గాంధీ, క్రీస్తు, బుద్ధుడు నడిచిన బాటలో

అడుగుతప్పకుండా అడుగువేసి నడుస్తూ ఈ సృష్టిలో అన్ని జాతులు సమానమని అందరికీ చెప్పి, బ్రాహ్మణులు, అబ్రాహ్మణులు అన్న భావము కలుగజేయకుండా అందరితో కలిసి భోజనం చేస్తూ, జాతీయ భావాన్ని అందరిలో కలుగజేయడానికి అనేక వ్యాసాలు రాసి ప్రజలందరితోను కలుపుగోలు తనంగా ఉన్న కాళేశ్వరరావు గారిని కాంగ్రెస్ ఉపాధ్యాక్ష పదవికి ఎంపిక చేసారు.

"సకలజాతులు వనజభవునిసృష్టిలో
సరిసమానంబన్న యొరుకజేసి
బ్రాహ్మణా బ్రాహ్మణ భావంబులేని యం
తర్వర్ణముల భోజనమ్ముసల్పి
జాతీయభావబీజాలంకురింపగ
జమలేనిదొడ్డ వ్యాసాలువ్రాసి
అఖిల మానవులు దైవాత్ములేయనిపల్కి
కలుపుగోలుతనమ్ము వెలువరించి
"ఖదరుబట్టగట్టి ముదురుకోమటి జెట్టి
వంకలేనిసోబగు పథముబట్టి
కాళికేశుదాంధ్ర కాంగ్రెసుపాధ్యక్ష
పదవినందికొనియె ప్రజలుమెచ్చ."

భారత స్వాతంత్ర్యం తరువాత కాళేశ్వరరావు గారు విశాలాంధ్ర సాధనకై కృషి చేసారు. మొదటి, రెడవ విశాలాంధ్ర మహాసభలలో కాళేశ్వరరావు గారు ఆంధ్రప్రజలారా, తెలంగాణ వీరులారా, సీమ వాసులారా అని మూడు ప్రాంతాల వారిని ఉద్దేశిస్తూ మైసూరు సంస్థానాల పాలనతో విసిగిపోయిన తెలుగువారము మనందరం. తెలుగుతల్లిని విడువక, స్నేహభావములు ఏర్పరచుకొని తెలుగువారందరూ ఒక రాష్ట్రం కోసం, రాష్ట్ర సాధనకోసం ఉద్యమించండి. అని ఉపన్యసించెను.

"ఎందున్నన్ తెలుగున్ సహోదరులు మాతృశ్రీ విసర్జింపకన్
పొందుంబొత్తులు సల్పుకోవలెను సంపూర్ణాభిమానాలు, నిం

పొందింపంగవలెన్ : విభేదములు బాబూ! యుండగారాదు నా
యందున్నట్టిది తెల్గురక్తముసుమీ! యంచున్ గ్రహింపన్ వలెన్

కర్నాటకులు, మహారాష్ట్రులు, సిక్కులు మొదలైన వారు వారి వారి రాష్ట్ర సాధనకై పోరాడుతుండగా మనము తెలుగు భాష మాట్లాడుతు తెలుగు వారందరికీ ఒక భాషా ప్రయుక్త రాష్ట్రం కావాలని ఉద్యమించుదాం రండి అని ప్రజల్ని ఉత్తేజ పరిచి, నిజాం పాలనతో విసిగిపోయిన మాజీ మంత్రులు, న్యాయమూర్తులు, కళామూర్తులు, బూర్గుల రామకృష్ణారావు, పుల్లారెడ్డి, బులుసు సాంబమూర్తి, కల్లూరి చంద్రమౌళి మొదలైన వారితో కలిసి ఆంధ్రరాష్ట్ర సాధనకై కాళేశ్వరరావు గారు ఎన్నో ప్రయత్నాలు చేసారు.

"అడుగుచున్నారు నిజాంతరంగాలు, పొం
గార, రాష్ట్రమును కర్ణాటజాతి
మురియుచున్నారు సంబరము రెట్టింప స్వ
రాష్ట్రపూజకు మహారాష్ట్రజనము
కుములుచున్నారు బిక్కు మొగాన నిజరాష్ట్ర
సిద్ధికి వాంఛించు సిక్కుబలము
కోరుచున్నారు భాషారాష్ట్ర విభజన
మవసరంబని దేశమందుజనులు
మూడు చెఱగుల నశియింపబోవుచున్న
తెలుగుసీమల నైక్యమ్ము సలుపుటకయి
లెమ్ము నాతెలంగాణమా! లెందు నాయ
నుంగు సోదరులారా! యనుచుపలికెను
"బూజుంబట్టు నిజాముపాలనములో, బుగ్గైనవారందరున్
మాజీమంత్రులు, న్యాయవాదులు కళామార్తాండులేతెంచిరా
రోజున్తత్సభకు - సభాధిపతి వాక్రుచ్చుభావాలకున్
రాజిల్లెన్ సభ; కార్యదర్శియగు పుల్లారెడ్డిగారంతటన్"

మూడవ విశాలాంధ్ర మహాసభలో కడప కోటిరెడ్డి, పట్టాభి సీతారామయ్య, విశ్వనాథ తెలుగు మంత్రులు హాజరయ్యారు. కాళేశ్వరరావుగారు ఈ సభలో గాంధీ సిద్ధాంతాలను, తెలుగు వారి ఘనతను, వారి పూర్వ చరిత్రను చెప్పెను. రుద్రమదేవి పరాక్రమాన్ని, కృష్ణదేవరాయల పౌరుషాన్ని, కాకతీయుల వైభవాన్ని, బొబ్బిలి రాజుల ప్రతాపాన్ని, పల్నాటి వీరుల గాంభీర్యాన్ని గూర్చి, ఎన్నో జీవనదులు, సస్య శ్యామలమైన పంటలు పండు ఈ ప్రదేశాన్ని గూర్చి ఉపన్యసించెను. అలాగ్గే తెలుగు వారు పరమత సహనం కలవారని, మహమ్మదీయులకు ఇక్కడ లోపం జరగదని చెప్పెను. దానితో ముస్లింలు సైతం ఈ ఉద్యమంలో పాల్గొన్నారు.

**"మామూదుల్ తమజాతి మేలుకయిసంప్రశ్నించు ప్రశ్నావలిన్**
**హేమాహేమియులున్న తత్సభను కాళేశుండు చిర్నవ్వుతో**
**హామీయిచ్చె మహమ్మదీయులకుమాయాంధ్రానలోపంబు మీ**
**కేమీరాదను వాక్కునన్ దురకవారెంతో మహానందులై"**

దీంతో తెలుగు రాష్ట్ర సాధనకు కొండా వెంకటప్పయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు, దుగ్గిరాల గొపాలకృష్ణయ్య, పొట్టి శ్రీరాములు మొదలైన వారు కృషి చేసారు. ఎందరో మహానుభావులు రాష్ట్ర సాధనకు కృషి చేసి చనిపోయారు, ఎందరో తెలుగుతల్లికి ప్రాణాలు అర్పించారు. పొట్టి శ్రీరాములు 58 రోజులు దీక్ష చేసి ప్రాణాలు అర్పించారు. దానితో ఢిల్లీ పీఠము కదిలి తెలుగు వారికి రాష్ట్రాన్ని ఇచ్చారు.

"నలభైయేండుల నుండి యాంధ్రులు, మహాంధ్రస్వర్ణకళ్యాణి బి
డ్డలు; దీక్షంబొనరించు యజ్ఞమునఁగట్టా! యొందరో ప్రాణముల్
బలిగా స్వీయధరిత్రిమోదపడనివ్వన్; దేశసౌజన్య మిం
దులనేమున్నదియంచు చెప్పెడిప్రబుద్ధుల్ నేర్వగాపాఠమున్
బలియయ్యెన్ ఘనపొట్టిరాముడు నదంభ ప్రేమమూర్త్యంశువై
"ముని పొట్టిరాముండు కనులు మూసినవెంటఁ
గంపమందెను ఢిల్లి కనకపీఠి

ఘనపొట్టిరాముండు కునికినాదనివిన్న
సకలాంధ్రభూదేవి జర్జరించె
అనఘుండు రాముని ప్రాణాంతమునుఁ గని
తెలుగునాయకకోటి పలవరించె
మాన్యుండు రాముని మరణమ్ముఁ గనినంతఁ
దెలుగు ప్రత్యంగంబు విలవిలఁబడె"

**"ఏబదెన్మిది దినముల నీమహా ప**
**విత్ర యజ్ఞమునుఁ బొనర్చె విధియు హర్ష**
**మందినట్టుల తనువునే యందుకొనియె**
**సచివ జహ్వారు దాంధ్రరాష్ట్రము నొసంగె"**

ఆంధ్రరాష్ట్రము సాధించిన తరువాత దానికి రాజధాని కర్నూలు అయ్యింది. మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు. కానీ గౌతులచ్చన్న మొదలైన వారు తొలి మంత్రి వర్గాన్ని కూలదోసారు. అప్పుడు ఎన్నికలు మొదలయ్యాయి. ఆ ఎన్నికలకు కాళేశ్వరరావు గారు పగలు, రాత్రి కష్టపడి అన్ని ప్రాంతాలకు తిరిగి బంధుపక్షపాతము మాకులేదు, దొరలు దొంగల య్యారు, దొంగలు దొరలయ్యారు, మీ ఓట్లు మాకిచ్చిన శ్రేయోరాజ్యాన్ని ఏర్పాటు చేస్తాం. భారతదేశానికి స్వేచ్ఛను తెచ్చిన గాంధీ కాంగ్రెస్ వాది కదా! అని చెప్పి ప్రచారం చేసారు. ఈ ఎన్నికలలో విజయవాడ పట్టణానికి ప్రతినిధిగా కాళేశ్వరరావు గారు నిలబడ్డారు. ఇతని గెలుపు కోసం హైదరాబాదులోని నాయకులు, ఢిల్లీలోని నాయకులు విజయవాడకు వచ్చి కాళేశ్వరరావుగారి కృషిని గురించి, అతని సేవను గురించి, అతను చేసిన ప్రగతిని గురించి ఉపన్యసించారు. హరిజనులు, క్రైస్తవోత్తములు కూడా వచ్చి ఉపన్యసించారు. ఈ ఎన్నికలలో కాళేశ్వరరావు 9000 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆంధ్రశాసన సభకు ఉపాధ్యక్షుడయ్యారు. అప్పటి ప్రధాని నెహ్రూ ఆంధ్రదేశాన్ని సందర్శించటానికి వచ్చినప్పుడు ఎందరో నాయకులు వారిని కలవడానికి వెళ్ళారు. ఆంధ్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అయిన బెజవాడ గోపాలరెడ్డి, కాళేశ్వరరావు

గారు కూడా నెహ్రూని కలిసారు. అప్పుడు నెహ్రూ కాళేశ్వరరావుతో కరచాలనం చేసి ఇష్టాగోష్టి జరిపారు. కాళేశ్వరరావు శాసనసభకు ఉపాధ్యక్షుడై రెండుసార్లు ఢిల్లీ వెళ్ళి అక్కడ పెద్దలతో కలిసి ఆంధ్రరాజ్య కృషికై చర్చించారు. వరకట్న నిషేధానికై శాసనసభలో శాసనాన్ని వేయించిన ఘనత కాళేశ్వరరావు గారిదే.

**"వరులకు కట్నములిడు, దు**
**ర్భరమగు వాతావరణము తొలగన్ ద్రోయ**
**వరకట్ననిషేధార్థము**
**సరవి శాసనమునుంచె శాసనసభలో"**
**"ఆస్తి వదలి కులపు వ్యత్యస్తమ**
**బుద్ధ దేసు గాంధి బోధలన్ని**
**మాచరించు దొడ్డ త్యాగమూర్తివి నీవె**
**అయ్యదేవరాన్వయాబ్ధిరాజ!**

ఈ విధంగా అయ్యదేవర కాళేశ్వరగావు నిర్విరామంగా కృషిచేసి, దేశమునకై తన జీవితాన్ని వెచ్చించి, కుల, మత వ్యత్యాసాలను వదిలి, ప్రజలందరినీ సమైక్య పరిచి, స్వాతంత్ర్యసాధనకై ఉత్తేజపరిచి, గాంధీ బోధనలతో ప్రేరేపితుడై విశాలాంధ్ర స్థాపన చేసాడు. దేశబంధు బిరుదు పొందిన, శాసనసభాధ్యక్షుడు అయిన కాళేశ్వరరావు ఎన్నో ఉన్నత పదవులను అలంకరించి చివరికి తన 80వ యేట 1962 ఫిబ్రవరి 26న పరమపదించారు.

## గోల్కొండ

విజయనగర రాజ్య పతనం ఆంధ్రుల చరిత్రలో ప్రధాన ఘట్టం. ఇంగ్లీషు వ్యాపారస్థులు మద్రాసులో పోర్ట్‌సెంట్ జార్జ్‌కోటను కట్టుకొని తమ వ్యాపారాన్ని, అధికారాన్నిదక్షిణాదిన వ్యాప్తి చేసుకోసాగారు. తెలంగాణా, కోస్తా ప్రాంతాలు, రాయలసీమ, గోల్కొండ నవాబులచే, సుబేదారులచే పరిపాలింపబడినవి. బహమనీ రాజ్యం ముక్కలై ఏర్పడిన ఐదు రాజ్యాలలో ఆంధ్రుల చరిత్రతో సంబంధమున్న వారు గోల్కొండ నవాబులు మాత్రమే.

ఈ నవాబులు 1512 - 1687 వరకు 158 సంవత్సరాలకు పైగా తెలంగాణా, కోస్తా జిల్లాలను పరిపాలించారు. ఈ 150 సంవత్సరాలు రాయలసీమ ప్రాంతాన్ని విజయనగర రాజులు పెనుగొండ, చంద్రగిరి రాజధానులుగా పరిపాలించారు. గోల్కొండ నవాబులు ఆరుగురు. కులీకుతుబ్ షా, జహీద్, ఇబ్రహీం, మహమ్మద్, అబ్దుల్లా, అబుల్ హసన్. కుతుబ్ షా అనే గౌరవ బిరుదును అందరూ ధరించేవారు. కులీ కుతుబ్ షా రాజ్యాన్ని స్థాపించినప్పుడు తెలంగాణలోని కొంత మాత్రమే ఇతని ఆధీనంలో ఉంది. మిగిలిన తెలంగాణా, కోస్తా, ఆంధ్ర దేశాలు గజపతుల ఆధీనంలో ఉంది. కృష్ణదేవరాయులు కళింగ దండయాత్ర జరిపి ఆంధ్రదేశాన్నతంటిని జయించినప్పుడు దేవరకొండ, రాచకొండ దుర్గాలను కులీకుతుబ్ షా స్వాదీనం చేసుకున్నాడు. తొందరలోనే కృష్ణదేవరాయులతో జరిగిన ముఖాముఖి యుద్ధంలో చనిపోయాడు. రాయల మరణానంతరం ఓరుగల్లు, ఖమ్మం మెట్ట, బెల్లంకొండ, కొండపల్లి దుర్గాలను, పానుగల్లు దుర్గాలను జయించాడు. తెలంగాణా అంతా కుతుబ్షాల అధీనంలోకి వచ్చింది.

ఇబ్రహీంకులీకుతుబ్ షా 1550 - 80 మధ్య పరిపాలించాడు. గోల్కొండ నవాబులలో సుప్రసిద్ధులు. ఇతని గురించి కొమర్రాజు లక్ష్మణరావుగారు మహ్మదీయ మహాయుగంలో ఈ నవాబు విద్వాంసుడు. ఇతని రాజ్యంలో దొంగల భయ్యం లేదు. మసీదులను, చెరువులను కట్టించి ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలు చేసాడు. గోల్కొండ కోట చుట్టూ ప్రహరి గోడ, ఇబ్రహీంబాగ్, ఫుల్ బాగ్ తోటలు, ఉస్సేన్ సాగర్ చెరువు, మూసీనది ఆనకట్ట కట్టించారు. ఇతన్ని మల్కిభరామ్ అనే పేరుతో కవులు కీర్తించారు. ఇతని కాలంలో తెలగన్న, కందుకూరి రుద్రకవి, అద్దంకి గంగాధరుడు మొదలైన కవులుండేవారు. ఇబ్రహీం తరువాత, మహమ్మద్ కుతుబ్ 1580 - 1611 మధ్య పాలించి హైదరాబాద్ నగరాన్ని నిర్మించాడు. ఇతని కుమారుడైన అబ్దుల్లా హసన్ కాలంలో ఆంధ్రదేశం అంతా గోల్కొండ నవాబుల వశం అయింది. గోల్కొండ నవాబులలో ఆఖరినాడు అబుల్ హసన్ కుతుబ్షా. ఇతనినే తానీషా అని పిలుస్తారు. తానీషా అనగా మంచిరాజు.

ఇతని వద్ద అక్కన్న అనే మేధావి (మంత్రి), మాదన్న అనే సేనాని ఉండేవారు. వీరి మేనల్లుడు కంచర్ల గోపన్న, ఇతని రామదాసు పేరుతో పిలిచేవారు. గోపన్న భద్రాచలం తహసీల్దారుగా ఉండేవాడు. సర్కారు పైకంతో దేవాలయం నిర్మించాడు. శిస్తు చెల్లించనందుకు తానీషా శిక్షవేసి ఆ తరువాత భక్తుడని తెలుసుకొని వదిలేసాడు. గోల్కొండ పాలించిన నవాబుల చరిత్రను, నవాబుల దగ్గర పనిచేసిన అక్కన్న, మాదన్న, రామదాసుల జీవిత విశేషాలను గోల్కొండ కావ్యంలో తన ప్రతిభతో చిక్కని పద్యధారతో కావ్యాన్ని నిర్మించారు జ్ఞానానందకవిగారు. ఈ కావ్యం చరిత్రకు సంబంధించినదైన తెలుగువారి సంస్కృతికి, దైవభక్తికి మూలమైన రామదాసు, అక్కన్న, మాదన్నలకు సంబంధించిన విషయాలను రమ్యంగా పద్యాలలో రచించారు జ్ఞానానందకవి గారు.

గోల్కొండ కావ్యం ఐదు భాగములుగా విభజించారు. అవి 'అవతరణము' 'మీర్జుమ్లా' 'తానీషా' 'అక్కన్న – మాదన్న' 'రామదాసు' మొదలైనవి.

గోల్కొండ సామ్రాజ్యంలో రాతి సింహాసనమున సుల్తానులెంతో మంది కూర్చున్నారు. అందులోని ఆయుధాగారమున ఉన్న ఆయుధములు శత్రువుల గుండెలను సైతం చీల్చాయి. రాముని భక్తుడైన రామదాసు బంధీయైన చోటు, కళాపోషకుడు, తానీషా అయిన ఇబ్రహీం కుతుబ్షా కట్టించిన గొప్ప సమాధి ఉన్న స్థలం. గొప్ప మంత్రులైన అక్కన్న, మాదన్నలు తిరిగాడిన ప్రదేశం,. తెలుగు జాతి సమస్త శక్తులు ఉన్న నిలయం గోల్కొండ కోట. ప్రపంచచరిత్రలో భాగ్యనగరమైన హైదరాబాదుకు పేరు ప్రఖ్యాతులు ఈ గోల్కొండ కోట వల్లనే వచ్చాయి. అయితే మొదట ఈ గోల్కొండపై గొల్లవారు గొఱ్ఱెలను మేపుతుండేవారు. ఆ కొండపై సంపద కలదని కులీకుతుబ్షా గోల్కొండ కోటను నిర్మించాడు. ఈ విధంగా గొల్లలు కొండపై గొఱ్ఱెలను మేపడం వలన దీనికి గొల్లకొండగా పేరు వచ్చి అది తరువాత గోల్కొండగా మారింది.

"గొల్లలు మేటులై పసులకోటుల నీ పెనుఱాతిగుట్టపైఁ
దొల్లిఁట మేపి రంద్రిచటఁ దోపుసంపదరాశి దోగి రా

**జిల్లెడు రాజకీయమున సిద్ధి వహించి కులీకుతుబ్బుషా**
**యుల్లము పల్లవింప నిటు లున్నతఁ జెందెను గొల్లకొండగా.**

గోల్కొండ. పుట - 3

గోల్కొండ కోట చాలా అద్భుతంగా ఉంటుంది. దీని వైభవం చెప్పలేనిది, శత్రువులు ఫిరంగులతో దాడిచేసినా చెక్కు చెదరదు, మట్టిగొట్టాల ద్వారా మంచి నీరు రావటానికి చేసిన నిర్మాణం అంతుపట్టనిది, ఇక్కడ ఏర్పాటు చేసిన శబ్దయంత్రం ఎవరికీ అంతుచిక్కనిది. ఈ విధంగా గోల్కొండ కోట ప్రకాశిస్తుంది.

**ఏశిల్పి మలచినాఁ డీబండఱాతని**
**వేడ్కమై దేవతావిగ్రహమ్ము**
**ఏమనీషి సృజించె నీదివ్యతరమౌ మ**
**హొజ్జ్వలం బైనపేరోలగమ్ము**
**ఏసిపాయి యెదిర్చె నీఫిరంగులతోడ**
**పచ్చిశత్రులకు దుఃఖుచ్చిఁ గొట్టి**
**ఏవాస్తు అస్త్రజ్ఞుఁ డీమట్టిగొట్టాలఁ**
**బ్రవహింపఁగాఁ జేసె స్వచ్ఛగంగ**
**ఇచటి శబ్దయంత్ర మెవ్వానిధిషణా క**
**షణకు బిరుదు లిచ్చుపనితనమ్ము**
**డీలువడియెఁ గుతుబుషాల యుచ్ఛస్థితిఁ**
**బెల్లుబికిన నాటి గొల్లకొండ**

గోల్కొండ. పుట - 3

## అక్కన్న - మాదన్న

అక్కన్న, మాదన్నలు బహుముఖ ప్రజ్ఞావంతులు, ప్రతిభామూర్తులు. వీరి గురువు భానూజీ పంతులు. వీరిలో ఒకరు మహామంత్రి, ఒకరు సేనాపతి. వీరిద్దరూ ఒకరులేనిచో ఒకరు లేరు అన్నంతగా పేరెన్నికగన్న సోదరులు. ఊహాప్రతిపాదనలు చేయడంలో ఒకరికి మించిన వారింకొకరు.

ఒక్కఁడుత్సాహియై యుబికి యెత్తును వేయు
నొకఁడంతకంటె వేయు నొకయెత్తు
ఒకఁడు రాజ్యంపుటభ్యుదయమ్ముఁ జింతించు
నొకఁడు రాజ్యవిశాలతకుఁదలంచు
ఒకఁడు సర్వమతాలయున్నతి నాశించు
నొకఁడు పరమతాల కొప్పుసేయు
కనుఱెప్పగాఁ జూచుకొను రాజు నొక్కండు
నొకఁడు ప్రాణ మ్మటం చుబికిపోవు
ఊహలోనఁ దమ్ముఁడొక వేళ నన్నయౌ
అన్న యొక్క వేళ ననుజుఁడగును
మీసహోదరత్వమే యదొక వినూత్న
సృష్టిగా రహించ చివురుఁదొడుగు.

గోల్కొండ. పుట - 51

గోల్కొండ రాజ్యంపై ఎవరైనా దండెత్తే ముందు అక్కన్న, మాదన్నల శక్తిని తెలుసుకోవాలి. ఊహలు వేయడంలో వారి ప్రజ్ఞను గమనించాలి. వారి ఆలోచనలు పసిగట్టాలి. అప్పుడే శత్రువులు విజయం సాధించగలరు. పై వాటన్నింటిలోను అక్కన్న, మాదన్నలు ప్రజ్ఞావంతులు కావటంతో ఆ గోల్కొండ రాజ్యమునకు అగ్రస్థానం దక్కింది.

ఎవరయ్య మీరు మీ రవురంగజేబులా?
తెలుగుమంత్రులశక్తి దెలిసికొందు
నీవటోయి గ్రహింపలే వాకో మీర్జుమ్లు?
అక్కన్న మాదన్న లాత్మశక్తి
ఏమోయి పున్నిఖాన్! శ్రీమహత్తున ఁ గూలి
అన్నదమ్ముబుద్ధి నరయ వైతి
ఏమిసరోమరాణీ! మతి చెదెరెనా
హైందవజాతికి నదరుపడుచు

**ఈభువన రాజ్యరమకెల్ల నీశ్వరత్వ**
**ము వహియించు గోల్కొండ ప్రభుత్వమునకు**
**నగ్రతాంబూల మందినయట్టివారు**
**తెలుగుశక్తుల విడదీయ వలనుపడదు.**

గోల్కొండ. పుట - 52

తానీషా ప్రభువుల కొలువులో ఎంతోమంది బలవంతులు, మంత్రులు ఉన్నా అక్కన్న, మాదన్నలకు కలిగిన స్థానం ఎవరికీ రాదు. రాజ్యపాలనా భారం మొత్తం వీరి భుజాలపై వేసుకొని రాజ్యాన్ని సంరక్షిస్తూ తానీషా ప్రభువులకు వివేకాత్ములై వెలుగుచున్నారు.

**వందకు వందపాళ్ళు బలవంతులు గల్గునవాబుకొల్వులో**
**విందుగ మీకు స్థానము లభించుటచే నిది గోలకొండరా**
**జ్యేందిరనోము లెల్ల ఫలియించె, రహించె తెలుంగుజాతి ని**
**ష్పందత లేని మీయశము బారలుసాచె దిగంతసీమలన్.**

గోల్కొండ. పుట - 53

అక్కన్న, మాదన్నల వంశమున ముందు పుట్టిన పింగళి సూరన కళాపూర్ణోదయ అనే కల్పిత ప్రబంధంతో జగద్విఖ్యాతి పొందాడు. వీరు కూడా తమ కీర్తిని దిశలెల్లను వ్యాపింపజేసారు. ఈ సోదరులిద్దరు పలికిన మాటే గోల్కొండ అంతటా చెల్లుతుంది. వీరి మాటకు కట్టుబడియే తానీషా ప్రభువు ఆజ్ఞలను జారీ చేస్తారు. వీరు తెలుగు వాళ్ళకు, ముస్లింలకు కలిపి అందరికీ అనుకూలమైన శాసనాలను వేయించారు. దీనితో వీరి యొక్క మానవత్వం తెలుస్తుంది. అబుల్‌హసన్ కాలంలో అంతఃపురంలోని రహస్యాలు మొదలుకొని రాజ్యంలో ఎక్కడైనా వీరిద్దరూ కలుగజేసుకోని అంశమంటూ ఏదీలేదు అనటంలో సందేహం లేదు.

**తెలుఁగులు తరుష్కులొకటై**
**యలరారఁగ వారివారి కను వగు స్థాయిన్**

నిలిపిరి ధర్మమ్ముల నిఁక
సలిపిరి శాసనములు జనసంతతి మెచ్చన్.

గోల్కొండ. పుట - 55

ఈ విధంగా గోల్కొండ సామ్రాజ్యమును వేనోళ్ళ కొనియాడినట్లు తీర్చిదిద్ది, రాజ్యవైభవంను పొంది, తెలుగుతనమ్మును చూపించి గోల్కొండ నవాబులకు దగ్గరి వారై రాజ్యాన్ని దుండగుల నుండి కాపాడిన మహాఘనులు, పాండిత్య ప్రకాండులు. అక్కన్న, మాదన్నలు. వీరు గోల్కొండ సామ్రాజ్యంలో ఖజానాలను సిరిసంపదలతో, రాశులతో నింపారు. రాతి పలకలపైన మంచి విగ్రహాలను చెక్కించారు. రాజకీయ శూరత్వాన్ని చూపిన మహామాన్యులు, తెలుగు మంత్రులు అక్కన్న, మాదన్నలు.

**నిలిపించి రిట శాత్రవులగుండె ఝల్లన**
**నాలమ్ము సేయుగుఱ్ఱాలదండు**
**కొలపించి రిట నవ్వు లొలయ ఖజానాలు**
**నిండార దండిపసిండిరాశి**
**మలిపించి రిట ఱాతిపలకలన్ సరిలేని**
**విశ్వమోహనమైన విగ్రహములు**
**ఝులిపించి రిట భుజాబలము బాహాటింప**
**నిశితహేతిచ్ఛటాన్వితబలమ్ము**
**శుద్ధరాజకీయ శూరత్వమును గాక**
**వెనుకముందు జరుగువివిధగతులు**
**సూక్ష్మదృష్టిఁ బఱపి చూపించి రిట మహా**
**మాన్యులార! తెలుగు మంత్రులార!**

గోల్కొండ. పుట - 56

**రామదాసు**

కంచెర్ల గొపన్న తనకు గల రామభక్తిచే రామకీర్తనలు పాడి ఈ ప్రపంచానికి, తెలుగు వారికి రాముని కీర్తిని తెల్పాడు. కబీరు యొక్క

శిష్యత్వాన్ని తీసుకొని, అతని దగ్గర రామమంత్రాన్ని పఠించి రాముని యొక్క కటాక్షాన్ని పొంది రామదాసుగా పేరు పొందాడు.

ముదిరిన భక్తి నీభువనఘున్ ఋలిపంచెదు రామమంత్రపున్
బదములు పాడి నీ తెలుగువారికి చక్కనిరామభద్రున
భ్యుదయముఁ దెల్పి శాశ్వతపుఁభోకద స్థాపనఁ జేసినట్టినీ
కొదవెదుఁగాక రామవిభవోజ్జ్వలదివ్యకటాక్షవీక్షణల్

గోల్కొండ. పుట - 59

గోపన్న తానీషా గారి దివానంలో తాహసీల్దారుగా రావటంతో, అతను అప్పటి వరకు పూజలకు నోచుకోని సీతారామలక్ష్మణ విగ్రహంలు పూజలను పొందుతూ ఆ గోదావరీ నదీ తీరాన, సీతారామలక్ష్మణ పాదధూళి సోకిన నేలమీద రాముని దీపాలు వెలిగించాడు. ఇతను స్వయంగా అక్కన్న, మాదన్నల మేనల్లుడు.

**సిద మెత్తించితి వోయి గోపన! తహశ్శీల్దారుగా నీవు, నీ**
**యడుగుల్వెట్టినతోడనే కలిగె నయ్యా రామపూజావిధుల్**
**కదు భద్రాచలసీమలో మిఱల సాక్షాత్కారముం జెందె నీ**
**గుడిలో రాముని దివ్వటీలు వెలిఁగెన్ గొండంత భాసింపగన్**

గోల్కొండ. పుట - 60

రామదాసు అతని గురువు కబీరు కలిసి రామకీర్తనలు పాడి హిందూ ముస్లింలు ఏకమయినట్లుగా పరమతసహనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. మతం మనిషి జీవితానికి అవసరం లేదని, హిందూ, ముస్లింలలో సోదర భావాన్ని కలిగంచుటకై శ్రమించి మానవత్వమున మతం చేర్చరాదు అని రామదాసు చెప్పెను. ఇక్కడ రామదాసు యొక్క పరమత సహనం కన్పిస్తుంది.

**మతము మనుష్య జీవితపుమార్గములో సహనప్రసూనసం**
**తతి గురిపించి సోదరజనమ్ముల యున్నతికై శ్రమించి ని**
**ష్ఠృత మొనరించి త్యాగమున శీలఘునం బరువెత్తఁజేయుస**
**మ్మతిని; మతమ్ము మానవత మంటను గల్పఁగరాదు సెప్పఁగన్.**

గోల్కొండ. పుట - 62

ఎవరినీ పల్లెత్తి ఏమాట అననివాడు, గొడవలు జరిగిన ప్రదేశాలకు దూరంగా ఉండే నియోగి బ్రాహ్మణుడు, అతిథి సత్కారాలయందు ఆసక్తి లేనివాడు, ఎల్లప్పుడూ రామున్ని కీర్తిస్తూ ఉండేవాడు అయిన కంచెర్లగోపన్న యొక్క కీర్తి భూమి అంతటా వ్యాపించింది. ఇతను 5సం॥ల వయస్సుననే ఎవరూ నేర్చుకోలేని విద్యను నేర్చుకొన్నాడు. 6సం॥లకే బాల రామాయణం చదువుకొని రాముని యందు భక్తిని పెంచుకొన్నాడు.

**ఎంతయొ బుద్ధిశాలివిసుమీ! యయిదేఁడుల ప్రాయమందె; నేఁ**
**డింతకు నేర్వనేరము గుణింతపుటక్కరముల్ తెలుంగులో;**
**వింతగు నీ వపూర్వమగు విద్య గడించుట, మేటి శారదో**
**దంతము నీకెగ్రాహ్యము గదా! యిది జన్మతపఃఫలమ్మునూ.**

**బాలరామాయణము బహుభక్తితోడఁ**
**జదువుకొన్నాఁడ వాఱేండ్లసమయమందు**
**జన్మతో లభించినసరస్వతిని నోట**
**నిలుపుకొన్నావు కంచెర్ల కులవతంస!**

గోల్కొండ. పుట - 63

నిత్యం రామభజనలు చేస్తూ, రామగీతాలాపనలు పాడుతూ, రామపూజలు చేయుటకే మనస్సు నిలిపిన వాడు రామదాసు. రామదాసు కొడుకు గంజి గుంటలో పడి మూర్ఛపోయినప్పుడు రామదాసు భక్తికి మెచ్చిన రాముడు అతన్ని బతకించాడు అంటే రామదాసు భక్తి ఎంత గొప్పదో చెప్పవచ్చు.

దేవాలయ నిర్మాణ కోసం గ్రామగ్రామాలకు తిరుగుతూ ప్రజల వద్ద నుండి విరాళాల్ని సేకరించి రాముని కొరకు ప్రసిద్ధమైన క్షేత్రాన్ని నిర్మించిన వాడు రామదాసు. అందులో సీతారామలక్ష్మణ విగ్రహాలకు బంగారు ఆభరణాలు చేయంచి పెట్టాడు.

నిలిచిన దిచటఁ గోవెల రామసామికి
క[illegible] బంగా[illegible]

మొలిచిన దిచటఁ బ్రముఖగోపురమ్ము త్వ
న్మహనీయ కల్యాణ మంటపమ్ము
పలికిన దిచట దేవళము గర్భాంతర
ప్రాంతాన గోదండపాణివాణి
వెలసిన దిచట మంగళవిగ్రహుండైన
బలరాముని మేలిపూలతేరు
ద్వారబంధములు శుభధ్వజస్తంభము
లుదితవాహనమ్ము లుచితభూష
ణములు సుప్రతిష్ఠితములు గాఁగ నలంకృ
తుల నొనర్చితివి ప్రతుష్టి హృదిని.

గోల్కొండ. పుట - 70

నవాబు గారి ఖజానా సొమ్ముతో రామదాసు దేవాలయాన్ని నిర్మించాడని రామదాసుని శిక్షింప బంధించినప్పుడు రామలక్ష్మణులు వచ్చి ధనాన్ని చెల్లించారు. అంటే రామదాసు ఎంత ధన్యుడో చెప్పవచ్చు.

**కుపితస్వాంతమునన్ నవాబు నిను దాగోపన్న పృచ్ఛించి నీ**
**కుపకార మ్మొనరించినాడుగద! నీవో యాఋలక్షల్ ధన**
**మ్మపుడేఋచ్చిన రామలక్ష్మణుల దివ్యద్దర్శనానందభా**
**గ్య పథమ్మబ్బునె నీకు? ధన్యుడవు శ్రీ కంచెర్ల వంశోత్తమా!**

గోల్కొండ. పుట - 71

## 4. వివేకానంద గానం :

భారతదేశం యొక్క ఔన్నత్యాన్ని దేశదేశాలకు వెళ్ళి ప్రపంచమంతటికీ చాటిచెప్పిన ఆదర్శమూర్తి వివేకానందుడు. ఇతని గురించి కూడ కవిగారు ఒక కథా కావ్యాన్ని రచించారు. ఈ కావ్యంలో కవిగారు శిథిలమైపోవుచున్న భారత జాతిని, దేశ సంస్కృతిని చూసి వివేకానందుడు కంటనీరు పెట్టిన విధానాన్ని ఈ విధంగా చెప్పారు.

"శిథిలమ్మగుచున్న జాతి సంస్కృతిని దలచి
నిండు నిర్వేదమున కంట నీరు గార్చి
యెన్ని కష్టాల పడితి వోయి యతీంద్రి
యెంత కారుణ్య మూర్తి వోయి నరేంద్ర."

వివేకానందుడు తన గురువైన రామకృష్ణుని యొక్క బోధనలతో జ్ఞానాన్ని పొంది, ఆ జ్ఞానాన్ని శిష్యులకు బోధించి, ఆ బోధనలను భారతదేశమున ప్రచారం చేసి యువతను ఉత్తేజపరిచారు. దానిని కవిగారు ఇలా చెప్పారు.

**గురుదేవుండగు వాని దీవెనల వాక్కుల్ నిన్ను వెన్నాడ సు**
**స్థిరమై పోల్చిన నీదుభక్తికిని మాతృశ్రీ మహాశిష్యులన్**
**గురిపింపన్ నవతా మహోత్సుకతో క్షోణిన్ ప్రచారించితో**
**యరుధారమ్మిది సాధుపుంగవ వివేకానంద వాక్రువ్వగన్.**

వివేకానందుడు రామకృష్ణుని యొక్క శిష్యత్వాన్ని పొంది, అతను చెప్పిన సత్యాలను నేర్చుకొని, దిగజారిపోయిన దేశ సంస్కృతిని మళ్ళీ పునరుద్ధరించుటకు ప్రయత్నించి చికాగోలో జరిగిన అంతర్జాతీయ సభలో హిందువుల యొక్క గొప్పతనాన్ని తెల్పి, గొప్ప సందేశాలను పాశ్చాత్య దేశాలకు అందించిన మహా[illegible]ని. ప్రపంచ దేశాలకు మానవత్వాన్ని గురించి చాటిచెప్పి వారికి మార్గదర్శి అయిన క్రాంతదర్శి వివేకానందుడు.

**"రామకృష్ణుని సుధారమ్య వాగ్ఝరిలోన**
**తెలివార సతము గాహనము జేసి**
**దిగజారిపోయిన దేశ సంస్కృతిని స**
**ముద్ధరింపగ యోగి యుద్యమించి**
**సర్వదేశ మతాల సభలోన హైందవ**
**జాతి వైశిష్ట్యంబు జాడ తెల్పి**
**ముష్మ దౌర్జల్య నవోన్మేష సందేశ**
**ములను పాశ్చాత్య భూములకు పంచి**

విశ్వవిజ్ఞాన వేదాంత వీథులందు
అమలినంబైన ధర్మ శాతంగ మెక్కి
జగతిలో మానవత్వమ్ము జాటినట్టి
క్రాంతిదర్శినిగా నరేంద్ర జోహోర్లు."

## 5. తరంగమాల

జ్ఞానానందకవిగారు 1947వ సంవత్సరంలో తరంగమాల అనే కావ్యాన్ని రచించారు. రెండవ ముద్రణ 1997వ సంవత్సరంలో జరిగింది.

'నీ తరంగమాలలో నేనొక తరంగమునై తుది వరకు బయినించితిని" అని కవిచక్రవర్తి జాషువాకవి మాటలను ఇక్కడ పొందుపరుస్తున్నాను. ఈ కావ్యం స్వర్గీయ శ్రీ చాపల సమాయేలుగారికి అంకితమియ్యబడింది. ఈ కావ్యంలో 22 శీర్షికలతో కవితలున్నాయి. క్రీస్తు ప్రభువు అనే శీర్షికతో ప్రారంభించబడిన ఈ కావ్యంలో 'కాంక్ష' అనే శీర్షికతో కావ్యం ముగుస్తుంది. 'బోధకుడు' అనే కవితలో

**"సంఘహితమును గోరి తాజరుగుచుండు**
**కలిమి లేముల నొక కంట గాంచుచుండు**
**తనకు గల్గిన వానితో దనివి నొందు**
**భూరి గుణ యుక్తుడయిన సద్బోధకుండు"**

తరంగమాల - పుట - 30

**"ఇచ్చకములాడదెన్నడు నేరితోడ**
**కల్లలాడదు పరి యాచకముననైన**
**భోగములు మానినట్టి బైరాగి యితడు**
**బుద్ధిగలవాడు దేవున బోధకుండు"**

తరంగమాల - పుట - 32

## 6. క్రీస్తు ప్రబంధం :

**"కుటిల భావమ్ము జూపడు కోపపడదు**
**అతని దరిజేరు వారల నాదరించు**
**సర్వ కాలములందును శాంతితోడ**
**మూర్తిమంతుండు దాంతుండు బోధకుండు**

క్రీస్తుప్రబంధం : 2005

జ్ఞానానంద కవి గారు క్రీస్తు 'ప్రబంధం తొలిభాగం 25 - 12 - 1963 లో ప్రారంభించి మలిభాగం 25 - 12 -1995 నాటికి ముగించారు.

క్రీస్తు ప్రబంధంలో 77 శీర్షికలతో క్రీస్తు చరిత్రను వర్ణించారు జ్ఞానానందకవి. ప్రభువు పుట్టడం, యోహాను జన్మవృత్తాంతం, జనసంఖ్య, జ్ఞానుల రాక, దేవాలయంలో క్రీస్తు బాప్తిస్మమిచ్చు యోహాను. నినోదేము, సమరయి స్త్రీ ఆశీర్వాద ఆరోహణం వరకు ఇందులో వర్ణింపబడ్డాయి. క్రీస్తు యొక్క మంగళ మూర్తిని స్మరిస్తూ సాగిన ఈ ప్రబంధంలో ఎంతో సరళమైన పదాలతో పద్యాలను రాసారు జ్ఞానానందకవి. క్రీస్తు మహిమలను, క్రీస్తు చేసిన ఉపన్యాసాల చిత్రీకరణ అద్భుతగా ఉంది.

**గిరిపైని ప్రసంగంలో,**
**విశ్వవసుధయందు ద్వేషాన్ని కీలలు**
**ప్రబల దివ్య మానవత హరింప**
**సహన వనధులేచు శాంతిని స్థాపింప**
**బూను వారు దైవపుత్ర వరులు.**

క్రీస్తు ప్రబంధం. పుట - 118

**లోని భావమునకు పైని భావమునకు**
**నంతరాలు కలుగునవనియందు**
**చిత్త శుద్ధితోడ జీవించు వారికి**
**దొరకు భువన భర్త దరిసెనమ్ము**

క్రీస్తు ప్రబంధం. పుట - 117

జ్ఞానానంద కవి కావ్యాల్లో భక్తితో పాటు చిక్కని సందేశం కూడ స్తుంది.

# 3

# జ్ఞానానందకవి ఖండ కావ్యాలు

## సామాజిక వివేచన

జ్ఞానానంద కవిగారు రచించిన ఖండ కావ్యాలను పరిశీలిస్తే ఎన్నో అంశాలు వెలుగు చూస్తాయి. రాజధాని ఖండ కావ్యంలో కవి తన హృదయంలోని మాటలను పొందుపర్చారు.

నేడు నాగరికత పేరుతో అక్కరకురాని వెట్టి వెట్టి వికృత చేష్టలు బాహాటముగా చిందులు త్రొక్కుచుండుట నాగరికతా లోకానికి విదితమే. ఇది యొక సంస్కృతి. మరియిది యొక నాగరికత. ఏది సంస్కృతి? మరేది నాగరికత? అనేది తేల్చుకోలేని దీనస్థితిలో ప్రజాజీవనం సాగిపోతుంది. ప్రజలకు జీవితం గడిచిపోతే చాలు. అందులో ఆనందమున్నదో, అది వారి అతిసమీపములో ఉన్నదో మరి దేనిని వీరు కోరరు. బ్రతుకనగా కూడు, గుడ్డ, గూడు అక్కరలేదు. వీరల్పసంఖ్యాకవర్గం. ఇక్కడ అల్పసంఖ్యాక వర్గమంటే కులం, మతం, రాజకీయాలకు సంబంధించిన విషయం కాదు. ఏదియు నిర్వచనీయానందము చేకూర్పగలదో, ఏది మానవజాతి మేధాకాశంలో ఉజ్జ్వల చైతన్యస్ఫూర్తి విజ్ఞానవికాసదీధి తులమెఱయింపగలదో, ఏది దానవత్వం నుండి దైవత్వమునకు దారి చూపింపగలదో, అసమానత్వం నుండి సమానత్వం వైపు నడిపించి విలువలను పెంచి మానవాళిని కాంతిపథంలో నడిపించునో దాని వైపు మరలిన వారు దాని యంద

భిమానపద ప్రాణి జీవన దర్శమని నమ్ముదురో, ఉజ్వల కవితా మార్గం నెన్నుకొందురో వీరల్పసంఖ్యాక వర్గమే మరి వీరందరు వాల్మీకిని స్తుతించేవారు నన్నయ్యను పూజించేవారు. ఛందోపార్శ్వమున కంజలించేవారు. ఇది అంతయు నెందుకు చెప్పవలసి వచ్చినది అంటే సమాజ స్పృహ పేరుతో ప్రతి ఉపన్యాసకుడు, రచయిత, కవి మాటమాటికి ఉచ్చరించుచున్న శబ్దము లేక నినాదం. అన్నియుగాలలోను, అన్ని సమాజాలలోను నినదించుచున్న శబ్దమేయది. ఆనాటియుగ భావ కల్పనయది. కాలంలోన పరణామ దశలో వివిధముల్తైన స్పందనలు, భావనలు, కల్పనలు, ఆలోచనలు కూడ మారుచుండుట సహజం. నేడు కవితా శారద నేడెన్నియో భంగిమలు రూపు దిద్దుకొనుచున్నది. ఆలంకారికులు అనుమతించిన లక్షణములెవరికి కావలయును శబ్దగత, అర్థగత మాధుర్యముల పని ఏమి. ఎవరికి తోచిన ప్రక్రియా స్వరూపంలో శబ్ద సారస్యం త్యజించి, యేవేవోనినాదములు బయలుదేరినవి. ఇదియే కవితా మార్గమని దీని నుల్లఘించిన రచన రచన కాదనేవారికి, కొక నమస్కారం. జ్ఞానానందకవి గారు కవిత్వాన్ని గురించి చెప్తూ కవిత్వం నిస్సీయమైంది, నిర్బంధరహితమైంది, హ్లాదైకమయిమైంది, నవరస రుచిరమైంది అంటారు. కవిత్వాన్ని గురించి జర్మను కవి. గెటే అభిప్రాయాన్ని గమనిద్దాం.

"Each age has sung beauty. he who perceives it is from him self set free"

విశ్వనాథ వారన్నట్లు

**"కవిప్రతిభలో నుండును కావ్యగతశ**
**తాంశముల యందు తొంబది యైనపాళ్ళ**
**ప్రాగ్విపశ్చిన్మతంబున రసము, వేయి**
**రెట్లు గొప్పది నవకథాధృతినిమించి"**

కథ చెప్పుటకంటే రసములోనే కవి ప్రతిభ ఉంది. విశ్వధర్మమును సాక్షాత్కరింపజేయగల వారు ఋషులు. కవులు ఋషులతో సమానులు. అట్టి

వారే కావ్యములను రాయగలరు. ఆ కావ్యాలలో విశ్వ మానవ కల్యాణంహిత ప్రబోధం, ఆనందం, రమణీయర్థం ప్రతిపాదింప బడవలయును. కేవలం నాలుగక్షరాలతో నినాదములు చేయునవి గాకూడదు. కవి సామాన్యుడు కాదని భావశక్తి, దర్శకశక్తి కల్పనా సామర్థ్యం వాఙ్నిపుణత కవి కవసరము అప్పుడే -

May pen works Miracles అను

Mir Ali వాక్యములు

Literature is a reflection of life,

Literature is the manifestation of human emotions.

Literature it reflects the Society in the best and most honest way.

The poet is concerned with his environment his people his situation and the events that take place around him. - Robert Frost

పైవన్ని కవిత్వ నిర్వచనాలు/కవుల అభిప్రాయాలు.

జ్ఞానానందకవి గారు తన ఖండ కావ్యాలను, కథా కావ్యాలను ప్రముఖులైన పండితులకు రాజకీయ నాయకులకు, స్నేహితులకు అంకితం ఇవ్వడం ఒక విశేషంగా గమనించాలి. బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, సి.నారాయణ రెడ్డి, అమూల్యశ్రీ, దేవులపల్లి రామానుజరావు మొదలైనవారు.

వీరి ఖండకావ్యాలలో కవులతో పాటు కళాకారుల ప్రసస్తి అఖండ భారతాన్ని తెలుగు తల్లిని పేద వారిని గురించి, మన సంస్కృతికి చిహ్నాలయిన మన పండుగలను గురించి మన భారతీయుల జాతీయత భావాన్ని, భావి తరానికి చెందిన యువకులకు ఆయన ఇచ్చిన సందేశాలు కనిపిస్తాయి.

తనపూర్వ కవులను తన కావ్యాల్లో స్మరించుకోవడంతో పాటు వీరు రాసిన కావ్యాల్లోని గుణసౌందర్యాలను ప్రశంసించడం సమకాలిన కవులకు ఒక సంప్రదాయం. ఆ సాహిత్య సంప్రదాయానికి చెందిన జ్ఞానానందకవిగారు

తన పూర్వ కవులయిన నన్నయ, నాచన సోమన, శ్రీనాథుడు, నార్ల వంటి కవులపై చక్కని పద్యాలు రాసి రాజధాని కావ్యంలో పొందుపర్చారు.

"తెలుగు మాగాణి భూములదొల్త తిరుగాడు
దేశీయ కవితకు తెరువుసూపి
కుండ వాంచాదేవి కొడుకు గీచినయట్టి
విజ్ఞతాయుతపుటనుజ్ఞ దాల్చి
శిరమెత్తి యింత యూపిరి పీల్చుకొన్న వై
దిక తత్త్వమునకు పథకమువైచి
సకలభాషా కళాజలరాశి ఘనుదునా
రాయిభట్టు సాయమ్మునంది
తొలి మహాంధ్రకవిగ నిలిచి మానేలలో
రమ్యమైన యక్షరాల విత్త
నాలు సల్లి యదొకశైలి నీదిగ నిల్పి
నట్టి శబ్ద శాసనా। జోహారు

– రాజధాని – పుట పేజి

శ్రీచాళుక్యధ రాధి నాధ। సదసీశ్రీకారరమ్యాకృతీ
ప్రాచుర్య ప్రతిభా కళా విభవశబ్ద బ్రహ్మ। విద్యాకృతీ.
ధీ చాతుర్య సమాసకల్పనలసద్ది వ్యాత్మ! వాచాస్పతీ
శ్రీచాంద్రీని భృత ప్రకాశ కవితా సిద్ధాన్వయా! నన్నయా!

విజయాభిషేకము – 28

**నాచన సోమన :**

"గుండెకు తాకు తెల్గు పలుకుల్ తన కబ్బములోన నిల్పను
ద్దండత లేవి నిష్టమెయి దాయుల గుండెలు దద్దరిల్లు – స్తో
చ్ఛందమసైక యజ్ఞమును సల్పెను. తిక్కన నీవుపిమ్మటన్

రెండవ తిక్కనార్యువలె నిల్చితివోయి రసైక భూషణా"
గుండెను తాకేటట్లుగా తెలుగు పల్కులతో"

పుట - 7

కావ్యాలను వెలయించును. కవిత్వంలో తిక్కన తరువాత నీవే నిల్చిపోయావు.

**శ్రీనాథుడు :**

అనిన తోడనె తెలుంగాధీశుడంపినా
జగజంపు నిగరాల మృగమదమ్ము
వినిన తోడనే నీకు వీరభద్రారెడ్డి
ప్రణమిల్లి యిడెనే విద్వాంసుపదవి
కనగనే యతిధ్యమునిడెనె విస్సన్న
భక్తిమీఱగ హేమ మాత్రయందు
వినయాన మైలారవిభుడు తీర్చెనెదిన
వెచ్చమ్ము బ్రతుకింత వెళ్ళబుచ్చ
భళిర పాకనాటి వాడ। నీభాగ్యమ్ము
తలపనేడు గుండె జలదరించు
స్వారి సేసెనాడు శారదాదేయాం
ధ్రమ్ము పొంగ కవనరధము నెక్కి.

- పుట - 17

**నార్ల :**

సమతనేర్వని పురాణములను గర్హించి
హేతు వాదమునకు చేతులెత్తి
ఛాందసంబైన భాషావైఖరినినెట్టి
శిష్ట జీవద్భాష కిష్టపడుచు
జనవాణి కద్దమౌ సంపాదకీయాల

హుందా తనానకు విందుసేసి
ప్రగతి నిరోధించు పనికి మాలిన యుక్తి
వ్యర్థ ఘట్టాలను ప్రతిఘటించి
నీవు రచనలందు నీదైన శైలిని
నిలిపి తెలుగు మేలిపలుకుబడుల
గుస్తరించి వన్నెగూర్చితి సంపాద
కులకు గౌరవమ్ము గూర్చి నావు

– పుట – 60

**పండుగలు :**

సంక్రాంతిని గురించి జ్ఞానానంద కవి.
క్రమమున్ తప్పని నీదు రాకడకు సంక్రాంతీ మనుష్యాళికిన్
క్రమతన్నేర్పుత మీది నానగల సింగారమ్ము బంగారమై
ప్రమదంబిచ్చుత తెల్గుజాతికి నవౌజ్జ్వల్యంపుభగ్యలుని
త్యము చిందాడుత సంకురాతిరి త్వదీయంబైన వేళంబడిన్

పై పద్యంలో క్రమము తప్పక వచ్చే నీరాక మాజాతిని, ఒక నూతనమైన భాగ్యాలు అందాలని కవి ఆశిస్తారు.

నాతెల్గు బాల యందముగ పెట్టిన ముగ్గు
నా సంస్కృతికి ప్రధాన ప్రతీక
నాతెల్గు బాలుండు ప్రీతియై ధరియించు
వస్త్రము నాజూకు పథము తెలుపు
నా తెల్గు జంగమన్న కపర్థి వేషమ్ము
తెలుగు వారికి భక్తి దీపరేణ
నాదాస రయ్య కంఠాన మ్రోగిన వాణి
నా జాన గీతికి నవ్యసూచి

నా తెలుంగు జాతి నడచు మార్గము విశ్వ

ధాత్రి కెల్ల మార్గదర్శకమ్ము
నీకు స్వాగతమ్ము నీరాజనమ్ము సం
క్రాంతి చిమ్మవలె వరాలకాంతి.

దీపావళి :

పరమ ఘాతకుండు నరకాసురుడు చావ
వెలిగె నింట దీపముల వ్రజమ్ము
నాటి దీప్త రాశి నగవుల చిందించి
తెనుగు పుడమి నేలు కొనునుగాక

పుట - 69

**రాజధాని :**

రాజధాని కావ్యంలో రాముడు, అల్లా ఇరువురి ఆత్మీయత చల్లిన నేలలో, నిలబడ్డ నగరంలో కల్లోలాలు లేని సమత నగరంగా రాజధాని ఉండాలని కవి ఆశిస్తున్నారు.

**అల్లాయున్ రఘు రామచంద్రులును నాప్యాయమ్ముతో స్నేహపున్**
**జల్లుల్ చల్లిన నేలలో నిరూపమానంబైన యైక్యమ్మురం**
**జిల్లన్ నిల్పుము వారసత్వమునునట్లే రాజధానీ! క్రుధా**
**కల్లోలమ్ముల మాన్పి సర్వసమతాక్రుధా కల్యాణసంధాయినీ**
**అభ్యుదయము కొఱకు నారాట పడుచున్న**
**నవ్య దీక్షకులగు నందనులకు**
**తిరుగులేదు నేడు తెలుగు దేశమ్ములో**
**రమ్యతా త్రివేణి! రాజధాని ! అంటారు.**

## జ్ఞానానందకవి - కవిత్వ తత్వం

కవి తన గురించి, తనకు ఏమి కావాలని కోరుకుంటున్నారో ఓ పద్యంలో చెప్పారు.

"కాలికి గండ పెండెరము గట్టిన నీ సముఖాన నేనుభూ
పాలకి యున్న గగ్గెరను పాదము నందొడగంగ నాసరా
జాలదు కాని నాకు నెదజక్కని కైతవసంత కాలవృ
క్షాల వసించు కోయిలల గానము దీయగ నాసగల్గెడిన్.

52 పుట - విశ్వనాథ పీఠికలు.

చాలా మంది కవులు తమ కాలికి, గండపెండిరము కావలెనంటారు. ఈ కవి అక్కరలేదనుచున్నాడు. వసంతకోకిలల వలె, తాను పాడుకొనుటే తన జీవిత పరమార్ధంగా భావిస్తున్నారు జ్ఞానానందకవి. నిజమైన కవి యొక్క లక్షణమదేకదా ! ఈ కవి కాలికి గండపెండేరం తొడిగి, సత్కరించుకొంది ఈ సాహిత్యలోకం.

చిన్ననాటి నుండే కవితలల్లిన కవి, జ్ఞానానందకవి, ఈ కవితా సంస్కారం జన్మ జన్మలదని వారి నమ్మకం. తాను కవి అగుటచే తన జన్మ ధన్యమైందని జ్ఞానానందకవి భావిస్తారు.

"నన్ను వరించి వచ్చెనొక నాటిద యీ కవితా లతాఁమ పే
ర్గన్న కళా విభాసిని, జరామరణంబులు లేని వాణ్ణి ఖొ
మ్మన్నను పోని కన్యక. నితాంత యశః కవితాభి రామ సం
పన్న తెనుంగు శారద శుభంబిక జన్మము ధన్యమయ్యెడిన్ !!"

56 పుట - విశ్వనాథ పీఠికలు.

తన పద్య నడవడికను గురించి ఆహ్వానంలో .....
"నాశైలీ విన్యాసము
పేశల సుమ సమము. మధురపీయూషము ధా
రాశుద్ధిని బద్ధమునా
లేశ నిభృతము మునుపటి కవీశుల విధముల్" అంటారు.

47 పుట - ఆహ్వానం

నా రచనా విధాన కవనాన విధాన మనోజ్ఞ బంధుర
శ్రీ రమణీయ శబ్ద రుచిరేఖ సమగ్రపరిస్ఫుట ధ్వని
ప్రేరణ కారణమ్ము రస విస్ఫురితైక మరాద బిందుసం
భారము దీప్తియై మోయు వాణి ననున్ వరియించి వచ్చెడిన్.

47 పుట - ఆహ్వానం

తన కవిత్వం ద్వారా ప్రజలకు సందేశాన్ని ఇస్తున్నారు. ముఖ్యంగా'చదువు' వల్ల కలిగే ప్రయోజనాన్ని చెప్తున్నారు. ముఖ్యంగా చదువుకోకుండా పనులు చేసుకుంటూ బాల్యాన్ని, యౌవనాన్ని పాడుచేసుకుంటున్న పేదవారితో పాటు ప్రతివ్యక్తి చదువుకోవాలని కవి కాంక్షిస్తున్నారు.

'అక్షరకళాజ్యోతి' కవితలో
అక్షరాలే నేర్చిన అబ్రహామ్‌లింకను
దమెరికాభూమి కధ్యక్షుడయ్యె
కష్టించి చదివి బ్రుకర్‌టి వాషింగ్టను
ప్రజ్ఞాధురీణుడై పరిఢవిల్లె.
ఎనలేని కృషి సల్పి ఘనతగాంచిన డాక్ట
రంబేద్కరు జగాన యశముపొందె
అవసరంబనుచు కాలువ దాటి చదివిన
లాల్‌బహదూర్ లోకప్రణతులందె
అక్షరామృతమూలాన అవనిలోన
విజ్ఞతా విజ్ఞతాబుద్ధి విశదమగును
అక్షరజ్ఞానమేలేని యిట్టినరుడు
తనకుతానే శత్రువునిగా తలచుకొనును.
క్షరముగానట్టిదైన యక్షరము విశ్వ
భారత వసుంధరకు దివ్యభాగ్యరేఖ

అక్షర కళా మహెూద్యమ దీక్షకొఱకు
ఈదినాన వ్రాసితి మీకు నాదులేఖ

- ఆహ్వానం - పుట - 60

స్వాతంత్ర్యం కోసం భారతీయులందరు ఒకే తాటి మీద నిలబడి జాతీయతా భావంతో అడుగులు వేసారు. స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ మరణం చాలా మంది కవులను కలచివేసింది. అదేవిధంగా జ్ఞానానందకవి మరణించిన మన నాయకులను, తన ఖండ కావ్యం ఆహ్వానంలో స్మరించుకున్నారు. ముఖ్యంగా గాంధీ పై కావ్యం రాసిన జ్ఞానానందకవి -

**గాంధి : కవితలో**

వెతలంబొంది బ్రిటీషు పాలకులచే వేసారి నైరాశ్యపున్
జాతిలో మ్రగ్గెడు వీర భారతము నీచెల్వారు విందైన ధీ
కృత కార్యోద్యమ సాధన ప్రగతిచే ప్రీతిన్ స్వతంత్రమ్ము భా
రత జాతీయుల కెల్ల వచ్చెను యశోరమ్యుండ గాంధీమునీ

-విజయాభిషేకము - పుట - 33

**నెహ్రూ : కవిత**

బ్రతుకుటెడారిలో కుమిలి మ్రగ్గుచు స్వేచ్ఛయెకింతలేని భా
రతమున కుజ్జ్వలంబయిన రత్నపుదీపముగా వెలిగించి శా
శ్వతముగ కన్ను మూసిన ప్రపంచ హితైషి మనీషి మృత్యుదే
వత విషగర్భ గహ్వరము వ్రాలెనె? యెంతటి దుర్దినంబహెూ!

- విజయాభిషేకము - పుట - 35

సమతకోసం, మానవతకోసం ఆయన కలం ఎన్నో కవతలను రాసింది.

సమత కవితలో ఒకచోట
పొరుగు వానిబ్రతుకు పెరిగెడుతరుణాన

సంతసింప కేడ్చి సతమతమగు
దుర్విదుగ్ధులున్న యుర్వినాలోకింప
సమత నిలువగలుగు స్థానమేది.
ఉన్నవాడులేమి నున్నవానినిగాంచి
సానుభూతి నింత జరుపువేళ
మానవతకు మరి సమతృసింసిద్ధికి
విలువకలుగు దారికలుగు గాక.

- ఆహ్వానం - పుట - 33

విజయాభిషేకము. 1966

నేడు :

ఒక నరకాసురుండు మృతినొందెను. మున్నెపుడో పఠించి దా
నికి ముదమందె భారతము నేడి కనిర్పురుదాపఠించినా
రకట అయిబుభానుడొక డౌను మఱొక్కడు చౌన్లై వీరు త
ప్పక నశియింత్రు నాత్వికపు భరతమాత మహోగ్రశక్తికిన్

జ్ఞానానందకవిగారు ప్రపంచ శ్రేయస్సే పరమధ్యేయంగా భావించి కవితలు రాశారు. శ్రామికుల మనోభావాలను చిత్రించే పద్యాలు 'విజయాభిషేకం'లో ఉన్నాయి. ఉదాహరణకు -

ఒకనాడు శాత్రవ నికర గర్భముఁ జీల్చి
తీంద్రించె దెసలు మా తెనుగు కత్తి
ఒకనాడు దివ్యరాల్చు కవాటముల విప్పి
తేనె లొల్కించె మా తెనుగు వాణి
ఒకనాడు పెరభూములకు సోయగము దిద్ది
ఘనత గాంచినది మా తెనుగు లక్ష్మి
ఒకనాడు ప్రకట శౌర్య కథోజ్జ్వలతజాటి
ప్రణొతులందినది మా తెనుగు శక్తి

ఒకనాడు ర్వి సత్కాళాభ్యుల్వదయమంద
నాణెమగు వేద మధుర భాండములనించి
గొనబు దేశాల బంచిన తెలుగు తల్లి
కారతుల నీయరండు రండాంధ్రులార!

(ఆంధ్ర ప్రశస్తి - పుట 3)

కార్మిక కర్షకులు దేశానికి వెన్నెముక. వారు లేన దేశం లేదు. వారు పడే బాధలు చూచి కవి ద్రవించి కరుణరసం ఉప్పొంగి కార్మికుని ఓదారుస్తూ, ఈ పద్యాన్ని చెప్పారు.

వచ్చు నొకనాడు నీ మందభాగ్యమైన
దీన జీవిత చర్య గుర్తించు దినము
పొరుగు దమ్ములు నయనాల దెలిచినార
ఊరడిలుమ శ్రామిక సహోదరుండ! కార్మికా!

ప్రభంజనం - పుట - 10

ఎక్కడ చూసిన ధర్మము తప్పిన సమాజంలో డబ్బుకి ప్రాధాన్యం పెరగడం వల్ల సత్కళలకు ప్రాధాన్యత కరువైపోతుందని జ్ఞానానందకవి

ఎటుచూడన్ ధనమే ప్రధానమయిపోయెన్ ధర్మ మార్గానికి
చ్చట తావింతయు లేదు సత్కళల కాసారమ్ము శూన్య మి
చ్చట కైనన్పరికింపబోవమిట సౌజన్యము దౌర్జన్య మి
చ్చట తైతక్కలొనర్చు భూప్రళయపర్జన్యము రప్పింతు వా!

అక్షరాక్షతలు కావ్యంలో దేశభక్తిని ప్రబోధించే పద్యాలున్నాయి.

ఉదాహరణకు -

పరులంబ్రోచెడు ధర్మ బుద్ధికిని యావల్లోకమానంద సా
గర డోలాళుల నూగి పోయినది నిక్కంబిద్ది నీదేశ స
చ్చరితల్ జాటు పురాతన ప్రతిభ యీ స్వాతంత్ర్య వేళాపుర
స్సర భాగమ్ముల దిద్దుకోవలయు విశ్వంబందు హిందూసుతా!

పిల్లనగ్రోవి కావ్యంలో కవిత్వం సరళంగా ఉండి భావస్ఫూర్తిని పాఠకులలో కలిగిస్తుంది. మద్యపాన నిషేధాన్ని గూర్చిన సందేశం, ప్రబోధం మొదలైనవి ఇందులో కనిపిస్తాయి.

**"జ్వలిత పరాక్రమ స్ఫురిత జాగృతితో తెలవాని దౌష్ట్యపున్**
**కలుషము పాఱద్రోలిన యఖండులునీసుతులెన్నగన్ దిశాం**
**చలముల వ్రాయబడ్డ లిలసచ్చరితమ్ము గలట్టి తల్లి! నీ**
**వెలుగల్ యీ స్వతంత్ర పృథివీభువ నానకుజీవ ధాతువుల్.**

జ్ఞానానందకవి విశాలాంధ్ర ఉద్యమంలో పాల్గొని ఊరూరు తిరిగి ప్రజల్ని చైతన్య వంతులుగా చేయడానికి ఎంతో కృషి చేశారు. తాను మెలిగిన సమాజం నుంచి గ్రహించిన ఎన్నో అంశాలను, అర్థం చేసుకుని ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దటానికి చేసిన కృషిలో భాగమే వీరి రచనలు. సామాజిక పీడనకు గురి అయిన వాడికి సంఘంలోని కుళ్ళంతా దుర్భరంగా కనిపిస్తుంది. తీవ్ర అవేదన కలిగిన వాడు మాత్రమే ఈ సమాజంలోని దురాచారాలన్నింటిని స్పష్టంగా దర్శించగలడు. కవిత్వంలో వాటిని పొందుపర్చగలడు. పద్యాలలో అభ్యుదయ కవిత్వం రాసిన కొద్ది మందిలో జ్ఞానానందకవి ఒకరు. సమాజ పురోగమనాన్ని అడ్డుకొనే పిడివాదాలలో

కర్మవాదం ప్రధానమైంది. మచ్చుకు

**"కర్మము పేరు చెప్పి నరకమ్మును సృష్టి యొనర్చి వర్ణపుం**
**ధర్మములన్న పేరున నధర్మపుటుద్ధతి కాండబెంచియే**
**మర్మము లేన మానవుల మధ్యనుగోడల పెట్టి నేటికిన్**
**కర్మను రుద్దు మానవులు గల్గిన దేశము నీది బాలికా.**

జ్ఞానానందకవి జీవితం - వాఙ్మయం - పుట 29

**అస్పృశ్యత:**

నాటి నుంచి నేటి దాకా అస్పృశ్య జాడ్యంగా ప్రబలిపోయింది. దీన్ని నిరసిస్తూ కవులందరూ తమ కవితల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని రగిలించారు.

అట్టివారిలో జ్ఞానానందకవి ఒకరు. ఒకనాటి నుంచి తాను అనుభవించిన కష్టాలు సమాజాన్ని చూసి పొందిన అవేదనను వెలుగుబాట కావ్యంలో అస్పృశ్యతా నివారణము అనే ఖండికలో వర్ణిస్తున్నారు.

ఈ యస్పృశ్యత మున్ను వేదముల యందే కాని వేఱొండుగా
నీ యెందైనను లేదు మానవుడు దీనిన్ స్వార్థ చింతాత్ముడై
చేయంజాలెను నేటి మానవుడు ఛీఛీ యంచు పోద్రోల నీ
హేయంబై నటువంటి భావమును పోయెన్ దీరమర్యాళికిన్

అస్పృశ్యతను అంతం చేయమని కవి ప్రబోధిస్తారు.

వర్గద్వేషముతో కులాల్ గరిమతో వక్రంపు భాష్యాలతో
భర్గున్ స్సైతము లెక్కసేయని బడాభాయిల్ దగాకోరులన్
దుర్గర్వాంధులు గూడు కట్టుకొని యేదో ద్రోహముంజేయగా
మెర్గుల్ గల్గిన దేశమేమి యగు? స్వామి ద్రోహమున్ మానుమా!

వర్ణము స్వర్ణమై కొలత బద్దకు నందక నింగి కెక్కి యే
దుర్ణయముం బొనర్చినదొ ధూర్తత నీకు వచింపనేల మీ
నిర్ణయముల్ నిరంకుశము నీతికి ఖ్యాతికి తావులేని యీ
జీర్ణపు టూహశాలుర కసిన్ గబళింపు ముగాదినాయకా!

అస్పృశ్యతను గూర్చి భగవంతునికి నివేదిస్తూ ఈ కవి.

ఇతడస్పృశ్యుడటంచు జెప్పితి గదా! యిందాక భావమ్ము చ
ర్వితమున్ జర్వణమైన నిందుతఖరాలేదన్న తత్సంస్థకున్
బతి యెవ్వండు? నిజాన కీ విషయమున్ బ్రస్తావనన్ (జేయుచో
ధృతికిన్ దూరుడగున్ యదార్థముగ దండ్రీ! న్యాయమిప్పింపుమీ!

– పుట 31

కులంలేనిదే మనిషికి గుర్తింపు లేదని అటువంటి వాడు పడే వేదన ఏ విధంగా ఉంటుందో తాను అనుభవించానని, అందువల్ల కులం అపాదించే హెచ్చు తగ్గుల్ని ప్రస్తావిస్తూ

మెతుకుల్లేవుకులమ్ము లేని యెడ సుమ్మీ తండ్రి! యీ సైంధవ
క్షితిలో అంకెలు వేయుచున్నవి పరీక్షింపంగ బాహాటమై
మత విద్వేషపు భావనావృషభముల్ మామూలులెచ్చయ్యేమా
కత లెన్నో గలవయ్య నీ వెరుగవే కారుణ్యా వారాన్నిధీ... అన్నారు.

దేవుని పేర జరుగుతున్న దోపిడీని, రాతిబొమ్మల్ని పూజిస్తూ మానవుల్ని ద్వేషించే దురాచారాల్ని అతిస్పష్టంగా ఖండిస్తూ...

'ఇచట రాతిచేత సృష్టింపబడినట్టి
బొమ్మలకు పసిండి భోజనమ్ము
మనుజుగా జనించి మనలేక యాచింప
గంజి నిదరు బిచ్చగాండ్రకెపుడు (33 పుట)

సమాజంలో నున్న రాజకీయ నాయకుల కుట్రలు
కార్పణ్యాలకు విసిగి ఆవేదనతో పర్జన్యంలో
ఖద్దరు బట్టగట్టిముని గాంధికి శిష్యునిగా దలచి యీ
దద్దమ దేశభక్తునిగ తాను జనించుచునుండ స్వార్థపున్
ముద్ధగు వీడు చేసినది మోసమె తప్ప మరేది లేదు నే
డద్దిర! దేశభక్తి యననయ్య యొ! మోసమొ వేసమో ప్రభూ
(23 పుట)

విశాలాంధ్ర ఉద్యమంలో దాశరథి, సురవరం ప్రతాపరెడ్డి, కోదాడ నారాయణరావు ప్రభృతులతో కలసి, తిరిగిన వారు కవి పద్యాలతో తెలుగు జాతిని ఉత్తేజ పరిచారు

ఈ నా తెలంగాణ బృహదాంధ్ర భూమికిన్
మకుటాయమానమై మసలువాడు
ఈ నా మహా గౌతమీనదీ తోయమ్ము
చవిటి పట్టుకు యాత్ర సలుపునాడు
ఈ నా ప్రశుభవాణి యెనలేని గౌరవా

దరణ కిరీటమ్ము దాల్చునాడు
ఈ నా తెలుగు జాతితో నైకమత్యమ్ము
కలుపుగోలు తనమ్ము వెలయునాడు
తొల్లి కాకతీయ వల్లభుల్ చాళుక్య
నృపులు విజయనగర పృథివి పతులు
మఱియు రెడ్డిదొరల పరిపాలన సౌఖ్య
మలర వలయు నేడు తెలుగుతల్లి.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా సమాజంలో స్త్రీకి రక్షణ లేదని, సమాజాన్ని పట్టి పీడిస్తున్న కులమతాల కుమ్ములాటలో తన కవిత్వం గుర్తింపబడినప్పటికీ ఆర్థికంగా తన స్థితి మెరుగుపడలేదని ఆవేదనను వ్యక్త పరుస్తూ చెప్పిన పద్యంను గమనిస్తే కవిగారి భావం వ్యక్తమవుతుంది.

బిడియ ఖింతయు లేక పడతి నిర్భయముగా
గౌరవమ్ముగ నిల్లు సేరునాడు
యుగయుగాల కులాల యూబిలో దిగబడ్డ
పంచమీయుడు పైకి వచ్చునాడు
సరసజ్ఞుడగువాడు సాహితీ మర్మమ్ము
గుఱుతించి మేలిమి నెరపునాడు
విద్యుక్త ధర్మమ్ము వివరించునుద్యోగి
ఋజుమార్గమున ప్రవర్తించునాడు
చీడపురుగులయిన చెక్కభజన పరు
లర్థమున్న వారి యంఘ్రి పూజ
మానునాడు దేశ మర్యాదకొొక స్థాయి
తనరు నిజమదియ స్వతంత్ర వేళ. పుట. 46

బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన జ్ఞానానందకవి స్వయంకృషితో ఎదిగి, ఈ సమాజంలో తన కవిత్వం ద్వారా సమాజానికి అభ్యుదయ దృష్టిని, కవితా పుష్టిని సాహితీలోకానికి అందించిన, జాతీయకవి, పద్మశ్రీ....... జ్ఞానానంద కవి.

## జాతీయత

నేడు సమాజంలో తలెత్తి తిరుగుతున్న వాదాలు, వర్గాలు, వర్ణాలు, మతాలు ఏ మార్గం తప్పుతున్నాయో ప్రతీ భారతీయుడికీ తెలుసు. కానీ నేను ఏ వాదానికీ సంబంధించిన వాడిని కాను, నేను మానవతావాదానికే కట్టుబడిన వాడను అని ఆహ్వానం కావ్యంలో కవిగారు ఇలా అంటారు.

**"నాది భారతమ్ము మీదట నాంధ్రమ్ము**
**నేడు మతము గీతము లేదు నాకు**
**సత్యపథమే నాకు స్వంధామము నాకు**
**అంతరంగ శుద్ధి యాత్మబలము".**

మతాన్ని గురించి ఎవరెన్ని నిర్వచనాలు చెప్పినా జ్ఞానానంద కవిగారు చెప్పిన నిర్వచనం ఎంతో శ్లాఘనీయమైంది. కవిగారు మతాన్ని గురించి ధర్మాగ్రహం కావ్యంలో ఇలా చెప్పారు.

**హితము నెఱపినట్టి మతమన్నది యేల?**
**శాంతినిడని సాధు సంఘమేల?**
**భవ్యమైన మానవతను విభాజించు**
**మతము పూడ్చి పెట్టవలయు గ్రివము.**

అదే విధంగా కవిగారు భారతదేశంలో కులాలతో ప్రజలందరూ సంస్కృతిని వదిలేస్తున్నారు. దీనికి దారి ఏదీ లేదు అని 'ధాత' అనే కవితలో ఈ విధంగా చెప్పారు

**ప్రాథమిక సూత్రమౌ మానవత్వమునకు**
**కులపు కాంస్య బిత్తికలడ్డుకొన్ననాడు**

**మృగ్యమైన సంస్కృతికిచట యేదిదారి**
**యిది కులమ్ముల దేశమోయి యుగాది.**

కవిగారు ఈ సమాజంలో అనేక అంశాలపై పద్యాలు రాసినా ఆయన మాత్రం తృప్తితోనే బతుకుతున్నానని పేర్కొంటూ 'ప్రత్యభినందన' అనే కవితలో ఇలా పేర్కొన్నారు.

**"ప్రతిభకు చోటు లేని యీ క్షితితలాన**
**కుల మహా వ్యాధి కాంద్రించు కువలయాన**
**ఇల్లు వాకిలి లేకన యీ విధాన**
**పరమతృప్తియై నేనురా బ్రతుకుచుంటి."** నని సగర్వంగా చెప్పుకున్నారు.

# 4

# ఆధునిక సాహిత్య రంగంలో జ్ఞానానందకవి ప్రస్థానం

ఆధునిక సాహిత్యంలో భావకవిత్వం, దిగంబర కవిత్వం, గేయ కవిత్వం, వచన కవిత్వం, దళితకవిత్వం, స్త్రీవాదం, నానీలు, హైకులు, మైనారిటీ కవిత్వం మొదలైన అనేక ప్రక్రియలు ప్రభవించాయి.

సంప్రదాయ కవిత్వం రాయడం కత్తిమీద సాము వంటిది. గణాలు సరిపోవాలి. యతిప్రసాలు సక్రమంగా ఉండాలి. రచనా శైలీ విన్యాసం కుంటుపడక ఝరీ సదృశంగా ధారాపాతంగా ఉండాలి. అవి చాల కట్టు బాట్లుతో ఇమిడి ఉన్న విధానాలు. ఈ కట్టుబాట్లను తెంచుకొని దాటి వెళ్ళిన వారు వచనకవులు తదనంతర కవులు కూడా. సంప్రదాయబద్ధమైన పద్ధతిలో పద్యాన్ని రాసిన వారి కవితల్లో ఆధునిక దృక్పథం కనిపిస్తుంది. సమాజ శ్రేయస్సుకు సముజ్జ్వల చైతన్యానికి, సామరస్యానికి, సౌజన్యానికి దోహదం కల్పించే రచనలు ఏకాలమైన ప్రజలగుర్తింపు పొందుతాయి. మనం అనుకున్నట్టు సమాజ శ్రేయస్సుకు ఫలానా ప్రక్రియ అని చెప్పడానికి వీలులేదు. ఏ ప్రక్రియ అయిన సమాజ చైతన్యానికి దోహదం చేస్తే ఆప్రక్రియకు సమాజంలో సుముచిత గౌరవం నిరంతరం లభిస్తుంది. జ్ఞానానందకవి రచనలు సమకాలీన సమాజ చైతన్యానికి ఆలవాలమైనవి.

ఆధునిక సాహిత్య రంగంలో జ్ఞానానందకవి గారికి విశిష్టమైన స్థానం ఉంది. సంప్రదాయమైన ఛందస్సులో రాసే కవికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉండాలి. ఆ లక్షణాలన్ని మనకు జ్ఞానానంద కవి గారిలో కనిపిస్తాయి. ఛందస్సులో ముఖ్యమైంది శైలి. శైలిని పదాల పొందికగా మనం భావిస్తే సందర్భాన్ని బట్టి ఉద్ధతమైన సమాసాలు రచించడం దగ్గర నుండి అతి సులభమైన భాషలో ఔచిత్యాన్ని బట్టి చెప్పడం దాకా శైలి విస్తరిస్తుంది. జ్ఞానానంద కవి గారు ఈ రెండు విధాలైన శైలినీ మలచుకోగలరు. భావానుగుణంగా వీరు రచించిన అమ్రపాలి కావ్యం మంచి ఉదాహరణ.

విశ్వనాథ వారికి శిష్యులైన పిమ్మట ప్రౌఢసమాస పటిమతో రచనచేసిన ఈ కవి జాషువా పద్య సరళి వైపు ఆకర్షితులై ఆతరహా పద్యాలు కూడా చెప్పారు. అచిరకాలంలోనే ఈ రెండు తత్త్వాలను పెనవేసుకొనిపోయి ఒక కొత్త బాణి జ్ఞానానందకవి బాణిగా స్థిరపడింది. అందువల్ల ఇటు తెనుగునుడికారపు సారళ్యం అటు శబ్దసౌష్టవ సారమ్యం వీరి రచనల్లో సర్వత్రా కనిపిస్తాయి.

**"కమ్మని తేటతెన్గు నుడి కారపు సొంపు రసార్ద్ర దివ్యభా**
**వమ్ము లిఖింప నేర్పు ప్రతిభాయుతుడైన కవీంద్రుదొడ్డగం**
**ధమ్మున నుండుగాని కవనమ్ము రచింప నెరుంగలేనిద**
**ద్దమ్మ కలానికీ విషయమందునె తన్నుక చచ్చెనేనియున్."**

- పాంచజన్యం . పుట - 34.

విశ్వనాథతోగల పరిచయం వారి ఆశీస్సులు అందుకున్న జ్ఞానానందకవి కావ్యాలకు విశ్వనాథవారు ముందు మాట రాసారు. అశీస్సులను అందించారు. ఆ కావ్యాలకు విశ్వనాథవారి అభిప్రాయాలను గమనిద్దాం.

**నాశిష్యుండును సాధువేకవియు జ్ఞానానందమీ సాధువే**
**ళాశిష్టంబు నదృష్టమందెడిని వాల్లభ్యంబు దీపింపగన్**
**ఆశీర్యోగ్యుడు యోగ్యుడుక వనశుభ ప్రారంభసంపత్తికిన్**
**ఆశీస్సంతతినిత్తు నీ శుభవివాహ స్వేచ్ఛవేళన్బడిన్**

డా॥ఎస్.టి. జ్ఞానానందకవి జీవితం, వాఙ్మయం పుట - 53

జానానందకవి ఆశీస్సులు - నీ గోల్కొండ చదివాను. దివ్యముగా నున్నది.

నీవు కవివి. నిస్సంశయముగా కవివి. కవికి ప్రధానముగా రెండు భగవద్దత్తము లైన గుణములుండవలయును. ఒకటి న్యాయమైన సద్విషయము నందు విలక్షణమైన యావేశము రెండు శబ్దములను కొల్చుటలో నిదియని చెప్పరానిది. భావకులకు మాత్రమే తెలియునది యునగునొక సంశ్లేష. ఈ రెండును నీకు భగవద్దత్తములై యున్నవి. పాండిత్యమున్న చాలా మంది యందు నివియుండవు. నీయందు కలవు.

అక్కన్న మాదన్న మీద నీవు వ్రాసిన పద్యములు నీయాత్మలోనొక గొప్ప కవితాదేవి నృత్యము చేయుచున్నదని తెలియజేయుచున్నవి. ఆంధ్రకవితా శారదమీయందీ రీతిగా నృత్యము చేయుచున్నందులకు నా హృదయమెంత యేని సంతోషించుచుండును. ఆ సంగతి మీకు తెలియును. మీరయినను సంప్రదాయాంధ్ర కవితాశారదను పరిత్యజింప కుందురుగాక-

విజయవాడ

2-11-1963

విశ్వనాథ సత్యనారాయణ

పీఠికలు- పుట -231

విశ్వనాథ పీఠికలు - 1

విజయాభిషేకం - 4, 1966

చిరంజీవి జ్ఞానానంద కవి నాకు శిష్యుడా ఈనాటి కవులలో నుత్తములలో నొకడని చెప్పినచో శిష్యాభావనముకానేకాదు. ఇతని పద్య రచన ధారాశుద్ధి కలిసి సంస్కృతమధుర సమాస భూయిష్టమై యుండును. పద్యమును శ్రావ్యముగా జదువగలడు. 8, 9 కావ్యాలు రాసినాడు. అదృష్టమొకటి యే కొఱతగా కనబడుచున్నది.

ఇతనికి సర్వదా ఆయురారోగ్యములు సంపదయు, గీర్తియు నితోధిక కవితా వ్యాసంగాలు, కావ్య నిర్మాణశక్తియు గలుగవలెనని భగవంతుని ప్రార్థించుచున్నాను.

ఈ విజయాభిషేకములోని శీర్షికలయందలి పద్యములన్నియు పరమ రమణీయములుగానున్నవి.

ఇతడితరుల నాశ్రయించుట యెఱిగినవాడు కాదు.

ఈ పట్టుకొన్నకొమ్మ చేవగల కొమ్మగా కనిపించుచున్నది అగుతమని ఆశించుచున్నాను.

విజయవాడ

23-13-1966 విశ్వనాథ సత్యనారాయణ

పీఠికలు - పుట - 87

అక్షరాభిషేకము - 1971

ఇది సురగాలి తిమోతి జ్ఞానానందకవి రచించిన అక్షరాభిషేకమను గ్రంథము. అప్పుడప్పుడు రాసిన అనేక పద్యములు క్రోడీకరింపబడినవి.

ఒక కవి యొక్క కవితాశక్తి పుస్తకమునకు పేరు పెట్టుటలోనే కొంత తెలియును. అక్షరాభిషేకమన్న యీ పేరు చాల బాగుంది.

ఇతడు పద్యమును మంచి ఠీవిగా రాయగలడు. జాషువా కవియితని కన్న ముందు పుట్టినాడు ఆకీర్తి అతడు చాల గడించినాడు. ఇతడే మొదట పుట్టినచో ఆకీర్తి యితనికే వచ్చెడి దేమో అన్నట్లు రాయగలడు. కొన్నింటిలో నితనికంటే నీతడు దిట్టమతి కొన్నింటిలో నీతని కంటే నితడు దిట్ట.

తెలుగు పద్యము రాయుటలో నితనికి కొన్ని మంచి యొడుపులు తెలియును. ఇతని పద్యము ప్రసిద్ధులైన చాలా మంది పద్యము కంటే బాగుగా నుండును. ఇతని ఈ పుస్తకములో నుండి ఇతని కవితాశక్తికి చాల ఉదాహరణములు చూపించగలుగును.

కొన్ని పద్యములలో నితడు పద్యమును పూర్తి చేయునప్పుడు కొన్ని మంచి సంబోధనలు కొన్ని సమాసములు చేర్చును. అది పద్యమునకొక శోభదెచ్చెడి లక్షణము.

"దుర్గాదేహభాగేశ్వరా!. కొనుమ యేటికోళ్ళ"
నిగ్గంబగ్గు పూజాంజలుల్
మనుష్యుల ధార్మికస్థితిన్ కంచే చేనును మేసినట్టుగాన్."
ప్ర పూజ్యజ్ఞాన పీయూషముల్
భారత విస్ఫూర్త్యద్యశోడిండిమల్
కుజన సంఘ క్రూరశార్దులముల్
ఇవిగాక మరికొన్ని చాల చూపించవచ్చును.
ఇతని వస్తువులను గొల్చి వ్రాయనక్కరలేదు.
ఇతనికి విద్వత్కవి అని బిరుదు కలదు.
శాబ్దికముగా నితడు కొన్ని సాహసములు చేయును
ఇతడు వయసులోనున్నాడు. కవితావేశము కలవాడు.
కవితాశక్తిగలవాడు. ఇంకను గ్రంథములు నిస్సంశయముగా రాయగలడు. నాశీర్వదించుచున్నాను.

3-9-1971 విశ్వనాథ సత్యనారాయణ

విశ్వనాథ అసంకలిత సాహిత్యం పుట-93

## అక్షరగుచ్ఛము - 2

జ్ఞానానందకవికి ఆశీర్వచనములు. నీకు కళాప్రపూర్ణ బిరుదు వచ్చింది. అకాడమి బహుమానము వచ్చింది. చాలా గ్రంథాలు రాసినారు. ఆధునిక కవీశ్వరులలో నిస్సందేహముగా నీకు స్థానమున్నది. ఇంకను నీ పుస్తకము మీద ఎవరో అభిప్రాయములు రాయుట నా ఉద్దేశ్యములో అనవసరము నీకొక శైలి కలదు. నీ పద్య లక్షణము నీదిగా ఏర్పాటైపోయినది.

ఆశీర్వచనములు

విజయవాడ
4-1-1976

విశ్వనాథ సత్యనారాయణ
పీఠికలు - పుట - 106

కలమెత్తినా

గళమెత్తినా

జ్ఞానానందకవి

జనావళిని అలరిస్తారు - దాశరధి

జ్ఞానానందకవి లేఖినీ చుంబనంతో ప్రతిసాధారణ విషయం అసాధారణ కవిత్వ రూపం ధరించి సర్వాంగ సుందరంగా రూపొందుతుంది. కవిగారి కీర్తి తెలుగు నేల నాలుగు చెరగుల శరచ్చంద్రికల వలె వ్యాపించింది. వారిని ఎరుగని తెలుగువాడు లేడు.

- కూలీ నుండి కళాప్రపూర్ణ వరకు - పుట - 40

నీ రచన నిగ్గు తేలిన రచన. రాను రాను దేశం నిన్ను గుర్తించినీ మనఃక్లేశాన్ని తీరుస్తుంది. అనుమానము లేదు. వెనుకంజ వేయక ముందుకు సాగిపోవలసిందే.

- జాషువా గారు

"చచ్చిపోయిన తెలుగు పద్య శిల్పమును తిరిగి బ్రతికింపగల మృత సంజీవని విద్య సాధించిన అధునిక కవుల్లో శ్రీ జ్ఞానానందకవి ప్రాతః స్మరణీయులలో ఒకరు." అని నండూరి రామకృష్ణమాచార్యులుగారు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

- కూలీ నుండి కళాప్రపూర్ణ వరకు - పుట - 43

జాషువా కవిగారి వలె మీరు ఖండకావ్యానికి నూతన శోభలను సమకూర్చినారు. పద్యకవితకు ప్రాధాన్యం తగ్గుతున్న ఈ కాలంలో కూడా పద్యాలు రాసి, ప్రశస్తి పొందుతున్న వారు జ్ఞానానందకవి.

– దేవులపల్లి రామానుజరావు

– కూలీ నుండి కళాప్రపూర్ణ వరకు – పుట – 40

ఒక్కమాటలో చెప్పాలంటే అచ్చమైన అనుభూతి అసలైన పలుకుబడి శ్రీ జ్ఞానానందకవి గారిని అందలమెక్కించే ముఖ్య లక్షణం.

– డా॥ సి. నారాయణరెడ్డి

శ్రీజ్ఞానానందకవి ఉత్తమమైన కవులు. మతాతీతులు. వారి కవితా వైభవం వాగ్దేవికి అమూల్యాలంకారం. ఎన్నో గ్రంథాలు రాసి తెలుగుదేశంలో ప్రతిష్టగాంచారు. నిర్మోహమాటంకు, నిష్కల్మషభావంనకు శ్రీ జ్ఞానానందకవి ప్రతీక అని గౌతమీకోకిల వేదుల సత్యనారాయణ శాస్త్రిగారు ప్రశంసించారు.

కవిని బ్రతికించేది కవితాశక్తికాని ద్రవ్యం కాదని, తాత్కాలికంగా ఓటమి పొందినా శాశ్వత జీవనం కవిత్వం ఉన్న కావ్యానికి దక్కుతుందని బిరుదులు సన్మానాలు నిర్మాణమవుతున్న అక్షరాలకు ప్రాణం పొయ్యలేవని బలవత్తరమైన అక్షరానికి నాశనం లేదని ప్రముఖ విమర్శకులు కార్తీక అన్నమాటలు జ్ఞానానందకవి కవిత్వానికి అద్దం పట్టాయి.

**అతడు కవిసార్వభౌముడు**
**అతడు రసకళాప్రపూర్ణుడద్భుత కృతి స**
**మ్మతి కవి జ్ఞానానందుం**
**గగదాకవి పొందుగాతయైశ్వర్యంబుల్.**

– ఆచార్య తిరుమల

Dr. Gnananda Kavi is a Poet of repute rendering manifold service to his mother tongue Telugu.

- Justice Avula Sambasiva Rao
17-2-1982

You have acquired the gift of writting poetry by birth and your verse embodies all the significant trends ofthe Telugu for over a thousand years.

R.S. Sudarshanam

9-4-1980

రిక్షాపై కవిరాజు శుభ్రతరకీర్తిప్రోల్ల సద్దేహుడై
దీక్షా దక్షత కాకినాడ పురవీధీ రమ్య తేజస్వియై
సాక్షాత్ శ్రీ కవిసార్వభౌముడనగా సంచారముంజేసెడిన్
అక్షితాంధ్ర కవిత్వధూర్వహుడు జ్ఞానానందుడుత్సామియై

– గుబ్బల మాధవమూర్తి

సహజ పాండిత్యమునకు దర్శనము గాంధి
అమర గీత రసజ్ఞుల యాత్మ వీధి
హత్తుకొన్నది భారతి మొత్తు కొనదె
కవికి సహజింపు లేవడిగాంచుకతన

– మాధవపురి వేంకట రత్నకవి.

అయ్యదేవర యాశీస్సులంది విశ్వ
నాథుని గృపాకలన కవినాధుడవయి.
హైదరాబాదు ఢిల్లీ పురాదులందు
గాంచి నావు సన్మానముల్ కవి వతంస

– సున్నం వీరరాజు

జ్ఞానానంద కృతిన్ రచి
తానేక కృతిన్ రసజ్ఞులంచిత సభస
మ్మా నించుట పెందేరము
తో నించుటకని కరంగుదురు తెల్గు ప్రజల్

– తుమ్మల సీతారామమూర్తి

పలికితివా పచ్చి బండలు బద్ధలై
జలజల నానంద జలములూరు
పాడితివా సర్వ పండితామోదమై
భళి భళీ! యన్న శబ్దములు మొలుచు
వ్రాసితివా నవరసములు చిప్పిల్ల
మధుర కావ్యంబులై మహిని నిల్చు
కదలితివా మహాకవి కుంజరంబులు
గుంపులై నీ ముందు పొంపుదనరు.
సాహితీ కృషీవల నీదిల సస్యరమయి
పండి పులకించె కీర్తి సంపదలతోడ
తనరు నీ వామ పాద పద్మమ్ము నందు
గండపెండేర మీనాడు ఘల్లుమనియె.

– ఎంపి. జానుకవి.

జ్ఞానానంద కవీంద్రుడొక్కరుడు ప్రజ్ఞాశాలి పూర్వాంధ్ర వి
జ్ఞానాం బోధి గంభీరు డీహితునివా బ్జైపుణ్య మగ్గింపగా
లేనంచున్ వచియించె నొక్కరుడు మీ వృత్తాంతమాలించితిన్
ఏ నెంతో ముద మందితిన్ కవి! తిమోతీ! పద్యకావ్యాకృతీ.

– షేక్ ఆలీ

ప్రముఖ కవి, జ్ఞానపీఠాన్ని మొదటిసారిగా అందుకున్న విశ్వనాథ సత్యనారాయణగారి పీఠికలను, ఇతర ప్రముఖకవుల అభిప్రాయాలను ఈ కవి రచనా విధానాన్ని బట్టి చూస్తే ఆధునిక సాహిత్య రంగంలో పద్మశ్రీ జ్ఞానానంద కవిగారు ప్రముఖ పద్యకవి అని చెప్పవచ్చు.

## ఉపయుక్త గ్రంథసూచి.

అనంత కృష్ణ శర్మ - రాళ్ళపల్లి - సారస్వత లోకం

అసంకలిత సాహిత్యం - పీఠికలు - విశ్వనాథ సత్యనారాయణ. విశ్వనాధభారతి ప్రచురణ - 1996

జ్ఞానానందకవి సురగాలి - గోల్కొండ కావ్యం. 1963

జ్ఞానానందకవి సురగాలి - ఆమ్రపాలి 1972

జ్ఞానానందకవి సురగాలి - దేశబంధు అయ్యదేవర కాళేశ్వరరావు 1956

జ్ఞానానందకవి సురగాలి - రాజధాని 1987

జ్ఞానానందకవి సురగాలి - తరంగ మాల 1944

జ్ఞానానందకవి సురగాలి - వివేకానందగానం 2000

జ్ఞానానందకవి సురగాలి - క్రీస్తు ప్రబంధం 2005

జ్ఞానానందకవి సురగాలి - విజయాభిషేకం 1966

జ్ఞానానందకవి సురగాలి - కూలీ నుండి కళాప్రపూర్ణ వరకు 1988

జ్ఞానానందకవి సురగాలి - అక్షరాభిషేకం 1971

వెంకటరామనరసింహం కాకర్ల - సాహిత్య దర్శనం

డా॥ శరత్ జ్యోత్స్న రాణి - స్వాతంత్ర్యానంతర కవిత్వం - వస్తువు రూపం శిల్పం - 2003

డా॥ శరత్ జ్యోత్స్న రాణి - డా॥ ఎస్.టి.జ్ఞానానందకవి జీవితం వాఙ్మయ సూచి- 1994

Blank Page

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతికశాఖ, సాంస్కృతిక మండలి

ప్రచురణ, ముద్రణ & పంపిణీ
తెలుగు అకాడమి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు భాషా సంస్థ
హిమాయత్‌నగర్, హైదరాబాదు
email : info@teluguacademy.net
web : www.teluguacademy.net